www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 4-11-2024 | పేజీలు: 14 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 199

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal |
Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: తదియ రా. 11.25 తదుపరి చవితి; నక్షత్రం: అనూరాధ ఉ. 8.04 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: మ. 2.03-3.46; దుర్ముహూర్తం: మ. 12.21-1.06, మ. 2.37-3.22; అమృతఘడియలు: రా. 12.19-2.02; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.18; సూర్యాస్తమయం: 5.38

షుగర్ ఉన్నా లేనట్టే!



రక్తంలో చక్కెర స్థాయి ఆధారంగా పని చేసే స్మార్ట్ ఇన్సులిన్

ఇన్సులిన్ హార్మోన్‌లో రెండు చోట్ల మార్పులు చేయడం ద్వారా 'ఎన్ఎన్‌సీ 2215' అభివృద్ధి

14

యూకే, డెన్మార్క్ 'ఫార్మా' శాస్త్రవేత్తల ఘనత

రూ.27 లక్షల కోట్ల క్యాష్!



బఫెట్ వద్ద 32,500 కోట్ల డాలర్ల నగదు

ఆపిల్, అమెరికా బ్యాంక్‌లో వాటా విక్రయం

సొంత సంస్థ బెర్క్‌షైర్ నుంచి లాభాల వెల్లువ

కుప్పలు కుప్పలుగా పోగుబడిన నగదు

రూ.82 లక్షల కోట్లకు బెర్క్‌షైర్ మార్కెట్ విలువ

2



2

రూ.25 వేల కోట్ల అమ్మకాలు

అమెజాన్‌లో 1.6 కోట్ల షేర్లను విక్రయించిన జెఫ్ బెజోస్

విలువ 300 కోట్ల డాలర్లు.. ప్రపంచ ధనికుల్లో 2వ స్థానానికి

అంతరిక్షం, మీడియా రంగాల్లోకి పెట్టుబడుల విస్తరణ

రూ.7200 కోట్లు కట్టండి



ఈ నెల 7లోగా చెల్లించకపోతే విద్యుత్తు ఆపేస్తాం

బంగ్లాదేశ్‌కు అదానీ పవర్ కంపెనీ హెచ్చరిక

కొన్ని నెలలుగా పేరుకుపోయిన బకాయిలు

అక్టోబరు ఆఖరు నుంచి కరెంటు సరఫరా తగ్గింపు

భారత మార్కెట్లో ఆర్డర్ల కోసం ప్రయత్నాలు

2

సంజయ్ స్కామ్!

ఖర్చు రూ.3.10 లక్షలు.. స్వాహా 1.16 కోట్లు

నాటి సీఐడీ చీఫ్ చేసిన 'క్రైమ్'

అట్రాసిటీ చట్టంపై ఎస్సీ, ఎస్టీలకు 'అవగాహన' పేరిట రూ.1.19 కోట్లు డ్రా

అడ్డగోలుగా ప్రైవేటు ఏజెన్సీతో ఎంవోయూ

ఈ ఏడాది జనవరిలో 25 సమావేశాలు

24 చోట్ల ప్రభుత్వ కార్యాలయాల్లోనే

అద్దె లేకున్నా లక్షల్లో దొంగ బిల్లులు

సీఐడీ సిబ్బంది తమ సెల్‌ఫోన్లతో తీసిన వీడియోలకూ లక్షల్లో బిల్లులు

విజిలెన్స్ విచారణలో బాగోతం వెలుగులోకి

సీఐడీ అంటే... నేర పరిశోధన విభాగం. క్లిష్టతరమైన కేసులను దర్యాప్తు చేసి నేరం చేసిన వారికి శిక్షపడేలా చేయడం ప్రధాన విధి. ఇది అందరికీ తెలిసిందే. కొత్త విషయం ఏంటంటే... గత ప్రభుత్వంలో సీఐడీ చీఫ్‌గా పనిచేసిన సంజయ్ నేర పరిశోధనపై గాక 'నేరాన్వేషణ'పై దృష్టి పెట్టారు. దళితులకు అట్రాసిటీ చట్టంపై అవగాహన కార్యక్రమం పేరిట 3.10 లక్షలు ఖర్చు చేసి, ప్రైవేటు ఏజెన్సీ పేరిట ఏకంగా రూ.1.16 కోట్లు నొక్కేశారు.



ఈ ఏడాది జనవరిలో రాష్ట్రంలో 25 చోట్ల సదస్సులు నిర్వహించారు. ఇందుకోసం 24 చోట్ల ప్రభుత్వ భవనాలు వాడుకున్నారు. ఒక్కచోట మాత్రం ఓ ప్రైవేటు హాల్ తీసుకున్నా యజమాని అద్దె తీసుకోలేదు. అంటే... అద్దె ఖర్చు రూపాయి కూడా కాలేదు. ఇక సమావేశాలకు ప్రభుత్వ ఫర్నిచరే వాడారు. పోలీసుల కార్యక్రమం కదా అని టీ, స్నాక్స్ ఎవరెవరో సమకూర్చారు. వీడియోగ్రఫీ కోసం సీఐడీ అధికారులే తమ సెల్‌ఫోన్లు వాడారు. మొత్తం ఖర్చంతా 3.10 లక్షలే. అయితే అద్దెలు, వీడియోలు, భోజనాల కోసం లక్షల్లో ఖర్చు పెట్టినట్టు దొంగ బిల్లులు పెట్టారు. ప్రైవేటు ఏజెన్సీ పేరిట రూ.1.19 కోట్లు డ్రా చేసుకున్నారు.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం ఏదైనా కార్యక్రమానికి వంద రూపాయలు ఇస్తే పదో, పాతికో తినేసి మిగతాది ఖర్చు చేసే వాళ్లున్నారు. కానీ రెండు రూపాయలు ఖర్చు చేసి మిగతా 98 రూపాయలూ వింగేస్తే..? ఇలాంటి కేసుల గురించి ఇప్పటి వరకూ బహుశా ఎవరూ విని ఉండకపోవచ్చు. జగన్ ప్రభుత్వంలో సీఐడీ చీఫ్‌గా పనిచేసిన సంజయ్ ఈ 'ఘన కార్యక్రమం' వెలగబెట్టారు. దళితుల పేరుతో ప్రభుత్వ సొమ్మును జేబులో వేసుకున్నారు. ఎస్సీ, ఎస్టీలపై నేరాల కట్టడిలో భాగంగా అట్రాసిటీ చట్టంపై ఆయా వర్గాల్లో

మిగతా 14వ పేజీలో...

అధికారి కాదు.. కార్యకర్త!

వైసీపీ నేతలకు వేల కోట్లు దోచిపెట్టారు

13

రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి సత్యనారాయణపై బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ ఫిర్యాదు

ఆర్‌బీఐ నుంచి తెచ్చిన రూ.4,000 కోట్ల అప్పునూ దారిమళ్లించారని ఆరోపణ

విచారణ జరపాలని కేంద్ర సిబ్బంది శాఖకు వినతి.. పరిశీలించాలంటూ డీవోపీటీ ఆదేశాలు

ఫైలు సిద్ధం చేసిన పాలనా విభాగం.. బయటపడేందుకు సత్యనారాయణ యత్నాలు

బీమా బూచోడు ఔట్!

ఏపీజీఐసీఎల్ కన్సల్టెంట్ సుజిత్‌పై వేటు

రాష్ట్ర ఆర్థిక శాఖ ఆదేశాలు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

13



పరాభవం పరిపూర్ణం

న్యూజిలాండ్‌తో మూడు టెస్టుల్లోనూ పరాజయం

సొంత గడ్డపై టీమిండియా 12 ఏళ్ల విజయ పరంపరకు బ్రేక్

పన్నెండేళ్లుగా సొంతగడ్డపై అపజయమన్నదే లేదు.. వరుసగా 18 సిరీస్‌లతో అజేయమైన జైత్రయాత్ర..



ఉద్దండులైన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా, అశ్విన్ లాంటి ఆటగాళ్లున్న భారత్‌ను వారి పిచ్‌లపై ఓడించడం దాదాపు అసాధ్యం అన్న భావన..! కానీ, అంచనాలను తారుమారు చేస్తూ టీమిండియా గెలుపు కోటను న్యూజిలాండ్ అలవోకగా బద్దలు కొట్టింది. సగటు అభిమాని కలలో కూడా ఊహించని విధంగా రోహిత్ సేనకు ఘోర పరాభవాన్ని మిగిల్చింది. ఆదివారం ముగిసిన ఆఖరి టెస్టులోనూ విజయదుందుభి మోగించిన కివీస్ 3-0తో టెస్టు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి సరికొత్త చరిత్రను లిఖించింది. 0-2తో ముందుగానే సిరీస్‌ను చేజార్చుకొన్న భారత్.. వాంఖడేలోనైనా గెలిచి కనీసం పరువు దక్కించుకొంటుందనుకున్నా అదీ జరగలేదు. ఫలితంగా తొలిసారిగా భారత జట్టు స్వదేశంలో 0-3తో వైట్‌వాష్‌కు గురైన అపప్రదను మూటగట్టుకుంది. 36 ఏళ్లుగా భారత గడ్డపై ఒక్క టెస్టు మ్యాచ్ కూడా నెగ్గని కివీస్ ఈసారి ఏకంగా క్లీన్‌స్వీప్ చేయడం విశేషం.

- వివరాలు స్పోర్ట్స్‌లో



ట్రంపా.. కమలా?

అమెరికా ఎన్నికల్లో గట్టి పోటీ

2

ఇద్దరూ మ్యాజిక్ ఫిగర్‌కు దగ్గర్లో!

ప్రచారానికి మిగిలింది కొన్ని గంటలే

కమల-ట్రంప్ సుడిగాలి పర్యటనలు

తల్లిని గుర్తుచేసుకుంటూ.. భారతీయులకు కమలా హ్యారిస్ వ్యాసం

ఎవరు గెలిస్తే.. ప్రపంచానికేంటి?

అంతర్జాతీయ సమాజంపై అమెరికా ముద్ర

నాటో విషయంలో ఇద్దరిదీ చెరోదారి

కమల వస్తే అంతర్జాతీయ అజెండా

9 హైస్పీడ్ కారిడార్లు!

రాష్ట్రానికి రహదార్ల వరం.. దేశవ్యాప్తంగా 59 వేల కి.మీ. కొత్త రోడ్లు

పోర్ట్ అనుసంధాన రోడ్లు, మిస్సింగ్ లింక్, రద్దీ ఉండే చోట్ల రోడ్ల నిర్మాణాలు కూడా..


తెలంగాణకూ 6-7 కారిడార్లు

విజన్-2047 కింద దేశవ్యాప్తంగా ప్రాజెక్టులు

స్ట్రాటజిక్, ఇంటర్నేషనల్ రోడ్లు, పట్టణ ప్రాంతాల్లో ఇరుకు రోడ్ల విస్తరణ పనులు

కేంద్ర కేబినెట్ ఆమోదించాక పనులు మొదలు

హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాలను పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని మోదీ సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా హైస్పీడ్ కారిడార్లు, పోర్టు కనెక్టివిటీ, స్ట్రాటజిక్, ఇంటర్‌నేషనల్ కనెక్టివిటీ, లింక్, ఫీడర్ రోడ్లన్నింటినీ కలిపి దాదాపు 59 వేల కిలోమీటర్ల మేర నిర్మాణాలను చేపట్టాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. విజన్-2047లో భాగంగా చేపడుతున్న ఈ నిర్మాణాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు పలు ప్రాజెక్టులు మంజూరు కానున్నాయి. ప్రాథమిక నివేదిక ప్రకారం ఏపీ, తెలంగాణ మీదుగా పలు హై స్పీడ్ కారిడార్లు నిర్మించనున్నారు. ఏపీలో పోర్టులు ఉండడంతో వాటిని అనుసంధానించేలా పలు రహదారులు, రెండు రాష్ట్రాల్లోని పట్టణ ప్రాంతాల్లో ఇరుకుగా ఉన్న రోడ్లను వెడల్పు చేయడంతోపాటు మిస్సింగ్ లింక్ రోడ్లను నిర్మించనున్నారు. స్ట్రాటజికల్, ఇంటర్నేషనల్ రోడ్ల కనెక్టివిటీ కింద తెలుగు



మిగతా 13వ పేజీలో...



రోడ్లపై గోతులకు గుడ్ బై

3

రాష్ట్రంలో 30,274 కి.మీ. రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం నిర్ణయం

ఏడాదిలో బాగు చేయాలని ప్రణాళిక

ఐదేళ్ల తర్వాత ఆర్‌అండ్‌బీకి చేతినిండా పని

డ్రైనేజీలు, కల్వర్టులు కూడా రిపేర్

ఇప్పటికే రూ.861 కోట్ల కేటాయింపు

ఝార్ఖండ్‌లో ఉమ్మడి పోరస్మృతి!

2

గిరిజనులకు మినహాయింపు ఇస్తాం

5 లక్షల ఉద్యోగాలు.. 500కే సిలిండర్

మహిళలకు ప్రతినెలా రూ.2,100

బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల

84 వేల కోట్ల పెట్టుబడులు
5 లక్షల ఉద్యోగాలు

ఐదేళ్లలో ఎలక్ట్రానిక్స్, ఐటీ రంగంలో కల్పనే లక్ష్యం

పెట్టుబడి సంస్థలకు ప్రోత్సాహకాలు, మౌలిక వసతులు

సింగిల్ విండో విధానంలో 21 రోజుల్లో అనుమతులు

2024-29 ఎలక్ట్రానిక్స్ పాలసీ రూపకల్పన

ఇంటికో వ్యాపారవేత్త ఉండాలన్నదే ధ్యేయం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో ఐదేళ్లలో రూ.84,000 కోట్ల పెట్టుబడుల సమీకరణ... ఐదు లక్షల మందికి ఉద్యోగాల కల్పన... ప్రతి ఇంటా ఒక వ్యాపారవేత్త ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 2024-29 ఎలక్ట్రానిక్స్ పాలసీని రూపొందించింది. ఐటీ, ఎలక్ట్రానిక్స్ సేవలను విస్తృతం చేసేలా ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఐటీ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు బ్లూ ప్రింట్‌తో ముందుకు వచ్చే పరిశ్రమలకు సామర్థ్యాలను బట్టి భూ కేటాయింపులు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించింది. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న 20 క్లస్టర్లతో పాటు కొత్తగా మరో 29 ఐటీ క్లస్టర్ల కోసం 1.32 లక్షల ఎకరాలను

మిగతా 13వ పేజీలో...



3

గౌతమ్

మీ ఫ్యామిలీ మొత్తాన్నీ లేపేస్తాం

దళిత కుటుంబంపై వైసీపీ మూకల దాష్టీకం

టీడీపీ కార్యకర్తపై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

కేసు వెనక్కి తీసుకోవాలని బెదిరింపులు

భయంతో ఒంటికి నిప్పంటించుకున్న యువకుడు

80 శాతం కాలిన శరీరం.. పరిస్థితి విషమం

శ్రీసత్యసాయి జిల్లా మారాల గ్రామంలో దారుణం



మేం తప్పుకొంటాం!

108లు, 104ల నిర్వహణపై చేతులెత్తేసిన 'అరబిందో'

సెప్టెంబరులోనే ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈవోకు లేఖ

14

2 సంస్థలకు సబ్-కాంట్రాక్ట్ ఇవ్వాలని లేఖలో సూచన

వైసీపీ పాలనలో కాంట్రాక్టు దక్కించుకుని ఇష్టారాజ్యం

ప్రభుత్వం మారగానే ఆటలు సాగవని భావించి కొత్త ఎత్తులు

అయినా.. కొనసాగిస్తూనే ఉన్న ఆరోగ్యశాఖ అధికారులు

దీపావళి వేడుకల్లో కెనడా ప్రధాని

» భారత్,కెనడా మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతల వేళ చర్య



న్యూఢిల్లీ, నవంబరు 3: భారత్-కెనడాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్న వేళ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో దీపావళి వేడుకలు జరుపుకొన్న వీడియోని ఆదివారం సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "హ్యాపీ దీపావళి... ఈ వారం హిందువులతో ఎన్నో ప్రత్యేక సందర్భాలు గడిచాయి.." అని 'ఎక్స్'లో పేర్కొన్నారు. కెనడాలోని మూడు హిందూ ఆలయాలవారు బహూకరించిన కంకణాలను ట్రూడో చేతికి కట్టుకోవడం ఆ వీడియోలో కనిపించింది. "ఈ కంకణాలు అదృష్టాన్ని ఇస్తాయి.. రక్షణ కల్పిస్తాయి.. అవి ఊడిపోయేంత వరకు వాటిని నేను తొలగించను.." అని ట్రూడో తన పోస్టులో పేర్కొన్నారు. అక్టోబరు 31న కూడా ట్రూడో కెనడియన్లకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఇవాళ కెనడాతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మందితో దీపావళి జరుపుకోబోతున్నామని ఆ రోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరోవైపు, 2023 సెప్టెంబరులో నిజ్జర్ హత్య ఘటన తర్వాత భారత్-కెనడాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి.

వీధి కుక్కలకు బిస్కెట్లు.. ఉగ్రవాదికి బుల్లెట్లు
ఉగ్రకమాండర్‌ను ఎన్‌కౌంటర్ చేసిన బలగాలు

» శ్రీనగర్‌లో ఉగ్రవాదుల గ్రెనేడ్ దాడి..12 మందికి గాయాలు

శ్రీనగర్, నవంబరు 3: జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జరిగిన ఓ ఎన్‌కౌంటర్‌లో భారత బలగాలు అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించాయి. శనివారం లష్కరే తోయిబాకు చెందిన ఉగ్రకమాండర్ ఉస్మాన్‌ను మట్టుబెట్టాయి. ఈ ఆపరేషన్‌లో బిస్కెట్లది కీలక పాత్ర అని అధికారులు తెలిపారు. అనంత్‌నాగ్ జిల్లా ఖాన్యార్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నారనే సమాచారంతో శనివారం తెల్లవారుజామున బలగాలు రంగంలోకి దిగాయి. ఈ క్రమంలో సైనికులకు వీధికుక్కల రూపంలో సవాల్ ఎదురైంది. అవి మొరిగితే ఉస్మాన్ తప్పించుకునే అవకాశం ఉంది. దీంతో వ్యూహాత్మకంగా వ్యవహరించిన జవాన్లు అవి అరవకుండా ఉండడానికి దారిపొడవునా శునకాలకు బిస్కెట్లు అందిస్తూ వచ్చారు. ఈ వ్యూహంతో ఆపరేషన్ విజయవంతమైందని, ఇలాంటి సమయాల్లో వీధికుక్కల సమస్యకు పరిష్కారం దొరికిందని సీనియర్ అధికారులు తెలిపారు. మరోవైపు, ఆదివారం శ్రీనగర్‌లోని ఆల్‌ఇండియా రేడియో సమీపంలోని టూరిస్టు రిసెప్షన్ సెంటర్ దగ్గరలో గల మార్కెట్ వద్ద ఉగ్రవాదులు గ్రెనేడ్ విసిరారు. రద్దీగా ఉండే వారసంతలో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో కనీసం 12 మంది గాయపడ్డారు.

చెన్నైలో పారిశ్రామికవేత్త ఇంట్లో బాలిక హత్య

చెన్నై, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో ఓ పారిశ్రామికవేత్త ఇంటిలో పనిచేస్తున్న 16 ఏళ్ల బాలిక చిత్ర హింసలకు గురై హతమైంది. ఈ హత్యకేసులో ఆ పారిశ్రామికవేత్త, ఆయన భార్య సహా ఆరుగురిని నగర పోలీసులు అరెస్టు చేశారు. పాత కార్ల కొనుగోలు, అమ్మకాల వ్యాపారం చేసే పారిశ్రామికవేత్త మహమ్మద్ నిషాద్ చెన్నై అమింజికర్రై మెహతా నగర్, సదాశివ మెహతా వీధిలో నివసిస్తున్నారు. ఆయన ఇంటిలో తంజావూరుకు చెందిన బాలిక (16) గతేడాది నుంచి పని చేస్తోంది. ఇంటి పనులు సక్రమంగా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నిషాద్ ఆయన భార్య నజియా ఆమెను హింసించేవారు. ఆ నేపథ్యంలో దీపావళి రోజున బాలికను ఆ దంపతులతో పాటు నజియా స్నేహితుడు లోకేశ్, అతని భార్య జయశక్తి ఇస్త్రీ పెట్టెతో వాతలు పెట్టి, సిగరెట్‌తో కాల్చి చిత్రహింసలకు గురిచేసి. పొత్తికడుపులో కాళ్లతో తన్నారు. దీంతో ఆ బాలిక అపస్మారకస్థితిలోకి జారుకోవడంతో వారంతా భయంతో ఆమెను బాత్రూమ్‌లో పడేశారు. కాసేపటికి ఆ బాలిక ప్రాణాలు కోల్పోయింది. ఈ విషయం తెలిసి ఇంటికి తాళం వేసి నిందితులు పరారయ్యారు. ఆ తర్వాత మహమ్మద్ తనకు తెలిసిన అడ్వొకేట్ సాయంతో పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై అమింజికర్రై పోలీస్ ఇన్‌స్పెక్టర్ మణిశేఖర్ కేసు నమోదు చేసి బాలిక మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పంచనామా కోసం కీల్పాక్కం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో పారిశ్రామికవేత్త, ఆయన భార్య ఆ బాలికను చిత్రహింసలు పెట్టి హతమార్చినట్టు వెల్లడైంది. ఈ మేరకు మహమ్మద్ నిషాద్, నజియా, లోకేశ్, జయశక్తితో పాటు బాలికను పనిలో చేర్పించిన అడయార్ ప్రాంతానికి నిషాద్ అక్క సీమా, ఆమెకు తెలిసిన పనిమనిషి మహేశ్వరిని అరెస్టు చేశారు. అన్నానగర్ డిప్యూటీ కమిషనర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శంషాబాద్‌లో 3 విమానాలకు బెదిరింపులు

శంషాబాద్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాలకు బాంబు బెదిరింపుల పరంపర కొనసాగుతూనే ఉంది. ఆదివారం మూడు ఇండిగో విమానాలు, ఒక ఎయిర్ ఇండియా విమానంలో బాంబులు ఉన్నట్లు ఆగంతుకులు బెదిరింపు మెయిల్స్ చేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి పుణె వెళ్తున్న విమానానికి, బెంగళూరు నుంచి హైదరాబాద్ వస్తున్న విమానానికి, హైదరాబాద్ నుంచి గోవా వెళ్తున్న విమానాలకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. మరోవైపు, గోవా నుంచి కోల్‌కతా వెళ్తున్న ఇండిగో విమానంలో బాంబు ఉన్నట్లు బెదిరింపు మెయిల్ రావడంతో విమానాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. భద్రతా సిబ్బంది బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి బాంబులు లేవని తేల్చారు.

వాయుసేన- ఉబెర్ ఒప్పందంపై అభ్యంతరాలు

న్యూఢిల్లీ, నవంబరు 3 : భారత వాయుసేన, అమెరికాకు చెందిన రైడ్ షేరింగ్ యాప్ 'ఉబెర్' మధ్య ఇటీవల జరిగిన అవగాహన ఒప్పందంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఒప్పందంతో వాయుసేన సమాచార గోప్యతకు, వాయుసేన సిబ్బంది రక్షణకు ముప్పు పొంచి ఉందని వాయుసేన మాజీ ఉద్యోగులు, భద్రతా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఒప్పందం ప్రకారం వాయుసేన ప్రస్తుత, మాజీ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యుల రవాణా అవసరాలకు అనుగుణంగా ఉబెర్ ఓ ప్రత్యేక అప్లికేషన్‌ను వాయుసేనకు ఇవ్వనుందని సమాచారం. ఉబెర్ సేవలు వినియోగించుకోవడం వల్ల వాయుసేనకు సంబంధించిన కీలక సమాచారం, లొకేషన్లు, ఉద్యోగుల వివరాలు బయటి వ్యక్తులకు బహిర్గతం అవుతాయని వాయుసేన మాజీ ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. అంతేకాక, వాయుసేనలోని ప్రతి ఒక్కరిని బయటివారు లైవ్ ట్రాకింగ్ చేసే ప్రమాదం కూడా ఉందని పేర్కొన్నారు. దీంతో ఈ ఎంవోయూకు సంబంధించి సోషల్ మీడియాలో చేసిన పోస్టులను భారత వాయుసేన తొలగించింది. ఎంవోయూ అమలవుతుందో లేదో చూడాల్సి ఉంది.

స్పెయిన్ రాజుపై బురద విసిరిన వరద బాధితులు

వెలెన్సియా, నవంబరు 3: వరదలు వచ్చి సర్వస్వం కోల్పోయినా ప్రభుత్వం సకాలంలో సాయం చేయలేదంటూ స్పెయిన్ దేశం రాజు ఫెలిపే-4పై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనపై బురద చల్లి, కేకలు వేసి నిరసన తెలిపారు. గురువారం వచ్చిన వరదల కారణంగా 200మందికి పైగా ప్రాణాలు కోల్పోగా వేలాది మంది నిరాశ్రయులయ్యారు. వరద తీవ్రత అధికంగా ఉన్న వెలెన్సియా నగరం శివారు అయిన పైపోర్టాలో కనీసం 60 మంది మరణించారు. వరదబాధితులను పరామర్శించేందుకు తొలిసారిగా ఆదివారం ఆయన పైపోర్టాకు రాణి లెటిజియాతో కలిసి వచ్చారు. బాధితులతో మాట్లాడే ప్రయత్నం చేయగా తమకు సాయం అందలేదంటూ బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు బురద విసరగా అది ఆయన ధరించిన నల్లని రెయిన్ కోటుపై పడింది. అయితే, రాజు ఫెలిపే మాత్రం సంయమనం కోల్పోకుండా వారిని అనునయించారు. ఒక బాధితుడు ఆయన బుజంపై వాలి కన్నీరు పెట్టుకున్నాడు.

ట్రంపా.. కమలా?

» అమెరికా ఎన్నికల్లో గట్టి పోటీ

» ప్రచారానికి మిగిలింది కొన్ని గంటలే





న్యూయార్క్, నవంబరు 3: అగ్రరాజ్యం అమెరికా ఎన్నికలు తుది అంకానికి చేరుకున్నాయి. సోమవారం వరకే గడువు ఉండడంతో.. రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హ్యారిస్ స్వింగ్ రాష్ట్రాలు-- విస్కాన్సిన్, నార్త్ కరోలినా, మిషిగాన్, జార్జియా, పెన్సిల్వేనియాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ప్రజానాడిని పట్టుకుంటూ అమెరికా ఎన్నికలను అంచనా వేస్తున్న 272టువిన్ డాట్ కామ్, రియల్‌క్లియర్‌పాలిటిక్స్ డాట్ కామ్ వంటి సంస్థలు ట్రెండ్స్ క్షణక్షణం మారుతున్నాయని పేర్కొంటున్నాయి. 272 మ్యాజిక్ ఫిగర్‌కు కమల 44, ట్రంప్ 51 సీట్ల దూరంలో ఉన్నట్లు చెబుతున్నాయి. దీంతో కీలకమైన స్వింగ్ రాష్ట్రాలపై ఇరువురు అభ్యర్థులు దృష్టి సారించారు. మరోవైపు 'ఎర్లీ పోలింగ్' సదుపాయాన్ని 6.8 కోట్ల మంది అమెరికన్లు వినియోగించుకున్నారు. ఎన్నికల రోజు ప్రతికూల వాతావరణం, క్యూలైన్ల సమస్యను పరిష్కరించేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. కాగా, ముందెన్నడూ లేని విధంగా.. అమెరికా ఎన్నికలు అంతర్జాతీయంగా ఉత్కంఠ రేపుతున్నాయి. అందుక్కారణం.. ట్రంప్, కమలల్లో ఎవరు గెలిస్తే.. ఎలాంటి ప్రభావం ఉంటుందనే అంచనాలే..! ట్రంప్ తాను విజయం సాధిస్తే.. అంతర్జాతీయంగా అమెరికా పాత్రను పూర్తిగా మార్చేస్తానని ప్రకటించారు. కమల అంతర్జాతీయ అజెండాను మరింతగా పెంచుతానన్నారు. ఆమె గెలిస్తే.. నాటోలో అమెరికా పెద్దన్న పాత్ర కొనసాగనుండగా.. ట్రంప్ సభ్యదేశాలపై భారాన్ని పెంచే యత్నాల్లో ఉన్నారు. నాటో సభ్యదేశాల మిలిటరీ బడ్జెట్ మొత్తంలో 2/3 వంతును అమెరికా వెచ్చిస్తోంది. ట్రంప్ గెలిస్తే సభ్య దేశాలు తమ జీడీపీలో 2% నిధులను నాటోపై వెచ్చించేలా ఒత్తిడి తెస్తానని ప్రకటించారు. ట్రంప్ గెలిస్తే.. చైనా నుంచి జరిగే దిగుమతులపై 60-200% వరకు పన్ను(టారిఫ్) విధించే అవకాశాలున్నాయి. ఇతర దేశాల నుంచి దిగుమతులపై 20% పన్ను(యూనివర్సల్ టారిఫ్)ను అమలు చేస్తారని తెలుస్తోంది. ఇలాంటి చర్యలు వాణిజ్య యుద్ధాలు, ప్రతీకార చర్యలతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కుదుపులు తప్పవని ఆర్థికరంగ నిపుణులు భావిస్తున్నారు. పశ్చిమాసియాలో శాంతిస్థాపనకు అమెరికా, నాటో చర్యలు తీసుకోగా.. ట్రంప్ హయాంలో సేనల ఉపసంహరణ జరిగింది. ఫలితంగా అఫ్ఘానిస్థాన్ తిరిగి తాలిబాన్ల చేతుల్లోకి వెళ్లిపోయింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం విషయంలో కమల, ట్రంప్‌లది భిన్నస్వరం. బైడెన్ మాదిరిగా కమల కూడా నాటో ద్వారా మిలటరీపరంగా ఉక్రెయిన్‌కు మద్దతిచ్చే అవకాశాలుండగా.. ట్రంప్ బేషరతుగా రష్యాతో ఒప్పందం కుదుర్చుకునేలా ఉక్రెయిన్‌పై ఒత్తిడి తెస్తానని చెప్పారు. ట్రంప్ గెలిస్తే.. అమెరికాలో ఉన్న వలసదారులకు ఇబ్బందేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


భారత్‌తో అనుబంధంపై కమల వ్యాసం

భారతీయ-అమెరికన్ ఓటర్లలో 32% ట్రంప్ వైపు మొగ్గుచూపారని సర్వేలు వెలువడడంతో.. కమల నష్టనివారణ చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో తన తల్లి శ్యామల హ్యారిస్‌ను స్మరించుకుంటూ.. దక్షిణాసియా పత్రిక జాగర్నాట్‌లో సుదీర్ఘ వ్యాసం రాశారు. "నా తల్లి శ్యామల హ్యారిస్ 19 ఏళ్ల వయసులో అమెరికాకు వచ్చారు. ఆమె రెండు ప్రధాన లక్ష్యాలతో ముందుకు సాగారు. వాటిల్లో ఒకటి రొమ్ము క్యాన్సర్‌ను నివారించడం. రెండోది నన్ను, నా సోదరి మాయను క్రమశిక్షణతో పెంచడం. మాకు భారతీయ సంస్కృతిని, వారసత్వాన్ని గౌరవించాలని బోధించేవారు" అని ఆ వ్యాసంలో చెప్పుకొచ్చారు. రెండేళ్లకోసారి దీపావళి పండుగను జరుపుకొనేందుకు తమిళనాడుకు వస్తామని పేర్కొన్నారు. "నాకు గుర్తుంది. మా తాతగారు పీవీ గోపాలన్ రిటైర్ అయ్యాక.. రోజూ బీచ్‌లో వాహ్యాళికి వెళ్లేవారు. నా చిన్నప్పుడు నేనూ ఆయనతో నడిచేదాన్ని. ఆ సమయంలో ఆయన తన సహచరులతో ప్రజాస్వామ్యం, విలువల గురించి మాట్లాడేవారు" అని వివరించారు.

ట్రంప్ అయితే చంపడు!



అమెరికాలో పతాకస్థాయికి చేరుకున్న అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్‌కు బహిరంగ మద్దతు ప్రకటించిన ఈలన్ మస్క్.. ప్రస్తుత బైడెన్ పరిపాలనను, అధికార యంత్రాంగాన్ని దుయ్యబట్టే ఏ అవకాశాన్నీ వదులుకోవట్లేదు. తాజాగా ఆయన 'పీనట్' అనే ఉడతను న్యూయార్క్ రాష్ట్ర అధికారులు యుథనేషియా(కారుణ్యమరణం) చేయడంపై మండిపడ్డారు. "ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ ఉడతలను పరిరక్షిస్తారు" అని ట్వీట్ చేశారు. 'రిప్ (రెస్ట్ ఇన్ పీస్) పీనట్' అంటూ ఏడుపు ముఖం ఎమోజీని కూడా ఆ ట్వీట్‌కు జత చేశారు. ఇంతకీ ఆ ఉడత కథ ఏమిటంటే.. ఏడేళ్ల క్రితం పీనట్(ఉడత) తల్లి రోడ్డు దాటుతూ ఒక కారు కింద పడి చనిపోయింది. పీనట్‌ను మార్క్ లాంగో అనే వ్యక్తి తెచ్చి పెంచుకున్నాడు. ఆ ఉడతతో రకరకాల విన్యాసాలు చేయించి సోషల్ మీడియాలో పెట్టేవాడు. దీంతో అది బాగా పాపులర్ అయిపోయింది. అయితే, అక్టోబరు 30న న్యూయార్క్‌లోని పర్యావరణ పరిరక్షణ విభాగం (డీఈసీ) అధికారులు లాంగో ఇంటిపై దాడి చేసి, సోదాలు చేసి పీనట్‌ను, ఫ్రెడ్ అనే రకూన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటివల్ల మనుషులకు రేబిస్ వచ్చే ప్రమాదం ఉందంటూ తీసుకెళ్లి చంపేశారు! అధికారుల తీరును ఖండిస్తూ మస్క్‌తోపాటు వేలాదిమంది సోషల్ మీడియాలో బైడెన్ యంత్రాంగానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు.



రూ. 7,200 కోట్లు కట్టాల్సిందే!

» ఈ నెల 7లోపు చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేస్తాం

» బంగ్లాదేశ్‌కు 'అదానీ పవర్' హెచ్చరిక



న్యూఢిల్లీ, నవంబరు 3: ఈ నెల 7వ తేదీలోపు విద్యుత్ బకాయిలు చెల్లించకపోతే కరెంటు సరఫరాను నిలిపివేస్తామని బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని ఝార్ఖండ్‌లోని అదానీ పవర్ కంపెనీ హెచ్చరించింది. కరెంటు సరఫరాకు సంబంధించిన బకాయిలు 85 కోట్ల డాలర్ల (రూ.7,200 కోట్లు) మేర పెరిగిపోయాయని తెలిపింది. వాస్తవానికి, అక్టోబరు 31వ తేదీలోపే బకాయిలు చెల్లించాలని, లేదంటే, రూ.1500 కోట్లకు 'లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌సీ) ఇవ్వాలని బంగ్లాదేశ్ విద్యుత్ బోర్డుకు అదానీ కంపెనీ గతంలోనే తెలిపింది. ఈ మేరకు ఎల్‌సీ ఇవ్వటానికి బోర్డు అంగీకరించినప్పటికీ, అది విద్యుత్ కొనుగోలు ఒప్పందం మేరకు లేదని సమాచారం. దీంతో 31వ తేదీ నుంచి అదానీ పవర్ కంపెనీ బంగ్లాదేశ్‌కు సరఫరా చేస్తున్న కరెంటును తగ్గించింది. ఝార్ఖండ్ గొడ్డాలోని అదానీ పవర్ కంపెనీ మొత్తం సామర్థ్యం 1496 మెగావాట్లు. బంగ్లాదేశ్‌లో మరో 3 కంపెనీలు (వీటిలో ఒకటి భారత్ ఎన్టీపీసీతో కలిసి ఏర్పాటు చేసిన రాంపాల్ యూనిట్) విద్యుదుత్పత్తి జరుపుతున్నప్పటికీ.. అదానీ కంపెనీయే అతిపెద్ద సరఫరాదారుగా ఉంటోంది. అదానీ పవర్ కంపెనీకి బంగ్లాదేశే అతిపెద్ద కొనుగోలుదారుగా ఉంది. అయితే, షేక్ హసీనా పదవీచ్యుతితో బంగ్లాదేశ్‌లో అనిశ్చితి పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో, ప్రభుత్వం అదానీ కంపెనీకి బకాయిలు చెల్లించడం లేదు.

పశ్చిమాసియాలో బీ-52 యుద్ధవిమానాలు

» ఇజ్రాయెల్, అమెరికా పళ్లు విరిగేలా బదులిస్తాం: ఖమేనీ




టెల్‌అవీవ్, టెహ్రాన్, నవంబరు 3: అమెరికా బీ-52 భారీ యుద్ధ విమానాలను పశ్చిమాసియాకు తరలించింది. వీటితో పాటు ఫైటర్ జెట్లు, బాలిస్టిక్ క్షిపణులు, ట్యాంకర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను కూడా తరలించింది. అమెరికా ఇప్పటికే ఇజ్రాయెల్ గగనతల రక్షణ కోసం థాడ్ వ్యవస్థను మోహరించింది. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్‌ను కూడా అరేబియా సముద్రంలో నిలిపినట్లు సమాచారం. దీంతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. మరోవైపు, అమెరికా భారీ యుద్ధ విమానాలను పశ్చిమాసియాకు తరలించిన నేపథ్యంలో తమ అణు విధానాన్ని పునఃపరిశీలించాల్సి ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ సలహాదారు కమల్ ఖర్రాజీ ప్రకటన చేశారు. తమకు అణ్వాయుధాలు తయారు చేయగల సామర్థ్యం ఉందని ఆయన పునరుద్ఘాటించారు.

ఖమేనీ వార్నింగ్

ఇజ్రాయెల్, అమెరికాలకు పళ్లు విరిగేలా గట్టిగా బదులిస్తామని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ హెచ్చరించారు. శతృవులు జియోనిస్టులైనా, అమెరికా అయినా ఇరాన్‌కు వ్యతిరేకంగా చేస్తున్న చర్యలకు తగిన ఫలితం అనుభవిస్తారని, కోలుకోలేని విధంగా దెబ్బకొడతామన్నారు. టెహ్రాన్‌లో విద్యార్థులనుద్దేశించి ప్రసంగించిన ఆయన ఇందుకు ఇరాన్ పూర్తి సన్నద్ధంగా ఉందన్నారు. రాజకీయంగానే కాక సైనిక పరంగా కూడా ఇరాన్ పూర్తి సంసిద్ధంగా ఉందని ఖమేనీ స్పష్టం చేశారు. కాగా, గాజాతో పాటు లెబనాన్‌లోనూ ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. గాజాపై ఐడీఎఫ్ జరిపిన దాడుల్లో 23 మంది చనిపోయారు. లెబనాన్‌లో హెజ్‌బొల్లా సీనియర్ ఆపరేటివ్‌ను ఇజ్రాయెల్ బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. దీనిపై లెబనాన్ ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేసింది.

మహారాష్ట్రలో బీజేపీ కూటమి గెలిస్తే జమిలి?

న్యూఢిల్లీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలకు ముహూర్తం ఎప్పుడు? మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల తర్వాత ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని.. ఆ ఫలితాల ఆధారంగానే దేశ రాజకీయాల్లో కీలక పరిణామాలు జరిగే అవకాశం ఉందని దేశ రాజధానిలో ఉన్నతాధికార వర్గాల మధ్య చర్చ జరుగుతోంది!! ఇటీవలి ఎన్నికల్లో హరియాణాను హస్తగతం చేసుకున్న కమలనాథులు.. మహారాష్ట్ర కూడా తమ వశమయితే దేశంలో తమకు తిరుగుండదని, అనేక కీలక నిర్ణయాలు తీసుకునేందుకు తమకు ప్రజామోదం లభించినట్లే భావిస్తారని ఆ వర్గాలు అంటున్నాయి. ఈ నెల 23న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో అధికార మహాయుతి (బీజేపీ+శివసేన(శిందే)+ఎన్సీపీ (పవార్)) కూటమి గనుక అత్యధిక సీట్లు సాధిస్తే.. ఆ ప్రభావం మహారాష్ట్రలోనే కాక, జాతీయస్థాయిలో ఉంటుందని ఆ వర్గాల అంచనా. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు వెలువడిన రెండు రోజుల తర్వాత నవంబర్ 25 నుంచి ప్రారంభమయ్యే శీతాకాల సమావేశాల్లో ఏ బిల్లులు ప్రవేశపెట్టాలనే అంశం కూడా ఈ ఫలితాలపైనే ఆధారపడి ఉండనుంది. న్యాయశాఖలోని విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. జమిలి ఎన్నికలకు సంబంధించి కసరత్తు పూర్తయిందని, ఈ మేరకు బిల్లు కూడా సిద్ధమైంది తెలుస్తోంది. మహారాష్ట్ర ఎన్నికల్లో మహాయుతి కూటమి విజయం సాధిస్తేనే ఆ బిల్లును శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టి స్థాయీసంఘానికి సిఫారసు చేసే అవకాశాలు ఉన్నాయని న్యాయశాఖలో ఒక అధికారి చెప్పారు. జమిలి ఎన్నికల బిల్లు ఈ శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టారంటే.. 2027లో ఉత్తరప్రదేశ్ ఎన్నికలతో పాటు జమిలి ఎన్నికలకు బీజేపీ సిద్ధమవుతుందని భావించాల్సి ఉంటుందని ఆయన వివరించారు. వచ్చే ఏడాది జనాభా లెక్కల సేకరణ, 2026లో నియోజకవర్గాల పునర్విభజనతో పాటు మహిళా రిజర్వేషన్‌ను అమలు చేసి 2027లో జమిలి ఎన్నికలకు వెళ్లే అవకాశాల గురించి ప్రభుత్వం ఇప్పటికే ఒక అభిప్రాయానికి వచ్చిందని న్యాయ శాఖ వర్గాలు తెలిపాయి. మహారాష్ట్ర ఫలితాలు తమకు వ్యతిరేకంగా వస్తే.. శీతాకాల సమావేశాల్లో కేవలం వక్ఫ్ బిల్లును మాత్రమే ప్రవేశపెట్టి 'జమిలి' ఎన్నికల బిల్లును వాయిదా వేసే అవకాశాలున్నట్లు వివరించాయి.



జమిలి ఎన్నికలు వద్దు.. టీవీకే తీర్మానం

చెన్నై, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలకు వ్యతిరేకంగా తమిళ సినీనటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రికళగం (టీవీకే) కార్యనిర్వాహక మండలి సమావేశంలో తీర్మానం చేశారు. పాలకపక్షం డీఎంకే ఏళ్ల తరబడి చేస్తున్న నీట్ వ్యతిరేక ప్రతిపాదనను కూడా ఈ సమావేశంలో ఓ తీర్మానంగా చేసి ఆమోదించారు. సామాజిక న్యాయంకోసం రాష్ట్రంలో కులాలవారీ జనగణన జరపాల్సిన అవసరం ఉందని మరొక తీర్మానం చేశారు.

ఝార్ఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి!

5 లక్షల ఉద్యోగాలు.. 500కే గ్యాస్ సిలిండర్

» మహిళలకు ప్రతినెలా రూ.2,100.. బీజేపీ మేనిఫెస్టో విడుదల



ఎన్నికల సభలో అమిత్‌షాకు ఝార్ఖండ్ సంప్రదాయ టోపీని అలంకరిస్తున్న మాజీ సీఎం చంపయ్ సొరెన్

న్యూఢిల్లీ, నవంబరు 3: ఝార్ఖండ్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈనెలలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనున్న ఝార్ఖండ్‌లో 'సంకల్ప పత్ర' పేరిట బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోను ఆదివారం ఆయన విడుదల చేశారు. కేంద్రమంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, సంజయ్ సేథ్, అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో అమిత్‌షా మాట్లాడుతూ ఝార్ఖండ్ భవిష్యత్తుకు ఈ ఎన్నికలే కీలకమన్నారు. పూర్తి అవినీతి ప్రభుత్వం కావాలో లేక, మోదీ నాయకత్వంలో అభివృద్ధి మార్గంలో పయనించే బీజేపీ ప్రభుత్వం కావాలో ఝార్ఖండ్ ప్రజలు నిర్ణయించుకోవాలని సూచించారు. ఝార్ఖండ్‌కు గుర్తింపు, చొరబాటుదారుల నుంచి భూమి, మహిళల రక్షణ బీజేపీ లక్ష్యమని చెప్పారు. ఝార్ఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి అమలు చేస్తామని, అయితే, దాని నుంచి గిరిజనులకు మినహాయింపు ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. 2.87 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు సహా మొత్తం 5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ ఇస్తామని, దీపావళి, రాఖీ పండుగలకు పూర్తి ఉచితంగా 2 గ్యాస్ సిలిండర్లు ఇస్తామని పేర్కొన్నారు. గోగో దీదీ స్కీం కింద మహిళలకు నెలకు రూ.2,100 ఇస్తామని తెలిపారు. పరిశ్రమలు, మైనింగ్ వల్ల నిర్వాసితులైనవారి పునరావాసానికి ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

చొరబాటుదారుల్ని తలకిందులుగా వేలాడదీస్తాం

మహిళలను వేధిస్తున్న చొరబాటుదారులను తలకిందులుగా వేలాడదీస్తామని అమిత్‌షా హెచ్చరించారు. ఝార్ఖండ్‌లో హేమంత్ సొరెన్ ప్రభుత్వం చొరబాటుదారులకు ఆశ్రయం కల్పించడం ద్వారా గిరిజనుల భద్రతపై రాజీ పడిందని విమర్శించారు. చొరబాటుదారులను ఓటుబ్యాంకుగా చూస్తోందని నిందించారు. చొరబాటుదారుల వల్ల రాష్ట్రంలో గిరిజన జనాభా తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 'చొరబాటుదారులు మన కుమార్తెలకు వలవేసి, వారిని పెళ్లి చేసుకొని ఇక్కడి భూమిని ఆక్రమిస్తున్నారు. దీన్ని ఆపకపోతే ఝార్ఖండ్ సంస్కృతి, భూమి, కుమార్తెలకు భద్రత ఉండదు. ఝార్ఖండ్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటవుతోంది. ఈ చొరబాటుదారులందరినీ మేం ఏరిపారేస్తాం. అసోంలోని బీజేపీ ప్రభుత్వం చొరబాట్లను ఆపేసింది. ఇక్కడ కూడా అదే నిబద్ధతతో రోటీ, బేటీ(కుమార్తె), మాటీ(భూమి)ని పరిరక్షిస్తాం' అని అమిత్‌షా స్పష్టం చేశారు.

మోదీ ప్రస్తావన ఎందుకు?

» ఆయనంటేనే మనందరికీ బోర్ కొడుతోంది

» వయనాడ్ ఎన్నికల ర్యాలీలో రాహుల్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, నవంబరు 3: ప్రధాని మోదీ అంటేనే బోర్ కొడుతోందని, ఆయన ప్రస్తావన ఎందుకని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. తన సోదరి ప్రియాంక గాంధీకి మద్దతుగా వయనాడ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో తొలుత ప్రియాంక మాట్లాడుతూ మోదీకి ప్రజాశ్రేయస్సు కంటే తన మిత్రులైన వ్యాపారవేత్తల ప్రయోజనాలే ఎక్కువని ఆరోపించారు. ప్రజలకు ఉద్యోగ అవకాశాలు, విద్య, వైద్యం, మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించే ఉద్దేశం మోదీ ప్రభుత్వానికి లేదని, సమాజాన్ని విభజించి, ద్వేషాన్ని వ్యాప్తి చేయడం ద్వారా అధికారంలో కొనసాగడమే వారి లక్ష్యమని ధ్వజమెత్తారు. అనంతరం రాహుల్ మాట్లాడుతూ, 'ప్రియాంక ఎలాగూ మోదీ గురించి ప్రస్తావించారు. ఆయనంటే మనందరికీ బోర్ కొడుతోంది. అయినా రెండుసార్లు ఆయన ప్రస్తావన ఎందుకు?' అని ప్రశ్నించారు. తమ తండ్రి రాజీవ్ గాంధీ హత్యకేసులో నిందితురాలు నళినిని కలుసుకొని, కౌగిలించుకున్న వ్యక్తి ప్రియాంక అని కొనియాడారు. దేశంలో ద్వేష రాజకీయాలు కాకుండా ఇలాంటి ప్రేమ, ఆప్యాయతలతో కూడిన రాజకీయాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

రూ. 25 వేల కోట్ల అమ్మకాలు

» అమెజాన్‌లో 1.6 కోట్ల షేర్లను అమ్మేసిన సంస్థ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్

» వాటి విలువ 300 కోట్ల డాలర్లు.. ప్రపంచ బిలియనీర్ల జాబితాలో రెండో స్థానానికి..



వాషింగ్టన్, నవంబరు 3: అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్.. ఆ కంపెనీలో తనకున్న వాటాలో 300 కోట్ల డాలర్ల (రూ.25,240 కోట్ల) విలువైన 1.6 కోట్ల షేర్లను తాజాగా విక్రయించారు. దీంతో కలిపి ఈ ఏడాది ఆయన విక్రయించిన అమెజాన్ షేర్ల విలువ 1300 కోట్ల డాలర్లకుపైనే ఉంటుంది. తాజా అమ్మకంతో జెఫ్ బెజోస్.. ప్రపంచ సంపన్నుల (బిలియనీర్ల) జాబితాలో రెండో స్థానానికి చేరుకున్నారు. ఆయన నికర సంపద 22,200 కోట్ల డాలర్లు. 26,200 కోట్ల డాలర్ల సంపదతో తొలిస్థానంలో ఎక్స్ యజమాని ఎలాన్‌మస్క్ ఉండగా, మెటా అధిపతి మార్క్ జుకర్‌బర్గ్ 20,100 కోట్ల డాలర్లతో మూడోస్థానంలో ఉన్నారు. ప్రస్తుతం అమెజాన్ ఒక్కో షేరు 200 డాలర్లకు దరిదాపుల్లో ఉంది. 1997లో నాస్‌డాక్‌లో (అమెరికా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో) నమోదైన తర్వాత కంపెనీ షేరు విలువ ఈ స్థాయిలో పెరగటం ఇదే ప్రథమం. అమెజాన్‌లో బెజోస్ 9% వాటా కలిగి ఉన్నారని తెలుస్తోంది. ఇప్పటికీ అమెజాన్ చైర్మన్‌గా ఉన్న బెజోస్.. ఆ కంపెనీలో తన వాటాను ఎందుకు తగ్గించుకుంటున్నారన్న దానిపై స్పష్టత లేదు. అయితే, అమెజాన్ కంపెనీ పలు కొత్త మార్కెట్లకు విస్తరిస్తూ, వివిధ రంగాల్లో పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకుంటున్నారా అన్న ఊహాగానాలు నడుస్తున్నాయి. మరోవైపు, బెజోస్ కూడా అంతరిక్షంతోపాటు పలు రంగాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. బ్లూ ఆరిజిన్ అనే స్పేస్ కంపెనీని ప్రారంభించారు.

రూ.27 లక్షల కోట్ల క్యాష్!

» వారెన్ బఫెట్ వద్ద 32,500 కోట్ల డాలర్ల నగదు

» ఆపిల్, బ్యాంక్ ఆఫ్ అమెరికాల్లో వాటాల విక్రయం



న్యూయార్క్, నవంబరు 3: అమెరికాకు చెందిన దిగ్గజ పెట్టుబడిదారు, వ్యాపారవేత్త వారెన్ బఫెట్ వద్ద ప్రస్తుతం ఏకంగా 32,500 కోట్ల డాలర్ల (రూ.27 లక్షల కోట్లు) నగదు ఉంది. ఆపిల్, బ్యాంక్ ఆఫ్ అమెరికా కంపెనీల్లో తాజాగా షేర్ల అమ్మకంతోపాటు, తన సొంత కంపెనీ బెర్క్‌షైర్ హ్యాథవే నుంచి వస్తున్న లాభాలతో బఫెట్ వద్ద కుప్పలు తెప్పలుగా నగదు పోగుపడిపోతోంది. అయినప్పటికీ, దీనిని ఎక్కడా పెద్దగా పెట్టుబడులు పెట్టటానికి బఫెట్ ఆసక్తి చూపించటం లేదు. ఈ ఏడాది మే నెలలో జరిగిన కంపెనీ వాటాదారుల వార్షిక సమావేశంలో బఫెట్ మాట్లాడుతూ, 'పెట్టుబడులు పెట్టటానికి మనం తొందరపడాల్సిన పని లేదు. ఎందుకంటే, చాలా తక్కువ రిస్క్‌తో అత్యధిక లాభాలు వచ్చినప్పుడే ఆ పని చేద్దాం' అని స్పష్టం చేశారు. ప్రస్తుతం బెర్క్‌షైర్ మార్కెట్ విలువ 97,400 డాలర్లుగా (రూ.81,94,638 కోట్లు) ఉంది.


దివాన్‌చెరువు పెట్రోల్ బంకు వద్ద దగ్ధమవుతున్న లారీ

పెట్రోల్ బంకుకు తప్పిన పెనుముప్పు

» లారీ క్యాబిన్‌లో మంటలతో కలకలం

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులోని పెట్రోల్ బంకు వద్ద ఆదివారం ఓ లారీ క్యాబిన్‌లో నుంచి మంటలు చెలరేగడం తీవ్ర కలకలం రేగింది. వెంటనే బంకు సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఈలోగా రాజమహేంద్రవరం నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా అదుపుచేయడంతో పెనుముప్పు తప్పింది. లారీలో ఏర్పడిన షార్ట్‌సర్క్యూట్ ఈ ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. కాగా, లారీకి డీజిల్ నింపుతున్న సమయంలో ఈ ఘటన జరగడంతో అందరూ తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.

-ఆంధ్రజ్యోతి, దివాన్ చెరువు

నేడు టెట్ ఫలితాలు విడుదల

» ఎల్లుండి మెగా డీఎస్సీ నోటిఫికేషన్

» 16,347 పోస్టుల భర్తీకి ప్రక్రియ

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఫలితాలు నేడు విడుదల కానున్నాయి. ఉదయం 11.30 గంటలకు ఫలితాలను మంత్రి నారా లోకేశ్ విడుదల చేస్తారు. అక్టోబరులో జరిగిన టెట్‌కు 4,27,300 మంది దరఖాస్తు చేసుకోగా 58,639 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. మిగిలిన 3,68,661 మంది ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. బుధవారం 16,347 పోస్టులతో మెగాడీఎస్సీ నోటిఫికేషన్ జారీచేస్తున్న నేపథ్యంలో టెట్ ఫలితాలపై అభ్యర్థుల్లో ఆసక్తి పెరిగింది. టెట్‌లో అర్హత సాధించినవారికి డీఎస్సీలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. అంతకుముందు టెట్ అర్హత సర్టిఫికెట్ ఏడేళ్లు మాత్రమే చెల్లుబాటయ్యేది. 2022 నుంచి దీన్ని జీవిత కాలానికి మార్చారు. 2022 టెట్‌లో చాలామంది అర్హత సాధించినా మార్కుల్లో మెరుగుదల కోసం చాలామంది ఇప్పుడు మరోసారి పరీక్ష రాశారు. డీఎస్సీలో టెట్ మార్కులకు 20శాతం వెయిటేజీ ఉంటుంది.

రోడ్లపై గోతులకు గుడ్‌బై

రాష్ట్రంలో 30,274 కి.మీ రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం నిర్ణయం

» ఏడాదిలో బాగు చేయాలని ప్రణాళిక

» ఐదేళ్ల తర్వాత ఆర్‌అండ్‌బీకి చేతినిండా పని

» డ్రైనేజీలు, కల్వర్టులు కూడా రిపేర్

» ఇప్పటికే రూ.861 కోట్ల కేటాయింపు

» గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో యమపురికి దారి అనేలా రాష్ట్రంలోని రోడ్ల దుస్థితి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని రహదారుల నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. రోడ్లపై గుంతలకు బదులు.. ఆ గుంతల్లో రోడ్డు ఎక్కడుందా! అని వెతుక్కునేలా పరిస్థితి తయారైంది. ఫలితంగా ఏపీ రోడ్లంటేనే యమపురికి దారులుగా చెడ్డ పేరు వచ్చింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం..30,274 కిలోమీటర్ల మేర రోడ్లకు మరమ్మతులు చేయాలని నిర్ణయించింది. పాత వైభవం తీసుకొచ్చేందుకు ప్రణాళిక రూపొందించింది. ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకు గుంతల రహిత రహదారుల మిషన్‌ను ప్రారంభించింది.

రాష్ట్రంలో 30,274 కిలోమీటర్ల మేర రహదారులకు మరమ్మతులు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. రాష్ట్రంలో 47,439.41 కి.మీ ఆర్‌అండ్‌బీ రహదారులు ఉండగా.. ఇందులో 30,274 కి.మీ రోడ్లను ఒకే ఏడాదిలో నిర్వహణ కింద బాగు చేయాలని నిశ్చయించడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. దీని వల్ల ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని, అదేవిధంగా ఐదేళ్ల తర్వాత తమకు కూడా చేతినిండా పనిదొరుకుతుందని అర్‌అండ్‌బీ వర్గాలు చెబుతున్నాయి. రోడ్ల మరమ్మతుల కోసం ఇప్పటికే ప్రభుత్వం రూ.861 కోట్లు కేటాయించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో రోడ్డు నిర్మాణాలు, నిర్వహణ పనులు వంటివి పెద్దగా లేవు. దీంతో ఆర్‌అండ్‌బీకి చేయడానికి పని లేకుండాపోయింది. గుంతలు పూడ్చే పనులు కూడా తూతూమంత్రంగా సాగాయి. దీంతో రాష్ట్రంలోని రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి.

వైసీపీ ప్రభుత్వంలో పూర్తి నిర్లక్ష్యం

ఆర్‌అండ్‌బీ మాన్యువల్ ప్రకారం ప్రతీ ఏటా 8 వేల కి.మీ మేర రహదారుల నిర్వహణ, మరమ్మతు పనులు చేపట్టాలి. ఇందుకోసం కోసం రూ.వెయ్యి నుంచి రూ.1,500 కోట్ల మేర ఖర్చవుతుంది. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఈ పాలసీ అమల్లో ఉంది. 2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ విధానాన్ని అమలు చేశారు. గత టీడీపీ ప్రభుత్వ చొరవ వల్లే రూ.6,500 కోట్ల విలువైన ఎన్‌డీబీ రహదారుల ప్రాజెక్టు ఏపీకి వచ్చింది. సరిగ్గా ఆ ప్రాజెక్టు ఒప్పందాలు జరిగే సమయంలో జగన్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత ఒప్పందాలైతే చేసుకున్నారు కానీ.. వైసీపీ ప్రభుత్వం పనులు చేయలేదు. టెండర్లను అస్మదీయులకు కట్టబెట్టడంలో ముందున్న గత సర్కారు.. పనులను మాత్రం చేయలేకపోయింది. ఐదేళ్ల వ్యవధిలో 40 వేల కి.మీ రహదారుల నిర్వహణ చేపట్టాల్సి ఉంది. కానీ, 3 వేల కి.మీ రోడ్ల మరమ్మతులు కూడా చేయలేదు. అది కూడా ప్రజల నుంచి పెట్రోలు, డీజిల్‌పై వసూలు చేసే సెస్సును బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద తాకట్టు పెట్టి రూ.2 వేల కోట్ల రుణం తీసుకొచ్చి ఆ రిపేర్లు చేయించారు. ఆ పని కూడా సజావుగా పూర్తి చేయలేదు. తెచ్చిన రుణంలో రూ.450 కోట్లను ఇతర పనులకు దారి మళ్లించారన్న ఆరోపణలున్నాయి. దీంతో మరమ్మతు పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదు. పనులు చేసినా బిల్లులు ఇవ్వట్లేదంటూ చాలా మంది కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పరిస్థితుల్లో రహదారుల పరిస్థితి మరీ ఘోరంగా మారిపోయింది. ప్రజలే స్వచ్ఛందంగా రాకపోకల కోసం తమ ప్రాంతాల్లో రహదారి గుంతలపై మట్టి పోసుకున్న సందర్భాలు ఉన్నాయి. మరికొన్ని చోట్ల రోడ్లపై చిన్నపాటి చెరువు, కుంటల స్థాయి గోతులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితుల్లో ఏపీ రహదారులు పరమ అధ్వాన్నంగా ఉన్నాయంటూ సోషల్ మీడియా వేదికగా ప్రచారం జరిగింది.

గుంతల రహిత రోడ్లే మా లక్ష్యం

» మంత్రి జనార్దన్‌రెడ్డి

తొలి ప్రాధాన్యతగా రాష్ట్రంలోని రహదారులను గుంతల రహిత రోడ్లుగా మార్చాలన్నది ప్రాథమిక లక్ష్యమని ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆంధ్రజ్యోతికి చెప్పారు. 'సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఈ మిషన్ చేపట్టాం. రాష్ట్రంలో స్టేట్ హైవేలు 14,714 కి.మీ, జిల్లా ప్రధాన రహదారులు 32,725.41 కి.మీ మేర ఉన్నాయి. ఈ రెండు కేటగిరీల్లో 20,274 కి.మీ రహదారులపై ఉన్న గుంతలను సంక్రాంతి పండగ నాటికి పూడ్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వర్షాలు, వరదల దెబ్బతిన్న 10 వేల కి.మీ మేర రోడ్లను కూడా ఈ నిర్వహణ జాబితాలో మరమ్మతులు చేయాలని సీఎం ఆదేశించారు. మొత్తం 30,274 కి.మీ రోడ్లను బాగు చేస్తాం. రోడ్ల బాగు కోసం ఎన్ని నిధులు ఇచ్చేందుకైనా సీఎం సిద్ధంగా ఉన్నారు' అని మంత్రి చెప్పారు.

- కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలోని రోడ్లను బాగుచేసేందుకు తొలి ప్రాధాన్యత ఇచ్చింది. ఇందుకు తొలుత రూ.290 కోట్లు కేటాయించింది.
- అయితే ఈ నిధులు సరిపోవని, బాగుచేయాల్సిన రహదారులు 20,274 కి.మీ పైనే ఉన్నాయంటూ ప్రభుత్వానికి నివేదికలు వచ్చాయి.
- మరోవైపు ఇటీవల రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల వల్ల 10 వేల కి.మీ మేర రహదారులు దెబ్బతిన్నాయి. రోడ్ల పక్కన ఉండే డ్రైనేజీలు, కల్వర్టులు ధ్వంసం అయ్యాయి.
- మొత్తం 30,274 కి.మీ రహదారులను నిర్వహణ కింద మరమ్మతు పనులు చేపట్టాలని సర్కారు నిర్ణయించింది. దీనికి అనుగుణంగా ఆర్‌అండ్‌బీతో కార్యాచరణ రూపొందించింది.
- రోడ్ల మరమ్మతుల కోసం విపత్తు నిధులు, ఇతర పద్దుల కింద కలిపి రూ.861 కోట్లు వినియోగించబోతున్నట్లు ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చెప్పారు.

శ్రీవారి సేవలో మంత్రి నాదెండ్ల


తిరుమల ఆలయం ముందు మంత్రి నాదెండ్ల మనోహర్

తిరుమల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్న ఆయనకు ఆలయంలోని రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా.. అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న జస్టిస్ రజని


కప్ప స్తంభం వద్ద జస్టిస్ రజని దంపతులు

సింహాచలం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహ లక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.రజని దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న న్యాయమూర్తి... గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమ పూజలు చేసిన తరువాత వేద పండితులు ఆశీర్వదించారు. ఏఈఓ ఆనందకుమార్ శాలువతో సత్కరించి, స్వామివారి ఫొటోను, ప్రసాదాలను అందజేశారు.

గాజుల అలంకారంలో దుర్గమ్మ

» వేలాదిగా తరలి వచ్చిన భక్తులు


దుర్గమ్మ దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు, గాజుల అలంకరణలో దుర్గమ్మ ఉత్సవమూర్తి

విజయవాడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ విదియ సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ ఆదివారం భక్తులకు గాజుల అలంకారంలో దర్శనమిచ్చింది. 'కార్తీక శుద్ధ విదియను యమ విదియగా పిలుస్తారు. యమధర్మరాజు సోదరి యమున ఇదేరోజున ఆయనకు పంచభక్ష్య భోజనం పెట్టింది. దీనికి మెచ్చిన యముడు.. యమునకు వరం ఇచ్చాడు. కార్తీక శుద్ధ విదియ రోజున సోదరి ఇళ్ల వద్ద భోజనం చేసి, సౌభాగ్యాదులు ఇచ్చిన వారికి మృత్యుభయం ఉండదని అభయమిస్తాడు. శ్రీమహావిష్ణువుకు అమ్మవారు సోదరి కావడంతో కార్తీక శుద్ధ విదియ రోజున గాజుల అలంకారం చేస్తారు.' అని దుర్గగుడి స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్‌శర్మ గాజుల అలంకార వైశిష్ట్యాన్ని తెలిపారు. కాగా, ఆదివారం దీనికితోడు గాజుల మహోత్సవం కావడంతో ఇంద్రకీలాద్రికి భక్తులు పోటెత్తారు. క్యూలైన్లు కిక్కిరిసి కనిపించాయి. సుమారు 50 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వక్ఫ్ బిల్లు ఆమోదం పొందితే 'ఊత కర్రల'దే బాధ్యత

» నితీశ్, చంద్రబాబే అడ్డుకోవాలి.. జమైత్ ఉలేమా వ్యాఖ్య

న్యూఢిల్లీ, నవంబరు 3: ముస్లింల మనోభావాలను గౌరవించి వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలని తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, జేడీ(యూ) నేత నీతీష్ కుమార్‌లను జమైత్ ఉలేమా ఎ హింద్ కోరింది. ప్రమాదకరమైన ఆ బిల్లుకు మద్దతు తెలపకుండా దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. ఒకవేళ ఆ బిల్లు ఆమోదం పొందితే ప్రభుత్వానికి 'ఊతకర్రలు'గా ఉన్న ఆ రెండు లౌకికవాద పార్టీలు కూడా బాధ్యత నుంచి తప్పించుకోలేవని ఆ సంస్థ అధిపతి మౌలానా అర్షద్ మదాని హెచ్చరించారు. ఆదివారం ఇక్కడి ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన రాజ్యాంగ పరిరక్షణ సభలో ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

రివర్స్ పీఆర్సీతో అన్నీ కోల్పోయాం: బొప్పరాజు

విజయవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్రంగా నష్టపోయిన ఉద్యోగ వర్గానికి కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని ఏపీజేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. నగరంలోని ఏపీ రెవెన్యూ భవన్‌లో ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర సెక్రటేరియట్ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో చర్చించిన అంశాలను సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, ఫణి పేర్రాజు, కనపర్తి సంగీతరావుతో కలిసి బొప్పరాజు విలేకరులకు వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులు, పెన్షనర్లు తీవ్రంగా నష్టపోయారన్నారు. 11వ పీఆర్సీని రివర్స్ పీఆర్సీగా చేయడం వల్ల గతంలో సాధించుకున్న రాయితీలన్నింటినీ కోల్పోయామన్నారు. కూటమి ప్రభుత్వం పాత స్లాబులను పునరుద్ధరించటం ద్వారా రాష్ట్రంలోని నాలుగు లక్షల మంది పెన్షనర్లకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వంపై నమ్మకముంది.. ధర్నాల్లో పాల్గొనొద్దు

» వీఆర్‌ఏలకు సంఘ అధ్యక్షుడు అంజి పిలుపు

విజయవాడ (ధర్నాచౌక్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి ప్రభుత్వం వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరిస్తుందనే నమ్మకం ఉందని, కనుక ఈ నెల 4, 19 తేదీల్లో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాల్లో వీఆర్‌ఏలు పాల్గొనొద్దని వీఆర్‌ఏ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజి పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం వీఆర్‌ఏలకు ఎలాంటి న్యాయమూ చేయలేదని విమర్శించారు. అధికారంలోకి వస్తే వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరిస్తామని పాదయాత్ర సమయంలో మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారన్నారు. ఏడాదిలోగా పేస్కేల్, నామినీ, ప్రమోషన్లు, వాచ్‌మెన్, అటెండర్, జీప్ డ్రైవర్, రికార్డ్ అసిస్టెంట్, స్వీపర్ పోస్టులను భర్తీ చేస్తామన్నారని గుర్తు చేశారు. రాష్ట్ర నేతలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కొందరు తమ వ్యక్తిగత పబ్లిసిటీ కోసమే ప్రభుత్వం ఇచ్చిన గడువు పూర్తి కాకుండానే ధర్నాలకు పిలుపునివ్వడం సరైందికాదని మండిపడ్డారు.

రెచ్చిపోతున్న గొలుసు దొంగలు

» చిత్తూరు జిల్లాలో వరుసగా ఏడు ఘటనలు

» గత నెల దొంగలతో పోరాడి గాయపడిన మహిళ మృతి

» బయటికి రావాలంటేనే హడలిపోతున్న మహిళలు

చిత్తూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మహిళల మెడలో బంగారు గొలుసులు లాక్కెళ్లే ముఠా చిత్తూరు జిల్లాలో చెలరేగిపోతోంది. గత నెల 26వ తేదీన చిత్తూరు- పీలేరు ప్రధాన రహదారిపై మధ్యాహ్నం 3- 3.15 గంటల మధ్యలో.. కేవలం 15 నిమిషాల వ్యవధిలోనే వరుసగా మూడు దొంగతనాలు జరిగాయి. కేటీఎం బైకుపై వచ్చిన ఇద్దరు యువకులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. ఈ మూడు ఘటనల్లో ఓ చోట ప్రమీల అనే మహిళ దొంగలతో పోరాడి చైన్‌ను కాపాడుకుని తీవ్ర గాయాలపాలైంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. పుంగనూరులో ఈ శుక్రవారం, శనివారం రాత్రి ఏడు గంటల సమయంలో రెండు దొంగతనాలు జరిగాయి. శనివారం చౌడేపల్లెలో 75 ఏళ్ల రాజమ్మ అనే మహిళ మెడలో నుంచి 42 గ్రాముల చైన్‌ను లాక్కెళ్లారు. తాజాగా ఆదివారం పూతలపట్టులో మరో మహిళ మెడలో నుంచి రూ.లక్ష విలువ చేసే చైన్‌ను లాక్కెళ్లారు. మొత్తంగా ఏడు దొంగతనాలు జరగగా, అందులో ఆరు గొలుసు దొంగతనాలే. చోరీ అయిన ఆభరణాలు సుమారు 200 గ్రాములు ఉండొచ్చని పోలీసు రికార్డుల్లో నమోదైంది. వరుస ఘటనలతో జిల్లాలో మహిళలు బయటికి రావాలంటేనే హడలిపోతున్నారు. గత నెల 26న జరిగిన ఘటనలో మహిళ ప్రాణం పోవడానికి కారణమైన ఇద్దరు దుండగుల్ని పోలీసులు ఇప్పటికీ పట్టుకోలేకపోయారు. ఇదే అదనుగా దుండగులు మరో నాలుగు దొంగతనాలు చేసి పోలీసులకు సవాల్ విసిరారు. మొత్తం ఒకటే ముఠా దొంగతనాలు చేస్తోందా.. లేదా వేర్వేరు ముఠాలున్నాయా అనేది కూడా అంతుబట్టడంలేదు.

ప్రాణాలు తీసిన క్రాస్‌వీల్

» గాలిలో తిరుగుతుండగా విరిగిన బాక్స్

» 20 అడుగుల ఎత్తునుంచి కిందపడిన మహిళలు

» ఒకరు దుర్మరణం.. మరొకరికి తీవ్రగాయాలు

» తిరుపతిలోని శిల్పారామంలో దుర్ఘటన


క్రాస్‌వీల్ నుంచి ఊడి కిందపడిన బాక్సు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గౌతమి

తిరుచానూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆ మహిళలిద్దరూ స్నేహితులు. ఆదివారం కావడంతో మరికొంతమంది స్నేహితులతో కలిసి శిల్పారామం వచ్చారు. కబుర్లు చెప్పుకుంటూ సరదాగా గడిపారు. క్రాస్‌వీల్ (జెయింట్ వీల్ తరహా) ఎక్కి కేరింతలు కొట్టారు. ఇంతలో క్రాస్‌వీల్‌లో ఒక బాక్స్ విరిగిపోవడంతో అందులో కూర్చున్న మహిళలిద్దరూ 20 అడుగుల ఎత్తునుంచి కిందపడ్డారు. ఒకరు అక్కడిక్కడే మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతిలోని శిల్పారామంలో ఆదివారం ఈ విషాదం చోటుచేసుకుంది. తిరుపతి జిల్లా తిరుచానూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి సుబ్బారెడ్డినగర్‌కు చెందిన లోకేశ్వరి (25), చంద్రశేఖర్‌రెడ్డి కాలనీకి చెందిన గౌతమి స్నేహితులు. ఆదివారం కావడంతో వారిద్దరూ మరికొందరితో కలిసి శిల్పారామానికి వచ్చారు. క్యాంటీన్ వద్ద క్రాస్‌వీల్ (జెయింట్ వీల్ తరహా) ఎక్కారు. లోకేశ్వరి, గౌతమి ఒకే బాక్సులో కూర్చున్నారు. క్రాస్ వీల్ వేగంగా తిరుగుతుండగా వీరిద్దరూ కూర్చున్న బాక్సు ఉన్నట్టుండి విరిగిపోయింది. దీంతో సుమారు 20 అడుగుల ఎత్తు నుంచి వీరిద్దరూ కింద పడిపోయారు. లోకేశ్వరి తలకు, నుదుటిపైన తీవ్రగాయాలయ్యాయి. గౌతమికి కూడా గాయాలయ్యాయి. ఇద్దరినీ ఆటోలో రుయాకు తరలించగా.. లోకేశ్వరి అప్పటికే మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. గౌతమిని మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన క్రాస్‌వీల్ యజమానిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

మీ ఫ్యామిలీ మొత్తాన్నీ లేపేస్తాం..

» దళిత కుటుంబంపై వైసీపీ మూకల దాడి

» కేసు వెనక్కు తీసుకోవాలని కుమారుడికి బెదిరింపులు

» భయంతో ఒంటికి నిప్పంటించుకున్న యువకుడు

» శ్రీసత్యసాయి జిల్లా మారాల గ్రామంలో దారుణం


గౌతమ్ (ఫైల్)


తీవ్రంగా కాలిన గాయాలతో గౌతమ్

బుక్కపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూలి పనులకు వెళ్తేగానీ పూటగడవని నిరుపేద దళిత కుటుంబం... పైగా టీడీపీ అంటే అభిమానం... ఇంకేముంది వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. దాడిచేసి విచక్షణారహితంగా చావబాదడమే కాక.. దీపావళి పండక్కి ఇంటికొచ్చిన యువకుడిని 'కేసు వెనక్కు తీసుకోకుంటే.. మీ ఫ్యామిలీ మొత్తాన్నీ చంపేస్తాం' అని బెదిరించాయి. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఆ యువకుడు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. శరీరం 80 శాతం కాలిపోవడంతో ప్రస్తుతం చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం మారాల గ్రామంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మారాల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నారాయణస్వామి కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతడికి భార్య ఓబుళమ్మ, కుమారులు గౌతమ్, నందీశ్‌కుమార్ ఉన్నారు. రెండు నెలల క్రితం గ్రామంలో పీర్ల పండుగ సందర్భంగా నారాయణస్వామిపై అదే ఊరికి చెందిన వైసీపీ నాయకుడు, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ రామమోహన్ దాడి చేసి విచక్షణారహితంగా కొట్టాడు. దీనిపై అప్పట్లో నారాయణస్వామి.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే విషయంపై బుక్కపట్నం పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐ కృష్ణమూర్తితో మాట్లాడేందుకు నారాయణస్వామి ఈ నెల 2న పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఆయన కోసం కుమారుడు గౌతమ్ స్టేషన్‌కు వస్తుండగా.. మార్గమధ్యంలో బుచ్చయ్యగారిపల్లి వద్ద వైసీపీ నాయకులు రామమోహన్, ప్రసాద్, ఓబుళప్ప, గోపి, సన్నరాముడు అతన్ని అడ్డగించారు. 'నీ తండ్రి ఫిర్యాదు వెనక్కు తీసుకోవాలి. లేదంటే మీ కుటుంబాన్ని మొత్తం హతమారుస్తాం' అని బెదిరించారు. గౌతమ్‌ను దుర్భాషలాడారు. దీంతో మానసిక వేదన చెందిన గౌతమ్ పుట్టపర్తిలోని తమ తాత్కాలిక నివాసంలో శనివారం అర్ధరాత్రి ఒంటిపై పెట్రోల్ పోసుకుని, నిప్పు అంటించుకున్నాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని కుటుంబసభ్యులు బెంగళూరులోని విక్టోరియా ఆస్పత్రికి తరలించారు. గౌతమ్ పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. 'మేం టీడీపీ వాళ్లమని.. మా నాన్నపై వాళ్లు దాడి చేశారు. ఫిర్యాదు వెనక్కు తీసుకోకపోతే మా కుటుంబాన్ని మొత్తాన్నీ చంపేస్తామని బెదిరించారు. దీంతో భయమేసి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాను' అని గౌతమ్ పోలీసులకు వాగ్మూలమిచ్చాడు. గౌతమ్‌కు ఇంకా వివాహం కాలేదు. ప్రస్తుతంలో బెంగళూరులో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబంతో కలిసి దీపావళి జరుపుకొనేందుకు స్వగ్రామానికి వచ్చాడు. వైసీపీ నేతల దౌర్జన్యంతో ఆత్మహత్యకు ప్రయత్నించాడు.

మత్స్య ఉత్పత్తిలో ఏపీ టాప్

ఆక్వా రంగంలో 40.9 శాతం వాటాతో దేశంలో అగ్రస్థానం

» పండ్లు, కూరగాయల ఉత్పత్తిలో 5వ స్థానం

» కేంద్ర గణాంక శాఖ నివేదిక వెల్లడి

అమరావతి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆక్వా రంగంలో ఆంధ్రప్రదేశ్ దూసుకుపోతోంది. చేపలు, రొయ్యల ఉత్పత్తిలో భారీ పెరుగుదలను నమోదుచేసి, దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. చేపలు, రొయ్యల ఉత్పత్తిలో జాతీయస్థాయిలో 2011-12లో ఏపీ వాటా 17.7 శాతం ఉండగా, 2022-23 నాటికి ఏకంగా 40.9 శాతానికి పెరిగింది. ఏపీ తర్వాతి స్థానాల్లో పశ్చిమబెంగాల్, ఒడిశా, బిహార్, అస్సాం ఉన్నాయని కేంద్ర ప్రభుత్వ అధ్యయన సంస్థ వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర గణాంక, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ 2011-12 నుంచి 2022-23 వరకు వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తి విలువపై నివేదిక తయారు చేసింది. ఆక్వా రంగంలో గత పన్నెండేళ్లుగా మొత్తం స్థూల ఉత్పత్తి విలువలో ఏపీ ఎక్కడా తగ్గలేదు. క్రమంగా ఉత్పత్తి విలువ పెరుగుతూనే ఉంది. కాగా, దేశవ్యాప్తంగా చెరువుల్లో పెంచుతున్న చేపల(ఇన్‌ల్యాండ్ ఫిష్) ఉత్పత్తి 2011-12లో 57.7% ఉండగా, 2022-23లో 49 శాతానికి తగ్గింది. సముద్రపు చేపల ఉత్పత్తి గత 12 ఏళ్లలో 42.3 శాతం నుంచి 51 శాతానికి పెరిగిందని నివేదిక వెల్లడించింది.

పండ్లు, కూరగాయల ఉత్పత్తిలో ఏపీ వాటా	
సంవత్సరం	వాటా (శాతంలో)
2011-12	5.8
2022-23	8.2

'ఉద్యాన' ఉత్పత్తుల్లో వృద్ధి

పండ్లు, కూరగాయల ఉత్పత్తిలో ఏపీ ఐదో స్థానంలో నిలిచింది. ప్రథమ స్థానంలో పశ్చిమబెంగాల్, తర్వాతి స్థానాల్లో మధ్యప్రదేశ్, యూపీ, మహారాష్ట్ర ఉన్నాయి. గత 12 ఏళ్లలో మధ్యప్రదేశ్ వాటా 6.3% నుంచి 10.9 శాతానికి, యూపీ 7.2 నుంచి 10.5కి చేరగా, మహారాష్ట్ర వాటా 10.4 నుంచి 9.9 శాతానికి తగ్గింది. ఏపీ వాటా 5.8 నుంచి 8.2 శాతానికి పెరిగింది.

పశుగణ ఉత్పత్తిలో నాలుగో స్థానం

మరోవైపు పశుగణ ఉత్పత్తిలో ఏపీ నాలుగో స్థానంలో నిలిచింది. రాజస్థాన్ తొలి స్థానంలో ఉండగా, యూపీ, తమిళనాడు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. మహారాష్ట్ర ఐదో స్థానం దక్కించుకుంది. జాతీయ స్థాయిలో పశుగణ ఉత్పత్తి విలువలో ఏపీ వాటా 2011-12 నుంచి 2022-23కు 7.0% నుంచి 7.8% మాత్రమే పెరిగింది.

చేపలు, రొయ్యల ఉత్పత్తిలో వాటా(శాతంలో)

రాష్ట్రం	2011-12	2022-23
ఆంధ్రప్రదేశ్	17.7	40.9
పశ్చిమబెంగాల్	24.6	14.4
ఒడిశా	3.9	4.9
బిహార్	4.5	4.5
అస్సాం	5.5	4.1

కార్మికులకు పథకాలు అందేలా కృషి: ఎమ్మెల్సీ అశోక్‌బాబు

అమరావతి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ రంగాల్లోని కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని టీడీపీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు చెప్పారు. టీఎన్‌టీయూసీ అనుబంధ విభాగమైన రాష్ట్ర తెలుగునాడు భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశం ఆదివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అశోక్‌బాబు మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునర్నిర్మిస్తామన్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో భవన నిర్మాణ కార్మికులకు స్వర్ణయుగం ప్రారంభమైందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీలు ఏర్పాటుకు 15మందితో అడ్‌హక్ కమిటీని నియమించారు.

వివిధ

vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక
బొమ్మలు: అక్బర్


శ్వేత యర్రం




మైత్రి

తెలుగు సాహిత్యాన్ని ఇంగ్లీషు భాషా మాధ్యమం ద్వారా గ్లోబల్ తెర పైకి తెచ్చేందుకు ఇప్పుడిప్పుడే ప్రయత్నాలు ముమ్మరం అవుతున్నాయి. ఆ ప్రయత్నాల్లో ఒకటి అజు పబ్లికేషన్స్–ఛాయా పబ్లికేషన్స్ సంస్థలు రెండూ కలిసి 'TILT' (తెలుగు ఇన్ లిటరరీ ట్రాన్స్‌లేషన్) పేరుతో చేపట్టిన ఆన్‌లైన్ ట్రాన్స్‌లేషన్ వర్క్‌షాప్. తెలుగు నుంచి ఇంగ్లీషుకు అనువదించే సామర్థ్యం గల అనువాదకులు కొందరిని ఎంపిక చేసి, వారికి ఫ్రెంచ్ అనువాదకురాలు రాస్ ష్వార్జ్ మెంటార్‌షిప్‌లో, ఇతర ప్రపంచ స్థాయి అనువాదకుల ఆధ్వర్యంలో అనువాదంలో మెళకువలను బోధిస్తూ, అనుమానాలను నివృత్తి చేయటం ఈ ఆన్‌లైన్ వర్క్‌షాప్ ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భంగా అజు పబ్లికేషన్స్ కో ఫౌండర్/ డైరెక్టర్ శ్వేత యర్రం, ఛాయా పబ్లికేషన్స్ రిప్రజెంటెటివ్ మైత్రిలతో 'వివిధ' జరిపిన సంభాషణ ఇది.

అనువాద వ్యాకరణం మనకింకా అలవాటు కావాలి!

ఈ ఆన్‌లైన్ ట్రాన్స్‌లేషన్ వర్క్‌షాప్ గురించి చెప్పండి. ఈ ఆలోచన ఎలా కలిగింది?

రెండు ప్రచురణ సంస్థలు ఒక వేదిక మీదకి రావడం కావొచ్చు, ఖర్చుతో కూడుకున్న వ్యవహారమైనా వ్యయ ప్రయాసలకు వెను కాడకుండా ముందడుగు వేయడం కావొచ్చూ... ఇలాంటి వర్క్‌షాప్ ప్రయత్నం మాకు తెలిసి బహుశా భారతీయ భాషల్లో మొదటిసారిగా జరుగుతున్నది.

తెలుగు భాషా సాహిత్యాన్ని ఇక్కడి స్థానిక రచనలతో పాటూ అనువాదాలూ సుసంపన్నం చేశాయి. రష్యన్ సాహిత్యం, శరత్ నవలలు, ఇంకా ప్రేమ్ చంద్, కిషన్ చంద్, తగళి శివశంకర పిళ్ళై, మహాశ్వేతా దేవీ, బిభూతి భూషణ్‌ల రచనలు... ఇలా చెప్పుకుంటే పోతే బోలెడంత మంది ఇతర భాషల రచయితలు తెలుగులో పరిచయమయ్యారు. అలానే, పక్క రాష్ట్రాల సాహిత్యం నుంచి ఇంగ్లీష్‌లోకి అనేక రచనలు వెళ్ళాయి. అక్కడి పాత తరమే కాదు, కొత్త తరం రచయితల రచనలు కూడా ఇంగ్లీష్ లోకి అనువాదం అవుతున్నాయి.



అలా చూసుకున్నప్పుడు, తెలుగు భాషా, తెలుగు సాహిత్యమూ ఎక్కడ ఉన్నాయీ అన్న ప్రశ్నే ఈ వర్క్‌షాప్‌కి బీజం వేసింది.

తెలుగు నుంచి ఇంగ్లీష్ అనువాదం మన దగ్గర చాలా తక్కువగా జరుగుతున్నది. అందువల్ల ఆ స్కిల్ సెట్ ఎక్కువగా పరిణతి చెందలేదు. అనువాదం అంటే కేవలం పదాల అనువాదం కాదు. ఆ రచన, రచయిత ఆత్మను పట్టుకోవడం. టార్గెట్ రీడర్స్ ఎవరని తెలుసుకొని అందుకు తగ్గట్లుగా అనువదించడం. అందుకు కసరత్తు అవసరం. అనువాదం ఇండియన్ ఇంగ్లీష్ లోకి వెళ్ళడం ఒక ఎత్తయితే, దాన్ని ఇంటర్నేషనల్ ఇంగ్లీష్‌లోకి తీసుకు వెళ్ళడం మరొక ఎత్తు. మేం ఎంచుకున్న అనువాదకులందరూ తెలుగు – ఇంగ్లీష్ భాషలపై పట్టు ఉన్నవారే, అంతర్జాతీయ సమకాలీన సాహిత్యం చదువుతున్నవారే. వారికి కాస్త శిక్షణ ఇస్తే అద్భుతాలు చేయవచ్చు అనిపించింది. పైగా ఎక్కువ శాతం పార్టిసిపెంట్స్ 35 ఏళ్ల లోపు వాళ్ళు కనుక స్కోప్ ఫర్ ఫ్యూచర్ డెవలప్మెంట్ ఎక్కువ.

ఈ ఆలోచన ఆచరణ దాకా రావటానికి జరిగిన ప్రయత్నం ఏమిటి? వర్క్‌షాప్ నిర్వహణకు ఫ్రెంచ్ అనువాదకురాలు రాస్ ష్వార్జ్‌నే ఎందుకు ఎంపిక చేశారు?

మాటల మధ్యన వచ్చిన విషయాన్నీ ఇక్కడి దాకా తెచ్చింది మిత్రుడు అనిల్. ఆయన హర్షణీయం అనే పోడ్కాస్ట్ నడుపుతున్నాడు. అంతర్జాతీయ రచయితలూ, అనువాదకులతో అనేక ఇంటర్వ్యూలు చేశాడు. రాస్ ష్వార్జ్ ఈ ఆలోచనకి తగిన వ్యక్తి అని సలహా ఇచ్చింది తనే. ఐతే, రాస్ ఫ్రెంచ్ – ఇంగ్లీష్ అనువాదకురాలు కాబట్టి, తెలుగు తెలిసిన లోకల్ చెక్ పాయింట్స్ కూడా వర్క్ షాప్‌కి కావాలి అనుకున్నప్పుడు మాకు తట్టింది– రచయిత ఉణుదుర్తి సుధాకర్, అనువాదకుడు అవినేని భాస్కర్‌లు. అడగ్గానే వాళ్ళు కూడా ఒప్పుకొని మాకు భారం తగ్గించారు. రాస్ విషయానికి వస్తే ఆమె నాలుగు దశాబ్దాలుగా వంద పుస్తకాలను అనువాదం చేశారు. ఎన్నో ప్రసిద్ధ అంతర్జాతీయ బహుమతులూ అందుకున్నారు. ఆమె ఆధ్వర్యంలో మా పార్టిసిపెంట్స్ వివిధ పార్శ్వాలతో కలిసిన అనువాద వ్యాకరణం నేర్చుకుంటారని మా నమ్మకం.

వర్క్‌షాప్‌లు జరిగే తీరు ఎలా ఉంటుంది?

ఇది ఆరు నెలల వరకు, నెలకి మూడు గంటల పాటు జరిగే ఆన్‌లైన్ వర్క్‌షాప్. ఈ ఆరు నెలల్లో మా ఆరుగురు అనువాదకులు ఒక్కొక్కరూ సెషన్‌కు రెండేసి కథల చొప్పున అనువదిస్తారు. ప్రతి వర్క్‌షాప్ లోనూ ఆ అనువాదాల గురించి లోతుగా రాస్‌తో చర్చిస్తారు. రాసినదాన్ని మెరుగుపరిచే పద్ధతులను నేర్చుకుంటారు. ఇవన్నీ తరువాతి సెషన్‌కి వారు చేసే అనువాదాల్లో ఇంప్లిమెంట్ చేసుకుంటూ, కొత్త సమస్యలు ఎదురైతే వాటిని చర్చకు తీసుకొస్తారు. ప్రాంతీయత, రెండు భాషల మధ్య పొసగని తత్వం, ఆలోచనా విధానాల్లో వైరుధ్యం, డయాస్పోరా ఆఫ్ టార్గెట్ రీడర్స్, ఇడియమాటిక్ ఎక్స్‌ప్రెషన్స్ (నుడికారం), పఠనీయత లాంటి అన్ని అంశాలనూ కూలంకషంగా చర్చిస్తారు, నేర్చుకుంటారు. ఇందుకు రాస్ ష్వార్జ్‌తో పాటు గెస్ట్ స్పీకర్స్ కూడా సహకరిస్తారు. తమ రచనల్ని చర్చిస్తూ, మెంటార్ల సలహాలు పరిగణిస్తూ సమన్వయంతో సాగే ఒక పూర్తి ఇంటరాక్టివ్ వర్క్‌షాప్ ఇది.

తెలుగు నుంచి ఇంగ్లీష్‌కు అనువదించే క్రమంలో ఎదురయ్యే ఏ అంశాలపై, సమస్యలపై ఫోకస్ పెడుతున్నారు?

అనువాదం అంటే కేవలం వెర్బాటిమ్ (ప్రతి పదం యథాతథంగా చేయటం) మాత్రమే కాదని చదువర్లుగా మేం నమ్ముతున్నాం. ఎంత కాదనుకున్నా అనువాదంలో కొంత నష్టం జరుగుతుందని మనం ఒప్పుకోవాలి. అలాగని పూర్తిగా భావమే విడిచిపెట్టి సొగసుగా నాలుగు మంచి పదాలు పొదిగి ఇచ్చేసి అనువాదం అంటే పెద్ద మోసమే కదా! పైన చెప్పినట్లుగా– అనువాదాల్లో సమస్యలు– ముఖ్యంగా ప్రాంతీయత, రెండు భాషల మధ్య పొసగని తత్వం, ఆలోచనా విధానాల్లో వైరుధ్యం, డయాస్పోరా ఆఫ్ టార్గెట్ రీడర్స్ రాస్ అన్నట్లు 'మ్యూజిక్ ఆఫ్ ది టెక్స్ట్', ఇవన్నీ చూసుకోవాల్సిన అంశాలు. దీనినే అనువాద వ్యాకరణం అని చెప్పుకోవచ్చు. దీని పైనే మా వర్క్‌షాప్ పూర్తి శ్రద్ధ పెడుతుంది.

వర్క్‌షాప్‌లో భాగంగా పార్టిసిపెంట్స్ చేసే అనువాదాలు కేవలం వర్క్‌షాప్ కోసమే గాక Asymptote, Words Without Borders లాంటి అనేక ప్రఖ్యాత అంతర్జాతీయ సాహిత్య జర్నల్స్‌లో ప్రచురితం అయ్యేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేయాలన్నద దానిపై కూడా మెంటార్స్ ఫోకస్ చేస్తున్నారు.

తెలుగులోని ఏ రచనలను ఇంగ్లీషులోకి తీసుకువెళ్ళాలీ అన్న ఎంపిక ఏ ప్రాతిపదిక మీద చేయబోతున్నారు? అనువాదం జరిగాక ఆ పుస్తకాల మార్కెటింగ్ స్ట్రాటజీ ఏమిటి?

అనువాదం కేవలం సాహిత్య ప్రక్రియే కాదు, ఒక భాషా సమాజాన్ని మరో భాషా సమాజానికి పరిచయం చేయగలదు కూడా. మేము ఇంగ్లీష్ లోకి అనువాదం చేయించే రచనల్లో సమకాలీనతకి ప్రాధాన్యత ఇస్తున్నాం. లోకల్ ఈజ్ గ్లోబల్ అన్నవిధంగా– ఇక్కడి స్థానికత ఉట్టిపడుతూ, యూనివర్సల్ అప్పీల్ కూడా ఉన్న కథలని ఎంచుతున్నాం. ప్రస్తుతానికి, ఈ వర్క్‌షాప్ కోసం మా రెండు పబ్లిషింగ్ హౌసుల నుంచి వచ్చిన రచయితల కథలు మాత్రమే తీసుకున్నాం. ఇవన్నీ ఒక ఇంగ్లీష్ ఆంథాలజీగా తీసుకురావాలనేది మా ఉద్దేశం. ఏవి తీసుకోవాలీ అన్నది పూర్తిగా మా విచక్షణ. ముందుగా కథలను అనువదింపజేసి, వాటిని అంతర్జాతీయ సాహిత్య పత్రికల్లో ప్రచురణార్థం అయ్యేలా చూసి, తద్వారా అంతర్జాతీయ ప్రచురణకర్తలతో మాట్లాడి పుస్తకంగా తేవాలి అనుకుంటున్నాం.

పుస్తకాల మార్కెటింగ్ విషయంలో తప్పనిసరిగా ఒక స్ట్రాటజీ ఉండాల్సిందే అని నమ్ముతాం. పబ్లిషర్లుగా మేం ఇప్పుడు తెలుగులో ఇన్ని వేల పుస్తకాలు అమ్మగలుగుతున్నామంటే అదే కారణం. ఈతరం తెలుగు మాట్లాడే వాళ్ళందరూ తెలుగు చదవగలిగే వాళ్లు కాదు. ప్రపంచవ్యాప్తంగా ఉండే ఇంగ్లీష్ భాషా పాఠకులు, మన దేశంలోని ఇంగ్లీష్ పాఠకులు, తెలుగు చదవలేక కేవలం మాట్లాడగలిగేవారు... వీరంతా మా టార్గెట్. వీళ్లదాకా మా అనువాద సాహిత్యం తీసుకు వెళ్ళడం కోసం అన్ని టచ్ పాయింట్స్‌నూ మేము దృష్టిలో ఉంచుకుంటాం. సోషల్ మీడియాలో కొత్త పాఠకులని చేరడం కూడా ఇందులో పెద్ద భాగమే. సమకాలీన తెలుగు సాహిత్యాన్ని ఇంగ్లీష్ పాఠకులకి అందించడం మా అనువాద లక్ష్యాల్లో ముఖ్యమైనది.

వర్క్‌షాప్ తొలి సెషన్లు ఎలా జరిగాయి?

వచ్చిన అప్లికేషన్స్‌ని ఫిల్టర్ చేసి ఆరుగురిని ఎంపిక చేశాం. మొదటి సెషన్ సెప్టెంబర్ 12న జరిగింది. పార్టిసిపెంట్స్ అనువాదం మొదలు పెట్టిన కథలని ఒక్కొకటిగా ఎంచి రాస్ ష్వార్జ్ వారి తోనే చర్చించారు. రాస్ ఇచ్చిన సూచనలు, సలహాలు, రేకెత్తించిన ప్రశ్నలు అన్నింటికీ పార్టిసిపెంట్స్ నుంచి గొప్ప స్పందన లభించింది. ముమ్ముందు సెషన్స్ కోసం ఉత్సుకంగా ఎదురు చూస్తున్నాం మేమంతా. ■

నూతన శిశువు బోసినవ్వు లాంటి పుస్తకం

'రాయడం అనేది సిగ్గు విడిచి చేసే ప్రక్రియ' అంటాడు ధీరజ్. విమర్శ మరీ సిగ్గు విడిచిన ప్రక్రియ అంటాను నేను. 'క్షణికాలు' అనే ఈ పుస్తకం చాల కొత్తగా ఉంది అని చెప్పడానికి నేనేం సిగ్గు పడడం లేదు. ధీరజ్ ఒక తాజా రచయిత. ఇప్పుడిప్పుడే పుట్టిన పాపాయి బోసి నవ్వు ఈ రచనల సంపుటి.


సస్పెన్స్ అనిపించని సస్పెన్స్, సంఘస్పృహ అనిపించని సంఘస్పృహ ఈ రచయిత ప్రత్యేకత. ఆ రెండు లక్షణాలకు మచ్చుగా ఆయన అందించిన మొదటి రెండు కథలు చాలు. మిగతా అన్నిటిదీ అదే కోవ. ఆవు బొమ్మ గీసి కింద ఆవు అని రాస్తే తప్ప తృప్తిపడని సందేశాత్మకుడు కాదు ధీరజ్. మౌనానికి, ధ్యానానికి చోటు ఇచ్చే రచయిత.

మొదటి కథ ఉత్తమ పురుషలో ఉంటుంది. చెప్పే మనిషి పేరేందో తెలిసిపోతుంది గాని, ఈయన పేరు అదేనా, ఈ 'ఉత్తమ పురుషుడు' మరెవరిదో కథను ఇలా చెబుతున్నాడా అని ఒక రకం సస్పెన్స్ కథను చివరి కంటా చదివిస్తుంది. ఏతత్పురుషుడి మామ పెంచిన కుక్కల్లో ఒకదానికి ఇతడి పేరే పెట్టేరని క్లూ. ఆ కుక్క పేరు దత్తు. కథలో ఉన్నది అతగాడి బాల్యమని కథ శీర్షికలోనే ఉంది. మరి, మన 'ఉత్తమ పురుషుడి' పేరేంటబ్బా అని అడగాలనిపిస్తుంది ఒక్క క్షణం. 'సంజీవరెడ్డీ నీ కులమేమిటని అడుగుతా వేంట్రా' అని 'రక్తకన్నీరు' నాటకంలో నాగభూషణం డైలాగు గుర్తుకొస్తుంది, లోలో విరిసే చిరునవ్వుతో పాటు. సో, మనోడి పేరు దత్తుగాడు అన్నమాట అనుకుంటాం, ఏదో పెద్ద సస్పెన్సు తొలగినట్టు. ఈలోగా కథలో కదిలే తెలంగాణ భాష సొగసు ఓ మంచి అనుపానం.

రెండో కథ 'సంభాషణ'. 'ఆయమ్మ' ఒక పేదరాలు. అంత పేదరికంలో తన రోగిష్టి మొగుణ్ని చక్కగా చూసుకుంటున్న ఆమె గొప్పదనాన్ని, అలాగని ఏ సతీ సావిత్రో కాకుండా 'గలీజు' అని అయినోళ్లతో అనిపించుకున్న ఆమె ఆడతనాన్ని చాల హృద్యంగా బొమ్మలు కట్టిందీ కథ. కథ ఎక్కడా బండగా అనిపించదు. కాలేజీ టీచర్స్ డే ఉత్సవాల ముగింపులో, రూములో చివరికి మిగిలిన ఇద్దరు టీచర్లు, ఫ్లస్ అక్కడికి ఊడవడానికి వొచ్చిన ఆయమ్మ... వీళ్ల మధ్య సంభాషణ... సరదాగా మొదలై మెల్లగా చాల నొప్పి కలిగించే బతుకు వాస్తవాలలోకి మనల్ని లాక్కుపోతుంది. ఆయమ్మ ముసలిదైంది. ఏమాత్రం డబ్బున్నా ఇంట్లో విశ్రాంతి తీసుకోవలసిన వయసు. కాలేజీలో కసవులూడ్చి శుభ్రాలు చెయ్యడం వంటి అలసట కలిగించే పనులకు వయసు కాదు. భర్త కడుపులో గడ్డతో మంచం దిగలేని స్థితిలో తిండి తినడానికి కూడా ఆయమ్మ సాయం కోసం ఎదురు చూస్తూ ఇంట్లో. అయితే ఏం చేయాలి? పోరాడాలి! ఎవరి మీద? ఆమెను గదమాయించే సార్లూ మేడమ్‌ల మీదనా, పనికి బొటాబొటి కూలీ, చేయని రోజుకు ఏమీ ఇవ్వని పీనాసి యజమానుల మీదనా, ఆమెను గలీజు మనిషి అనేసి తప్పుకునే దగ్గరివాళ్ల మీదనా, కథలో మన ఇద్దరు సార్లు వాళ్ల మనస్సులలో చేసినట్లు మన మీద మనమే పోరాడాలా? అన్నీ సరైన సమాధానాలే. అన్నిటికి తలుపులు తెరిచి ఉంచే సవినయ కథనం 'సంభాషణ'.

దిగంబర కవులు తమ రచనలను వచన పద్యాలని అననివ్వం, 'దిక్కు'లు అంటామన్నారు. ఇక్కడ తన పుస్తకంలో రచనలకు 'కొన్ని కథలు', 'కొన్ని క్షణాలు', 'కొన్ని తారలు', 'కాసింత శూన్యం'... అని సరదా పేర్లు పెట్టారు ధీరజ్. పఠన సౌలభ్యం కోసం కథలు, మ్యూజింగ్స్, కవితలు అని పేరు పెట్టుకుని చదువుకోవచ్చు. పుస్తకం శీర్షిక సూచించినట్టు అన్నీ 'క్షణికాలే'. అంటే రచయిత అనుభవించిన స్థలకాల శకలాలే. "పాడుతాతీయగాలాంటి ప్రోగ్రాం ఏదో వచ్చి వెళ్లిపోయే ముందు, మనుషుల మీదుగా టైటిల్స్ పోతూ ఉంటే వీళ్లకు గుల్‌గుల్ ఎందుకు అవ్వట్లేదు అని నోరెళ్లబెట్టి ఆశ్చర్యపడ్డ జ్ఞాపకం" అంటాడొక చోట. ఇలాంటి చిన్న చిన్న జ్ఞాపకాల సమాహారమే జీవితం. చాల అణువులు కలిసి ఒక దేహం, ఒక విశ్వ గోళం. చాల క్షణాలతో కలిసి జీవితం. ప్రతి క్షణాన్నీ జీవించాలి. ఆ క్షణంలోనే జీవించాలి. మునుపటి క్షణం మీద నిలబడిన ఇప్పటి క్షణమే మరు క్షణానికి పునాది.





సస్పెన్స్ అనిపించని సస్పెన్స్, సంఘస్పృహ అనిపించని సంఘస్పృహ ఈ రచయిత ప్రత్యేకత. ఆవు బొమ్మ గీసి కింద ఆవు అని రాస్తే తప్ప తృప్తి పడని సందేశాత్మకుడు కాదు ధీరజ్. మౌనానికి, ధ్యానానికి చోటు ఇచ్చే రచయిత.

ఇప్పటి తరం మునుపటి తరాల కన్న మెరుగ్గానే జీవిస్తోంది. అలా నడు ఇలా మాట్లాడు ఆ చిరుగుల టైట్ ప్యాంట్లేంటి, ఆ తెలుగుమీరిన ఇంగ్లీషేంటి అని మునుపటి తరాలు గొణుగుతాయి. ఇవాళ ఉన్నవన్నీ మాండలికాలే. కొత్త తరం ఇంగ్లీషులో ఆలోచించి తెలుగులో మాట్లాడుతోంది. కొత్త తెలుగు తయారవుతోంది. తప్పు కాదు. ఈ వ్యవహారాల్లోంచి పుట్టుకొచ్చే భాషే వ్యావహారిక భాష. ఈ పుస్తకంలో చాల చోట్ల ధీరజ్ ఇంగ్లీషులో ఆలోచించి తెలుగులో మాట్లాడుతున్నాడని అనిపించింది. అది సహజం అనిపించింది కూడా. "...కొత్త ఉదయాల్లో ఉండే అర్థం కాని వెచ్చదనానికి ప్రతిచర్య పడదామని ఇదంతా" అంటాడు 'ఒక చిన్న సంగతి' అనే పుస్తక ప్రవేశికలో. 'రియాక్ట్ అవుదామ'ని ఆంగ్లంలో ఆలోచించిన తెలుగిది. మునుపు విద్యావంతులు సంస్కృతంలో ఆలోచించి తెలుగులో పద్యాలు రాశారు. ఆదికవులయి, కాలాన్ని వెలిగించారు. ఇప్పటి రచయితలు ఇంగ్లీషులో ఆలోచించి తెలుగు మాట్లాడుతున్నారు. ఇక్కడ ఇచ్చిన ఉదాహరణ మరీ గహనంగా ఉంది గాని, ఈ భాష ఆహ్వానించదగినదే. ఈ చర్నింగ్‌లోంచే కొత్త జీవితానికి అవసరమైన, అనుగుణమైన భాష తయారవుతుంది. ఈ చర్నింగ్ ప్రాసెస్‌కు చక్కని ఉదాహరణ ధీరజ్ కశ్యప్ వేముగంటి.

■ హెచ్చార్కె
95023 45716

కారా మాస్టారు మా ఇల్లు వెతుక్కుని వచ్చారు!


నా మొదటి పుస్తకం

■ పి. సత్యవతి



నేను అప్పటికి కొన్ని కథలు వ్రాసి వున్నప్పటికీ పుస్తకం వేసుకోవాలన్న ఆలోచన లేదు. అంటే నేను కూడా కథలు వ్రాయగలను పుస్తకం వేసుకోవచ్చు ఫరవాలేదు అనుకోలేదు. మీరు బాగా రాస్తున్నారు అని చెప్పి సంకలనం వేసుకోమని ప్రోత్సహించిన వారు పురాణం సుబ్రహ్మణ్య శర్మ గారు.

ఆ సమయంలో ఆయన సీతా బుక్స్ పేరుతో తన 'ఇల్లాలి ముచ్చట్లు' వేసుకుంటున్నారు. పుస్తకాలు చదవడమే గానీ వాటి ప్రచురణ, ముద్రణల గురించి నాకేం తెలీదు. నా కథలు చాలావరకూ ఆంధ్రజ్యోతిలో వచ్చినవే. అందులో ఒక ప్రథమ బహుమతి కథ కూడా వుంది. నా పుస్తక ప్రచురణ బాధ్యత పురాణం గారికే అప్ప చెప్పాను. ఆయన కొడుకు నానీ గారు ముఖ చిత్రం వేశారు. అది నా మొదటి కథా సంకలనం. పురాణం నన్ను మెచ్చుకుంటూ ముందుమాట వ్రాసారు. కొంచెం ఉబ్బి తబ్బిబ్బులే!



ఆవిష్కరణ సభ పెట్టడం అదంతా నాకు తెలియదు. అసలు విషయం ఏమిటంటే నేను కూడా సభ పెట్టడం ఏమిటి? అని చాలా మొహమాటం. అది too humble కావచ్చు, ఆత్మవిశ్వాసం తక్కువ కావచ్చు కానీ అప్పట్లో అంతే. కానీ పురాణంగారు పట్టుపట్టడంతో కాంధారీ హోటల్‌లో చిన్న గెట్ టుగెదర్‌లా పెట్టాను. పురాణం, నండూరి రామ్మోహనరావు, భమిడిపాటి జగన్నాథరావు, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, టి.ఎల్. కాంతారావు, వీరాజీ, నా స్నేహితురాలు సి. సుజాత అలా పదిహేనుమంది వచ్చారు. నా కథల గురించి సుబ్బరామయ్య గారు తప్ప అందరూ మాట్లాడారు. నిజంగా నేను కథలు బాగానే రాయగలనని నాకు తెలిసి పోయింది. మాకు ఫొటోగ్రాఫర్ లేడు, పత్రికా ప్రతినిధులను పిలవలేదు. సుజాత ఉదయం పత్రికలో మంచి రిపోర్ట్ వ్రాసింది. తరువాత పత్రికల్లో సానుకూలమైన ప్రోత్సాహజనకమైన సమీక్షలొచ్చాయి.

అదంతా ఒక ఎత్తు అయితే తరువాత ఒక రోజు జరిగిన అద్భుతం నిజంగా అద్భుతమే. ఆరోజు నేను మా బాల్కనీలో కూర్చుని బయటికి చూస్తున్నాను. మా గేటు దగ్గర ఒక రిక్షా ఆగింది. అందులో నుంచి దిగిన తెల్లబట్టల పెద్దాయన అచ్చం కాళీపట్నం మాస్టారులా వున్నారు. నా చిత్రభ్రమ కాకపోతే ఆయన ఎందుకు వస్తారు అనుకుంటూ వుండగా మా కాలింగ్ బెల్ మోగింది. నేను కలలో కూడా ఊహించని విధంగా కారా మాస్టారు మా ఇల్లు వెతుక్కుని వచ్చారు. నా జీవితంలో ఒక అద్భుతమైన క్షణం అది. ఆయన పుస్తకంలో లోపాలు చెప్పారు. కథల్లో లోపాలు కాదు. కథల కింద వాటి ప్రచురణ తేదీలు వేయకపోవడం, కథల్ని క్రానలాజికల్ ఆర్డర్‌లో పెట్టకపోవడం, అలాంటివి. మాస్టారు ఇంకో మాట కూడా అన్నారు– "ఇంత చక్కగా కథలు వ్రాసే నువ్వు బయటికెందుకు రావు? అందుకే నేను రావాల్సి వచ్చింది," అని. చాలా మొహమాటంగా వుండేదాన్ని. మెల్లగా బయటికి వచ్చాను నేను. కొన్ని కథల వలన కొంతమంది గుర్తుపట్టడం మొదలు పెట్టారు నన్ను. ఇదంతా 1989లో సంగతి. అప్పటి నుంచి మాస్టారు నాకు మంచి మిత్రులయారు. చివరి చివరలో నేను వ్రాసిన 'సప్తవర్ణ సమ్మిశ్రితం' కథ గురించి కూడా నాకు ఫోన్ చేసి మాట్లాడారు. నా మొదటి కథా సంకలనం వలన నాకు మంచి పరిచయాలు అయ్యాయి, స్నేహితులు దొరికారు, నమ్మకం వచ్చింది– నేనూ వ్రాస్తానని వ్రాస్తూ పోగలనని.

ఈమెయిల్: sathyavathi.pochiraju@gmail.com

కాళీపట్నం శత జయంతి సదస్సు

సాహిత్య అకాడమీ – రైటర్స్ అకాడెమీ, విశాఖపట్నం సంయుక్త నిర్వహణలో కాళీపట్నం రామారావు శత జయంతి సదస్సు నవంబర్ 9 ఉదయం 10 గంటల నుంచి అల్లూరి సీతారామరాజు విజ్ఞానకేంద్రం, డాబాగార్డెన్స్, విశాఖపట్నంలో జరుగుతుంది. ఈ సందర్భంగా కాళీపట్నంపై మోనోగ్రాఫ్‌ను కె. శ్రీనివాసరావు ఆవిష్కరిస్తారు. అధ్యక్షత సి. మృణాళిని, గౌరవ అతిథి వి.వి. రమణమూర్తి, కీలకోపన్యాసం వివిన మూర్తి. సభలో ప్రసాద వర్మ 'కాళీపట్నం కథల్లో రాజకీయ సాంఘికాంశాలు', కె.ఎన్. మల్లీశ్వరి 'కాళీపట్నం కథల్లో కుటుంబ సంబంధాలు', జి. వెంకటకృష్ణ 'కాళీపట్నం కథా శిల్పం', జి.ఎస్. చలం 'కాళీపట్నం వ్యాసాలు', దాసరి రామచంద్రరావు 'కథా నిలయం కాళీపట్నం రామారావు', డి. హరనాథ్ (అర్నాద్) 'గురువుగా కాళీపట్నం' అంశాలపై ప్రసంగిస్తారు.

సాహిత్య అకాడమీ

ఖమ్మం ఈస్తటిక్స్ అవార్డు ఫలితాలు

ఖమ్మం ఈస్తటిక్స్ సాహిత్య పోటీలో కవిత్వ విభాగంలో జూకంటి జగన్నాథం కవితా సంపుటి 'ఒక కప్పు చాయ్ నాలుగు మెసేజ్‌లు' రూ.40వేల బహుమతికి ఎంపిక కాగా, రాళ్ళబండి శశిశ్రీ 'అనుమంద్రం', తెలుగు వెంకటేష్ 'కబోది చేపల కబుర్లు' ప్రత్యేక ప్రశంసకు ఎంపికయ్యాయి. ఎన్. గోపి కవితా సంపుటి 'క్రియ ఒక జీవన లయ' విశిష్ట పురస్కారానికి ఎంపికైంది. కథల విభాగంలో కె.వి. మన్ ప్రీతమ్ రూ.25వేల ప్రథమ, సయ్యద్ గఫార్ రూ.15వేల ద్వితీయ, కరీం రూ.10వేల తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ఈ కథలతో మరో తొమ్మిది కథలు కలిపి సంపుటిగా ప్రచురిస్తాం. వీటి రచయితలు– జి. ఉమామహేశ్వర్, సింహప్రసాద్, వేల్పుల నారాయణ, రాజా నరసింహ, రోహిణి వంజారి, సుగుణారావు, శాంతి ప్రబోధ, పి. కిషన్, శివప్రసాద్. డిసెంబర్ 15న ఖమ్మంలో పురస్కార ప్రదానం.

రవి మారుత్

దాపు

ఎంతకనీ అల్లుకపోను
ఎండి పోతవుంటే
కన్నీళ్లు వొంచుకోని
ఇగురేసుకుంటున్న

కార్తి ఎకసెక్కాలాడుతుంటే
సాలు మీద ఇత్తనం ఇగిలిస్తుంది
ఉలుకు లేదు పలుకు లేదు
ఊ అంటే ఉప్పనే
పేరుకే ఊయ్యాల జానయ్య
ఊగింది లేదు సచ్చింది లేదు అన్నట్టూ
ఒక దాని ఎనుక ఒకటి
ఎటు చూసినా కంప ఎట్టాలే
చెలగేసి చెలగేసి
దాపు కోసం...
దారులు వెతుకుతున్న

నిలబడ్డ కాడల్లా
నిన్నటి పొద్దే నిలదీస్తుంది
నీడలు సుట్టు ముట్టీ
కొలుపు చెబుతున్నయి
కనిపించని తెడల నేల
ఈద లేక కొట్టుక పోతున్న
మాయ చిక్కంలో పెద్ద చాపను

చెర్ల చాపలు కూడ
రంగు రంగుల జెండాలోలే తిరుగుతున్నయి
ఒడ్డు మీద కొంగలతొ పాటు
చాపల సేటు ఉండు
హౌరా లారీలెక్కుతుంటే చాపలు
నేను గులకరాల్లెంటా పడి పోతున్న

ఏముంది నాకు
ఏలు మీద ఎన్నికల మరక తప్పా
కళ్లతోనే కాంటా కొడుతున్రు
అమ్మ అడుగుల్ని
పాత పోసుకున్నా బాగుండేది
అడుగెనుక అడుగు పడేది

కట్టకు ఇటు కట్టకు అటు
వొడిపిల్లు లేదు వొలకసత్త లేదు
ఏసువాసు పట్వకు
సూరు కింద సుట్టకుదురై సుట్టుకున్న
కన్నీల్ల ఎసరు
కల్లం మొకం తిప్పుకుంది
కాలం కడకు జరిగింది
ఎవడు దిగి ఎవడు ఎక్కిన
దిగులు మేమమే కమ్ముకునేది

కండ్లల్లా కనగులు తిరిగిన
కట్ట మైసమ్మ కట్ట దిగకుండ
కాకిచిత్తర కాల్చి పెట్టిన
ఎడ్డులేవు సుద్దులేవు
ఎల్లమ్మ ఎల్లి పోతుంటే కాళ్ల ఏళ్ల పడ్డా
ఉప్పలమ్మా పోకుండా
ఊరి పొలిమేర దగ్గర నిలబడ్డా
బతుకు పందెం పడని పచ్చీసు
పడి మీద పక్షి కన్నీళ్లు కార్చిన
ఇమానం తప్పిన కొడుకు
విమానం దిగలే
చెట్టూ పుట్టే ఆకరి తానమాడే ఊరి పాలోల్లు
లో లోపలి దాపులోకి నిశబ్దంగ జారుకున్న

■ మునాసు వెంకట్
✆ 99481 58163



సిద్దిపేట్ టూ మస్కట్ వయా హైదరాబాద్

పోవాలని ఏనాడూ ఉండదు,
నిమ్మళం లేని బతుకు ఉండనీయదు.

కాలు ఇంట్లో ఉంటే కడుపాకలి తీరదు,
రెక్క విచ్చుకున్న మరుక్షణం
కంటతడి ఆరదు...

ఇదే చివరిదని తలచిన ప్రతిసారీ,
చివర్లన్నీ కొత్త కలతలకు చివుర్లేస్తూ...
కలతలన్నీ మొదలుకంటా చిదిమేస్తూ...

అప్పుడే పుట్టిన చంటిబిడ్డనూ,
మంచం పట్టిన ముసలి తండ్రినీ,
తొక్కు నూరిన పొట్లాల్ని
ముప్పై కిలోల మూటలో సర్దుతూ,
కంటి చెమ్మను కప్పెట్టి కలియదిరుగుతున్న

ఆలి అవస్థనూ,
తోలీయనీకొచ్చిన ఎదురింటి జరీనాపను అలుముకుని పుట్టెడు శోకాన్ని కుమ్మరించిన తల్లి
కన్నపేగు తీపినీ,
ఇట్లా బంధాలన్నిటినీ విడిచేసి,
నావైన చేతుల్ని విరిచేసి,
నావి కాని రెక్కల్ని తొడుక్కున్నప్పుడల్లా,
దేహమొక దుఃఖ మేఘం,
ఇల్లేమో దిగులు కార్ఖానా...

"సిద్దిపేట్ టూ మస్కట్
వయా హైదరాబాద్"

ఒక్కో ఊరూ దాటిపోతోంది,
ఒక్కో చుక్కా రాలిపడుతోంది,
అశ్రువులన్నిటినీ పోగేసి,
కాలం దుఃఖపు పంటను సాగుచేస్తోంది...

అంధకారం నుండి అంధకారం వైపు
పయనిస్తున్న తొవ్వలో,
కళ్లల్లో సముద్రాలు మొలుస్తున్న అలికిడి,
కలవరింతల కత్తులు, కలల్ని పొడుస్తున్న
సలపరింత...

పైకంతా ప్రశాంతం గానే ఉంటుంది,
ముఖం లోనూ ఎలాంటి అలజడుండదు...
లోపల్నుండి ఉబికిన వాళ్ళు జలపాతాలై
జారుతున్న స్పర్శ...

"లేడీస్, అండ్ జెంటిల్మెన్ దిస్ ఈజ్ యువర్
కెప్టెన్ స్పీకింగ్, వీ విల్ బీ అరైవింగ్ ఎట్ అవర్
డెస్టినేషన్ షార్ట్‌లీ..."

+++

"జత్తన్ సే జా బేటా" అంటూ,
నా హిఫాజత్‌కై దువా చేసి,
తడికళ్ళతో తడిమిన ఇమామెజామిన్‌ను
భుజానికి ముడేసింది అమ్మీ...

విప్పేటప్పుడు
తాయత్తులోంచి జారిపడ్డ రూపాయి
బిళ్ళ శబ్దానికి రియాల్ కలలు రక్తం
కక్కుకున్నట్లు తనకెట్లా చెప్పను...?!

■ జాబేర్ పాషా
✆ 00968 78531638 (మస్కట్)

- జత్తన్ = జాగ్రత్త
- హిఫాజత్ = క్షేమం
- దువా = ప్రార్థన
- ఇమామెజామిన్ = సురక్షితంగా వెళ్లి, రావాలని భుజానికి కట్టే తాయత్తు
- రియాల్ = మస్కట్ కరెన్సీ





• దుర్గమ్మకు గాజుల అలంకరణ



ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానంలో అమ్మవారికి గాజుల అలంకరణ వేడుక ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఐదు లక్షల గాజులతో ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. గాజుల అలంకరణలో ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

6లో

కార్తీక సందడి



భవానీ ద్వీపంలో సందడి చేస్తున్న యువత



లాంచీలో ప్రయాణం

కార్తీకమాసం తొలి ఆదివారాన్ని పురస్కరించుకుని భవానీ ద్వీపం పర్యాటకులతో కళకళలాడింది. వరదలతో తీవ్రంగా దెబ్బతిన్న ద్వీపానికి యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. దీంతో సందర్శకులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు.

8లో

• మా ప్రాణాలు హరించే

ఎన్టీటీపీఎస్ మాకొద్దు

కొత్తగేటు ఎదుట బైఠాయించి ధర్నా

రోడ్డు ఊడ్చి బూడిదను ప్లాంట్ లోపలికి విసిరిన ఆందోళనకారులు

బూడిద చేతులతో అల్పాహారం తిని వినూత్న నిరసన

ఎన్టీటీపీఎస్ అధికారి ముఖంపై బూడిద చల్లిన మహిళ





ఎన్టీటీపీఎస్ కొత్తగేటు ఎదుట ధర్నా చేస్తున్న నిరసనకారులు (ఇన్‌సెట్‌లో) బూడిద చేతులతో అల్పాహారం తింటున్న నిరసన కారులు

ఇబ్రహీంపట్నం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : "బూడిద తిని బతకాలా.. ఇంట్లో ప్రతి వస్తువుపై బూడిదే. ఇప్పటికే శ్వాస కోశ వ్యాధులతో ఆస్పత్రి పాలవుతున్నాం. మా ప్రాణాలు అంటే మీకు లెక్కలేదా. ఇదిగో ఈ బూడిద మీరు తినండి" అని కడుపు మండిన ఓ మహిళా ఎన్టీటీపీఎస్ సీఈ ముఖంపై బూడిద చల్లి నిరసన తెలిపింది. బూడిద కాలుష్యంతో మా ప్రాణాలు హరించే ఎన్టీటీపీఎస్ మాకొద్దు అంటూ కాలుష్య నియంత్రణ సమితి సభ్యులు ఎన్టీటీపీఎస్ కొత్తగేటు ఎదుట ఆదివారం ధర్నాకు దిగారు. ఆందోళనకారులు రావడాన్ని గమనించిన భద్రతా సిబ్బంది గేట్లు మూసి వేయడంతో రోడ్డుపై ఉన్న బూడిదను ఊడ్చి ప్లాంట్ లోపలికి విసిరారు. బూడిద చేతులతో అల్పాహారం తిని వినూత్నంగా నిరసన తెలిపారు. ఉద్యోగులను, కార్మికులను ప్లాంట్ లోనికి వెళ్లనీయకుండా, బయటకు రానియ్యకుండా అడ్డుకున్నారు. ఎన్టీటీపీఎస్ యాజమాన్య నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చీఫ్ ఇంజనీరు వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ధర్నా విరమించేది లేదని ఉదయం 7.30 గంటల నుంచి 11.30 గంటల వరకు గేటు ముందే భీష్మించుకుకూర్చున్నారు. దీంతో చేసేది లేక చీఫ్ ఇంజనీరు నాగరాజు గేటు వద్దకు చేరుకోవడంతో ఉద్యమకారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఒక దశలో సహనం కోల్పోయిన ఆందోళన కారులు ఎన్టీటీపీఎస్ అధికారి ముఖంపై బూడిద చల్లారు. ఆరు మాసాల కిందట కాలుష్యం నియంత్రిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. నాసిరకం బొగ్గు వినియోగించడం వల్ల బూడిద కాలుష్యం పెరిగిపోతుందని, 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌లో ఈఎస్పీలు, సైలోలు లేకపోవడంతో నేలపై వదిలేస్తున్న బూడిద పట్టణాన్ని కమ్మేస్తుందని ఆందోళనకారులు సీఈతో చెప్పగా, అది నిజమేనని ఆయన అంగీకరించారు. నివాస ప్రాంతాలు, పాఠశాలలు, పట్టణ ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఏర్పాటు చేయబోతున్న బొగ్గు స్టాక్ యార్డ్‌ను నిలిపివేయాలని ఎన్.హెచ్ పక్కనే ఉన్న ఆ స్థలంలో బొగ్గు యార్డ్ పెడితే మరింత కాలుష్యం ఏర్పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణకు యాజమాన్యానికి ఇచ్చిన గడువు ఇప్పటికే ముగిసిందని, తక్షణం కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని ఆందోళన కారులు సీఈని హెచ్చరించారు. నెలలో కాలుష్యాన్ని నియంత్రిస్తామని సీఈ హామీతో వారు ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు!

ఎన్‌డీబీ రోడ్ల విస్తరణలో కదలిక!

పది రోజుల్లో పనులు ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశం

- క్షేత్రస్థాయిలో రోడ్ల సర్వే ప్రారంభం.. వారం రోజుల్లో పనులు
- ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎన్‌డీబీ రోడ్ల పనులను గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- ప్యాచ్ వర్క్‌లతో పాటు విస్తరించాల్సిన రోడ్లపైనా కూటమి ప్రభుత్వం దృష్టి
- రూ.240 కోట్లతో 13 ఆర్‌అండ్‌బీ రోడ్లను డబుల్ లేన్లుగా విస్తరణ!



సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) నిధులతో చేపట్టే ఆర్‌అండ్‌బీ రోడ్ల విస్తరణ పనులకు నాలుగేళ్ల తర్వాత అడుగు ముందుకు పడింది. సర్వే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఈ పనులను కూటమి ప్రభుత్వం కొనసాగించి పూర్తి చేయాలని నిర్ణయించింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో గతంలో ప్రతిపాదించిన 13 ఆర్‌అండ్‌బీ రోడ్ల విస్తరణ పనులను సమీక్షించటంతో పాటు వాటిని అతి త్వరలో చేపట్టేందుకు వీలుగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్ల విస్తరణ పనులపై దృష్టి సారించారు. వారంలో సర్వే పనులను పూర్తి చేయించి వెంటనే కాంట్రాక్టర్లతో పనులు చేయించటానికి రంగం సిద్ధం చేస్తున్నారు. - (ఆంధ్రజ్యోతి, విజయవాడ)

వైసీపీ పాలనలో వివాదాస్పద నిర్ణయాలతో తీవ్ర జాప్యం

ఉమ్మడి కృష్ణాజిల్లాలో గత వైసీపీ ప్రభుత్వంలో రూ.234 కోట్ల వ్యయంతో 13 ఆర్‌అండ్‌బీ రోడ్లను డబుల్ లేన్లుగా విస్తరించేందుకు నిర్ణయించారు. ఎన్‌డీబీ ఆర్థిక సహకారంతో ఈ విస్తరణ పనులు చేపట్టాలని తీర్మానించారు. ఈ పనులు చేపట్టిన మొదటి నుంచి వైసీపీ ప్రభుత్వ నిర్ణయాలు వివాదాస్పదంగా ఉండటంతో ఏడాదిలో పూర్తి కావాల్సిన రోడ్లు నాలుగేళ్లు అయినా పూర్తి కాలేదు. ఎన్‌డీబీ రోడ్ల పనులను పరుగులు పెట్టించటానికి చిన్న కాంట్రాక్టర్లు సరిపోరన్న సరికొత్త వాదనలను తెరమీదకు తీసుకు వస్తూ నేషనల్ హైవే పనులను చేసిన బడా కాంట్రాక్టర్లు అయితేనే వేగంగా చేయించటం సాధ్యమవుతుందని ఆ మేరకు టెండరు మార్గదర్శకాలను రూపొందించారు. ఈ నిర్ణయంపై చిన్న కాంట్రాక్టర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న కాంట్రాక్టర్ల ఆవేదనను ప్రభుత్వం లక్ష్య పెట్టలేదు. పెద్ద కాంట్రాక్టర్ల చేత పనులు చేయిస్తేనే వేగంగా జరుగుతాయన్న వాదనలను పదేపదే తీసుకు వచ్చి చివరికి వారనుకున్నట్టుగానే చేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన 13 ఆర్‌అండ్‌బీ రోడ్ల విస్తరణ పనులను పెద్ద కాంట్రాక్టర్ల ముసుగులో 'వృద్ధి కన్‌స్ట్రక్షన్స్' కు కట్టబెట్టేశారు. వృద్ధి కన్‌స్ట్రక్షన్స్ అనే సంస్థ పనులు దక్కించుకున్న తర్వాత ఒక్కో రోడ్డును సబ్‌లీజుకు ఇచ్చేసింది. ఇంతోటి దానికి కిందటి వైసీపీ ప్రభుత్వం పెద్ద కాంట్రాక్టర్లకు పనులు కట్టబెట్టడం ఎందుకన్న తీవ్ర విమర్శలు వచ్చాయి. సబ్ లీజుకు పొందిన చాలా మంది చిన్న, మధ్య తరహా కాంట్రాక్టర్లు ఈ పనులు చేపట్టలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు బిల్లులు రాకపోవటంతో చాలా మంది కాంట్రాక్టర్లు పనులు చేపట్టలేదు. ఎర్త్ వర్క్ చేసి వదిలేశారు.

విస్తరించనున్న ఆర్‌అండ్‌బీ రోడ్లు ఇవే

ఉమ్మడి జిల్లాలో మొత్తం 13 ఆర్‌అండ్‌బీ సింగిల్ వరస రోడ్లను డబుల్ లేన్లుగా విస్తరించటానికి 2020, సెప్టెంబరులో టెండర్లు పిలిచారు. మచిలీపట్నం - నూజివీడు - కల్లూరు, చెవిటికల్లు - వత్సవాయి, నూజివీడు - ఏలూరు రోడ్డు, గన్నవరం - పుట్టగుంట రోడ్డు, మధిర - కంచికచర్ల రోడ్డు, నూజివీడు - గన్నవరం రోడ్డు, కందులపాడు - గంగినేని- ఎర్రుపాలెం రోడ్డు, నందిగామ - పొక్కునూరు రోడ్డు, కొతవరం - నిడుమోలు - ఐలూరు రోడ్డు, తేలప్రోలు - వుయ్యూరు - వల్లూరు రోడ్డు, నడుపూరు - వాడపల్లి - కోరుకల్లు రోడ్డు, మంటాడ - లంకపల్లి రోడ్డు, మచిలీపట్నం - కమ్మవారి చెరువు వయా చిన్నాపురం రోడ్లను డబుల్ లేన్లుగా విస్తరించాలని నిర్ణయించారు. వీటిలో చూస్తే కందులపాడు - గంగినేని - ఎర్రుపాలెం, నందిగామ - పొక్కునూరు, నూజివీడు - ఏలూరు రోడ్డు, గన్నవరం - నూజివీడు రోడ్లను అసలు మొదలు పెట్టనే లేదు. గన్నవరం - పుట్టగుంట రోడ్డు పనులు మాత్రమే పూర్తి చేశారు. మిగిలిన రోడ్ల పనులు చేపట్టినా.. ఎర్త్ వర్క్ చేసి ఆపేశారు. ప్రభుత్వం నుంచి బిల్లులు రావన్న ఉద్దేశంతో సబ్ లీజు పొందిన వారంతా పనులు ఆపేశారు. దీంతో వృద్ధి కన్‌స్ట్రక్షన్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ సంస్థ కూడా పనులు చేపట్టలేకపోయింది.

ఎన్‌డీబీ రోడ్లకు నాలుగేళ్ల తర్వాత కదలిక

నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) ద్వారా విస్తరించాల్సిన ఆర్‌అండ్‌బీ రోడ్లను కూటమి ప్రభుత్వం పునఃప్రారంభించింది. గతంలో టెండరు దక్కించుకున్న వృద్ధి కన్‌స్ట్రక్షన్స్ సంస్థను మెడ వంచి పనులు చేయించేలా ఆర్‌అండ్‌బీ అధికారులు తీవ్ర ఒత్తిళ్లు తీసుకువస్తున్నారు. దీంతో క్షేత్ర స్థాయిలో ఆ సంస్థ ద్వారా సర్వే పనులు జరుగుతున్నాయి. వారం రోజుల్లో పనులు చేసేలా కాంట్రాక్టు సంస్థ చర్యలు చేపట్టింది. సబ్ లీజుదారులతో కూడా సమావేశమవుతున్నట్టుగా తెలుస్తోంది. మొత్తం మీద పది రోజుల్లో పనులు ప్రారంభం కావాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావటంతో ఆర్‌అండ్‌బీ అధికారులు కూడా కాంట్రాక్టు సంస్థ మెడ మీద కత్తి పెట్టి పనులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఇసుక మాఫియాకు డ్రోన్లతో చెక్

రీచ్‌ల వద్ద ఎగురుతున్న పోలీస్ డ్రోన్లు

- దూరంగా ఉంచిన ఇసుక నిల్వల గుర్తింపు
- ఇప్పటి వరకు 2,125 టన్నుల ఇసుక సీజ్
- రాత్రివేళ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పరిశీలన

ఇసుక మాఫియాకు పోలీస్ అధికారులు డ్రోన్లతో చెక్ పెట్టారు. రీచ్‌లకు దూరంగా తుప్పల మాటున నిల్వ చేసిన ఇసుకను డ్రోన్లతో కనిపెట్టి సీజ్ చేస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో 2,125 టన్నుల ఇసుక పట్టుకున్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి నిరంతర పర్యవేక్షణ ద్వారా ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో నిరోధిస్తున్నారు.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జిల్లాలో కృష్ణానదిలోని రీచ్‌ల నుంచి ఇసుకను అక్రమంగా తవ్వేసి డంపింగ్ చేసి తెలంగాణకు తరలించడం ద్వారా కాసులు వెనుకేసుకుంటున్న నేతలు పోలీస్ నిఘాకు చిక్కకుండా ఎత్తులు వేస్తున్నారు. జిల్లాలో ఇసుక కొరత తీవ్రంగా ఉండడంతో పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు నిరంతర నిఘాకు ప్రణాళికలు రూపొందించారు. స్థానిక పోలీసులపై వివిధ రకాల ఒత్తిళ్లు ఉండే అవకాశం ఉండడంతో విజయవాడ నుంచి ప్రత్యేక బృందాలు రీచ్‌లు ఉన్న ప్రాంతాల్లో దింపుతున్నారు. రూరల్ డీసీపీ మహేశ్వరరాజు ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, స్థానిక పోలీసులు రీచ్‌ల పరిసర ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. మారుమూల ప్రదేశాల్లో ఉన్న ఇసుకను గుర్తించడానికి డ్రోన్లను ఎగుర వేస్తున్నారు. ప్రత్యేక బృందాల కంటికి కనిపించని ఇసుక గుట్టలు డ్రోన్ల కంట్లో మాత్రం పడుతున్నాయి.

2,125 మెట్రిక్ టన్నుల ఇసుక సీజ్

నెల రోజుల వ్యవధిలో ఎన్టీఆర్ జిల్లా పోలీసులు 2,125 మెట్రిక్ టన్నుల ఇసుకను సీజ్ చేశారు. మొత్తం 150 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 195 మందిని అరెస్టు చేశారు. మొత్తం 100 కేసులు నమోదు చేశారు. రీచ్‌ల్లో నిలిచిపోయిన నీరు ఇప్పుడిప్పుడే తగ్గుముఖం పడుతోంది. దీనితో ఇసుక తవ్వకాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. తెలంగాణకు రహస్యంగా టిప్పర్లలో ఇసుక వెళ్లిపోవడాన్ని సీపీ సీరియస్‌గా తీసుకున్నారు. తెలంగాణను ఆనుకుని ఉన్న గ్రామాల్లో 17 చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. వాటిని విజయవాడలోని ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. పగటిపూట కంటే రాత్రి పూటే ఇసుక అక్రమ రవాణా జరిగే అవకాశాలు ఉండడంతో చెక్‌పోస్టుల వద్ద నైట్ విజన్ కెమెరాలను అమర్చారు. పోలీస్ కమిషనర్ రాత్రిపూట కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉంటూ చెక్‌పోస్టులను స్వయంగా పరిశీలిస్తున్నారు.

మిగతా 8లో..



నూతన కలెక్టర్‌గా లక్ష్మీశ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లా నూతన కలెక్టర్‌గా జి.లక్ష్మీశను రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నియమించింది. కలెక్టర్‌గా లక్ష్మీశ, కృతికా శుక్లాల పేర్లు ప్రధానంగా వినిపించినా చివరికి లక్ష్మీశ వైపే రాష్ట్ర ప్రభుత్వం మొగ్గు చూపించింది. కర్ణాటకకు చెందిన లక్ష్మీశ 2013 బ్యాచ్‌కి చెందిన ఐఏఎస్ అధికారి. లక్ష్మీశను ఏపీకి కేటాయించిన నేపథ్యంలో కర్నూలు జిల్లాలో శిక్షణ నిమిత్తం ట్రైనీ కలెక్టర్‌గా పనిచేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో నూజివీడు సబ్ కలెక్టర్‌గా మొదటి పోస్టింగ్ పొందారు. ఆ తర్వాత పార్వతీపురం మన్యంలోని ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేశారు. అనంతరం కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, విశాఖపట్నం గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా, తిరుపతి జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవోగా, డ్రగ్ అండ్ ఫార్మా డైరెక్టర్ జనరల్, మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు సీఈఓగా పనిచేస్తున్నారు. ఆయన ప్రస్తుతం మహారాష్ట్రలోని అమరావతిలో ఎన్నికల విధుల్లో ఉన్నారు. అక్కడ 20న పోలింగ్, 22న లెక్కింపు జరుగనుంది. ఈ క్రమంలో సెలవు రోజు ఇక్కడికి వచ్చి లక్ష్మీశ బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.



8 గంటలు.. కాల్వలోనే..!

- రైలు నుంచి దూకేసిన మహిళ
- ప్రాణాలతో కాపాడిన పోలీసులు

కాల్వలో నుంచి మహిళను బయటకు లాగుతున్న పోలీసులు

8లో

పాలిటెక్నిక్ కళాశాలలో నేడు జాబ్‌మేళా

8లో

26న కేంద్ర ప్రభుత్వానికి సమస్యలపై అర్జీలు

• రైతు, కార్మిక సంఘాల పిలుపు

6లో



దుర్గమ్మ గాజుల అలంకరణ

» ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు.. ఉదయం 4 నుంచి దర్శనం



వన్‌టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : యమదర్మరాజు తన సోదరికి పసుపు, కుంకుమ, గాజులు ఇచ్చి ఆశీర్వదించిన రోజు కార్తీకశుద్ధ విదియ (యమ ద్వితీయ) సందర్భంగా ఆదివారం దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అమ్మవారికి చాలా ప్రీతికరమైన గాజుల అలంకరణ వేడుక అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతీ ఏడాది అమ్మవారికి 5 లక్షలకు పైగా గాజులతో అలంకరణ చేస్తారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతిఒక్కరికి కలగాలని, అలంకరణ చేసిన గాజులు ముత్తయిదువులకు ఇవ్వటం జరుగుతుంది. తద్వారా అమ్మవారి ఆశీస్సులు లభిస్తాయని భక్తుల ప్రగాఢ నమ్మిక. అర్చకస్వాములు, వేదపండితులు మహామండపం 6వ అంతస్తులో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి గాజుల దండలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి భక్తులకు అమ్మ దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. కార్తీక మాసం సందర్భంగా మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకోవటానికి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావటంతో ఆలయం వద్ద భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈవో కేఎస్ సిబ్బందికి పలు సూచనలు చేస్తూ పర్యవేక్షించారు. భక్తులకు ఉచిత ప్రసాదం అందజేశారు.





దుర్గమ్మను దర్శించుకున్న సీఎం చీఫ్ సెక్రటరీ ముద్దాడ రవిచంద్ర దంపతులు, ఐఆర్ఎస్ అధికారిణి కోటేశ్వరమ్మ, నగర సీపీ దంపతులు

దుర్గమ్మ సేవలో ప్రముఖులు

కనకదుర్గమ్మను ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు చీఫ్ సెక్రటరీ ముద్దాడ రవిచంద్ర దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు, ఈవో రామారావు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం చేశారు. అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందచేశారు.

కనకదుర్గమ్మను ఐఆర్ఎస్ అధికారిణి, దుర్గగుడి మాజీ ఈవో కోటేశ్వరమ్మ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఉద్యోగులు ఆమెకు అమ్మవారి దర్శనం కల్పించారు.

విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు దంపతులు దర్శించుకున్నారు.

శాస్త్రోక్తంగా ఆర్జిత సేవలు

దేవస్థానంలో శాస్త్రోక్తంగా ఆర్జిత సేవలు నిర్వహించారు. వేదపండితులు, అర్చకస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర లింగార్చన కార్యక్రమాలు జరిగాయి. ఊంజల్ సేవ (సహస్ర దీపాలంకరణ) నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి అమ్మవారి, స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు.



కళావేదికపై కూచిపూడి ప్రదర్శన

సూర్యోపాసన సేవ..

ఆదివారం సందర్భంగా దేవస్థానం అర్చకులు, వేదపండితులు సూర్యోపాసన సేవ నిర్వహించారు. సమస్త జనుల ఆయురారోగ్యాలను కోరుతూ సంకల్పం చెప్పి అరుణ పారాయణ, తదితర సేవలను నిర్వహించారు.

కళావేదికపై అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

దేవస్థానం కళావేదికపై ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. రాజమహేంద్రవరం గాయత్రీ కళానికేతన్ కళాకారులు నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. శ్రీ విఘ్నరాజం భజే, అష్టలక్ష్మీ స్తోత్రం, మీనాక్షి పంచరత్నం, ముద్దుగారే యశోద, అయిగిరి నందిని, దేవీకృతి, లలితా హారతి, క్షీరాబ్ధి కన్యకకు, మహా కాళీ కీర్తన వంటి అనేక కీర్తనలకు చక్కటి అభినయంతో ప్రదర్శించి కనువిందు చేశారు. ఈవో కళాకారులను అభినందించి ప్రశంసాపత్రాలు, లడ్డూ ప్రసాదం అందజేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న రైతు, కార్మిక సంఘాల నేతలు

26న కేంద్ర ప్రభుత్వానికి సమస్యలపై అర్జీలతో హెచ్చరికలు

» రైతు, కార్మిక సంఘాల పిలుపు

ధర్నాచౌక్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అర్జీలతో కూడిన హెచ్చరికలు జారీ చేయాలని కేంద్ర రైతు, కార్మిక సంఘాలు పిలుపునిచ్చారు. రైతు, కార్మిక కేంద్ర సంఘాల రాష్ట్ర నేతల స్టీరింగ్ కమిటీ సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో ఆదివారం జరిగింది. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడారు. బీజేపీ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చినా తన వైఖరిని మార్చుకోలేదని మండిపడ్డారు. రైతుల డిమాండ్లను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. పారిశ్రామిక రంగంలో కార్మికుల హక్కులు, చట్టాలను పరిరక్షించాలన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేయకుండా ప్రభుత్వరంగంలో ఉంచాలన్నారు. ఈ నెల 26న దేశవ్యాప్తంగా అన్నిస్థాయిల్లో అధికారులను కలిసి రైతు, కార్మికుల డిమాండ్లతో కూడిన అర్జీలతో సమస్యలు పరిష్కరించాలని హెచ్చరికలు జారీ చేయాలని జాతీయస్థాయిలో రైతు, కార్మిక సంఘాలు నిర్ణయించాయన్నారు. ఏపీలో కూడా ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, వివిధ రంగాల కార్మికులకు పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఓబులేసు, ఇఫ్టూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.పోలారి, రైతు సంఘాల నేతలు కేశవరావు, జి.ఈశ్వర్, పి.జమలయ్య, మరీదు ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


శాశ్వత సభ్యత్వం తీసుకుంటున్న కొల్లు రవీంద్ర, నీలిమ

టీడీపీలో కార్యకర్తలకు గుర్తింపు

» పార్టీ సభ్యత్వ నమోదులో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్/చిట్టినగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : 1989లో సభ్యత్వం తీసుకున్న నాటి నుంచి కార్యకర్తలా తెలుగుదేశం పార్టీకి కట్టుబడి ఉన్నానని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఆబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం మచిలీపట్నంలోని పార్టీ కార్యాలయంలో రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ, సాధారణ కార్యకర్త నుంచి క్రియాశీల కార్యకర్తగా, డివిజన్ ఇన్‌చార్జిగా, జిల్లా తెలుగుయువత అధ్యక్షుడిగా వివిధ హోదాల్లో పనిచేశానన్నారు. ఎన్నికల్లో ఎవరికి టికెట్ ఇచ్చినా పార్టీ గెలుపునకు కృషి చేశానని, ఇప్పుడు


హసీంబేగ్‌కు శాశ్వత సభ్యత్వాన్ని అందజేస్తున్న రవీంద్ర, కొనకళ్ల

మంత్రి స్థానంలో ఉన్నా పార్టీకి కార్యకర్తనే అన్నారు. బందరు సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, పార్టీ సభ్యత్వంతో అంచెలంచెలుగా ఎదిగి ఎంపీగా, ఆర్టీసీ చైర్మన్‌గా అయ్యానన్నారు. పార్టీ సభ్యత్వంతో పాటు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై కార్యకర్తలు దృష్టి సారించాలన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గోతులమయమైన రోడ్లను కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, గొర్రెపాటి గోపీచంద్, కొల్లు నీలిమ, మోటమర్రి బాబాప్రసాద్, హసీంబేగ్, ఎండీ ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, కుంచే నాని, తలారి సోమశేఖర్, టీడీపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఆయన భార్య కొల్లు నీలిమ, గొర్రెపాటి శ్రీనివాస్‌చంద్, టీడీపీ రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షుడు హసీంబేగ్ రూ. లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు.


సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీ

బీఎస్ఎన్ఎల్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

గుణదల, నవంబరు 3 : వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడమే ప్రధాన ఎజెండా అని బీఎస్ఎన్ఎల్ యూనియన్ నూతన కమిటీ అధ్యక్షుడు టి.హేమచంద్ర కుమార్ తెలిపారు. సేవ బీఎస్ఎన్ఎల్ యూనియన్ అసోసియేషన్ నూతన కమిటీ మూడో సర్వసభ్య సమావేశం నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐటీఎస్ చీఫ్ జనరల్ మేనజర్ ఎం.శేషాచలం హాజరయ్యారు. సంస్థలో అంకితభావంతో పనిచేయడంతోపాటు వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ కృషి చేస్తుందని హేమచంద్రకుమార్ చెప్పారు. నూతన కమిటీలో కార్యదర్శిగా మద్దాల ప్రసాద్, ఆర్థిక కార్యదర్శిగా జి.వెంకట రమణయ్య మరికొంతమందిని ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎన్నుకున్నట్టు చెప్పారు. వీరి పదవీకాలం మూడేళ్లు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చిట్టి ప్రేమ్‌కుమార్, కరుణాకాంత్ కుమార్, పి.శ్రీనివాసరావు, బి.వీరేష్, సీహెచ్. కోటేశ్వరరావు, బి.సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితం పట్టని ప్రభుత్వాలు!

» విశ్రాంత ఐఏఎస్ జయప్రకాశ్ నారాయణ

లబ్బీపేట/హనుమాన్‌జంక్షన్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సంపద సృష్టించాల్సిన ప్రభుత్వాలు సమాజ ఉమ్మడి అవసరాలు పట్టించుకోకుండా ప్రజలను ఉచిత పథకాలపై ఆధారపడి బిచ్చగాళ్లుగా మారుస్తున్నాయని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ అన్నారు. కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెంజిసర్కిల్‌లోని అసోసియేషన్ హాలు నందు ఆదివారం లారీ ఓనర్స్ ఫౌండేషన్ వృద్ధులు, వితంతువులు, విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేసే కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, యువత నైపుణ్యాలను పెంపొందించుకుంటేనే ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుంటారన్నారు. దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాలలో లక్షా 80 వేలమంది వరకు మృతి చెందుతున్నారని, ఈ ప్రమాదాల వలన 10 లక్షల కోట్ల నష్టం వాటిల్లుతుందని, అదే విధంగా 3 శాతం జీడీపీ ఈ ప్రమాదాల పరిహారానికి తరలిపోతుందని అన్నారు. కామినేని పట్టాభిరామయ్య మాట్లాడుతూ, రవాణా రంగానికి జిల్లా లారీ యజమానుల సంఘం విస్తృత సేవలు అందిస్తుందన్నారు. లారీ ఓనర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు రావి గోపాలరావు, ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు, ఫౌండేషన్ ఉపాధ్యక్షులు శానంపూడి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జయప్రకాశ్ నారాయణ

సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి

వాహనరంగంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణను డ్రైవర్లకు ఇచ్చేలా మోడల్ డ్రైవింగ్ ఇనిస్టిట్యూట్‌ను నెలకొల్పి సేవలందించడం అభినందనీయమని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి జయప్రకాశ్‌నారాయణ అన్నారు. అంపాపురంలోని ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ మోడల్ డ్రైవింగ్ ఇనిస్టిట్యూట్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. భారీ వాహనాలతో పాటు కార్లను నడిపేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అధునాతన సిమ్యులేటర్లను ఆయన పరిశీలించారు. ఆరు వరసలతో కూడిన ట్రాక్, యంత్ర విడిభాగాల యూనిట్, డిజిటల్ తరగతి గదులు, మౌలికసదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధునాత పరికరాలతో కూడిన డ్రైవింగ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు జయప్రకాశ్ నారాయణను సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు, కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసి


హెవీ వెహికల్ శిక్షణ సిమ్యులేటర్‌ను పరిశీలిస్తున్న జయప్రకాశ్ నారాయణ

యేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా, ఉపాధ్యక్షులు కేవీఎస్ చలపతిరావు, కె.సత్యనారాయణరాజు, ప్రధాన కార్యదర్శి అల్లాడ వీర వెంకట సత్యనారాయణ, కార్యదర్శి రావి శరత్‌బాబు, కోశాధికారి పొట్లూరి చంద్రశేఖరరావు, చెన్నుపాటి వజీర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి నాటికి రోడ్ల గుంతలన్నీ పూడ్చేస్తాం

» నేటినుంచి కార్యక్రమం ప్రారంభం : మంత్రి రవీంద్ర



మచిలీపట్నం టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలోని రోడ్లన్నీ గుంతలమయమయ్యాయని, సంక్రాంతిలోగా రూ. 360 కోట్లతో గుంతలను పూడ్చే కార్యక్రమం పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టామన్నారు. మచిలీపట్నం అభివృద్ధికి రూ.30 కోట్లు ఉపాధి హామీ పనులకు నిధులు కేటాయించామని, రెండేళ్లలో సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. ప్రైవేట్, పబ్లిక్ పార్టనర్‌షిప్ కింద నగరంలోని కోనేరుసెంటర్ వంటి ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. 2025 నాటికి బందరు పోర్టు నిర్మాణం పూర్తయ్యేలా పనిచేస్తామన్నారు. ఏపీఎస్‌ఆర్‌టిసి రాష్ట్ర చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, వైసీపీ పాలకులు రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి వెళ్లారని, అయినప్పటికీ ఎక్కడా ఎవరికీ ఏ విధమైన ఇబ్బంది లేకుండా ఉద్యోగులకు జీతాలు, వృద్ధులు, వితంతువులకు పింఛన్లు ఇస్తున్నామన్నారు. వైసీపీ పాలనలో 15వ తేదీ నాటికి ఉద్యోగులకు జీతాలిచ్చేవారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, లంకే నారాయణ ప్రసాద్, ఇలియాస్ పాషా, పిప్పళ్ళ కాంతారావు, కాగిత వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

7లోగా డ్వాక్రా మహిళల డేటా పూర్తి చేయాలి

» మెప్మా డైరెక్టర్ నారాయణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న నారాయణ

గుడివాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మెప్మాలోని స్వయం సహాయక గ్రూపుల డేటా వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ఈ నెల 7వ తేదీ లోపు పూర్తి చేయాలని జిల్లా మెప్మా డైరెక్టర్ వెంకటనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక కైకాల సత్యనారాయణ పురపాలక కళామందిరంలో ఎస్‌హెచ్‌జి ప్రొఫైలింగ్ యాప్‌ను రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ తేజ్‌భరత్‌లు ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 5 మున్సిపాలిటీలకు సంబంధించిన డ్వాక్రా సంఘాలకు మెప్మా యాప్‌కు సంబంధించి శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యాప్‌ను తీసుకువచ్చిందన్నారు. ఆన్‌లైన్ ద్వారా ప్రతి డ్వాక్రా మహిళ వివరాలను పొందుపరచి, వ్యాపారాలు నిర్వహించేందుకు యాప్‌ను తీసుకురావడం జరిగిందన్నారు. ఈ నెల 7వ తేదీ లోపు మున్సిపాలిటీ పరిధిలోని స్వయం సహాయక గ్రూపుల సభ్యులు వివరాలను యాప్‌లో పొందుపరచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి.పి.ఎం.యు సిబ్బంది, మెప్మా సిబ్బంది, సి.ఎం.ఎంలు, సి.వోలు, ఆర్.పిలు, డి.ఇ.వోలు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి రాక

మచిలీపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుబాశ్ జిల్లాలో పర్యటించనున్నారు. సోమవారం ఉదయం 6 గంటలకు రామచంద్రాపురం నుంచి ఆయన బయలుదేరి 10.30 గంటలకు మచిలీపట్నం ఆర్‌అండ్‌బీ అతిథిగృహానికి చేరుకుంటారు. 11 గంటలకు నియోజకవర్గ టీడీపీ కార్యాలయం వద్ద జిల్లాకు చెందిన కూటమి నేతలతో సమావేశమవుతారు. 1.55గంటలకు జిల్లాపరిషత్ సమావేశపుహాలులో అధికారులతో జరిగే సమీక్షాసమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 4.15గంటలకు మచిలీపట్నం-కోన రహదారిపై శివగంగ గుడివద్ద గుంతలను పూడ్చే కార్యక్రమంలో పాల్గొంటారు. 4.30 గంటలకు రోడ్డుమార్గం ద్వారా తాడేపల్లిగూడెం బయలుదేరి వెళతారు.

కనపర్తి క్షమాపణ చెప్పాలి

» బడే శేషగిరిరావు

అవనిగడ్డ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తన కుమారుడు గౌతమ్‌పై అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసే క్రమంలో అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు అసభ్యంగా బూతులు తిట్టడంపై న్యాయవాది బడే శేషగిరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కనపర్తి శ్రీనివాసరావు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే ఆయనపై రూ.కోటి పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. అవసరమైతే భౌతికదాడులకు పాల్పడతామని కనపర్తి శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేస్తూ బెదిరింపులకు భయపడేదిలేదని ఆదివారం ఒక ప్రకటనలో బడే శేషగిరిరావు స్పష్టం చేశారు.

పిల్లలు దొరికారు

» 24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులకు ఎస్పీ అభినందన


మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ సుభాన్

మచిలీపట్నం టౌన్/నందివాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నాగులేరు చెరువు వద్ద గుడిసెల్లో నివసిస్తూ అదృశ్యమైన ముగ్గురు మైనర్ల ఆచూకీ తెలిసింది. గిరిజనులకు చెందిన పిల్లల ఆచూకీ కోసం ఎస్పీ ఆర్.గంగాధరరావు, జిల్లా కలెక్టర్ బాలాజీలు 30 బృందాలను నియమించారు. జిల్లాను జల్లెడ పట్టి పోలీసులు గాలించగా ముగ్గురు పిల్లలు తుమ్మా శ్రీనివాసరావు, తుమ్మా దుర్గారావు, తుమ్మా నాగేశ్వరరావు నందివాడలో దొరికారు. ఈ సందర్భంగా డీఎస్పీ అబ్దుల్ సుభాన్ మీడియాకు వివరాలు తెలిపారు. కాలేఖాన్‌పేటలో నాగులేటి ఒడ్డున గుడారాల్లో నివసిస్తున్న తుమ్మా రాఘవప్రసాద్‌కు చెందిన ముగ్గురు పిల్లలు అదృశ్యం కావడంతో రాఘవప్రసాద్ శనివారం ఇనకుదురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పిల్లలు స్కూల్‌కు వెళ్లి ఇంకా రాలేదని ముందుగా అనుకున్నారు. పిల్లలు స్కూల్‌కు వెళ్లలేదని తండ్రి రాఘవప్రసాద్ తెలుసుకుని దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. మచిలీపట్నంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న తుమ్మా రాఘవప్రసాద్ అవనిగడ్డకు బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇది తెలుసుకున్న పిల్లలు అవనిగడ్డ నడిచి వెళుతుండగా, అటుగా వెళుతున్న ఆటోడ్రైవర్ ముగ్గురు పిల్లలను అవనిగడ్డ తీసుకువెళ్లాడు. పిల్లలు బంధువుల ఇల్లు గుర్తుపట్టకపోవడంతో ఆటో డ్రైవర్ తమ స్వగ్రామమైన నందివాడ మండలం తమిరిశకు పిల్లలను తీసుకువెళ్లాడు. ఇనకుదురు సీఐ పరమేశ్వరరావు అవనిగడ్డ, నందివాడ పోలీసులు పిల్లల కోసం గాలించగా తమిరిశలో ఆటోడ్రైవర్ అయ్యప్ప ఇంట్లో ఉన్నట్టు తేలింది. దీంతో ఇనకుదురు, అవనిగడ్డ, నందివాడ పోలీసులు పిల్లలను ఆదివారం సాయంత్రం మచిలీపట్నం డీఎస్పీ కార్యాలయానికి తీసుకువచ్చారు. కేసును వేగంగా ఛేదించినందుకు ఎస్పీ గంగాధరరావు బృందాలను అభినందించారు. తల్లి ఇటీవల మృతిచెందడంతో తండ్రిని వెతుక్కుంటూ పిల్లలు అవనిగడ్డకు వెళ్లడం తెలిసి అందరి హృదయాలను కదిలించివేసింది.


ముగ్గురు పిల్లలతో తండ్రి రాఘవప్రసాద్

హంసలదీవిలో పర్యాటకుల సందడి

కోడూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కోడూరు మండల శివారు హంసలదీవి బీచ్‌లో పర్యాటకులతో సందడి వాతావరణం నెలకొంది. ఆదివారం సెలవు దినం కావటంతో వివిధ ప్రాంతాల నుంచి బీచ్ వద్దకు పర్యాటకులు కుటుంబసమేతంగా స్నానాలు ఆచరిస్తూ సరదాగా గడిపారు.




కెవివి సత్యనారాయణకు నియామక పత్రం అందజేస్తున్న కేశన శంకరరావు)

జనగణనతో పాటు బీసీ కులగణన చేయాలి

» చట్టసభల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలి

» చంద్రబాబు బీసీ రక్షణ చట్టం అమలు చేస్తాననడం ముదావహం

» కేశన శంకరరావు

మచిలీపట్నం టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జనగణనతో పాటు బీసీ కులాల గణన కూడా చేపట్టి బీసీలకు అన్ని రంగాల్లో రావాల్సిన రిజర్వేషన్ కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక హోటల్‌లో ఆదివారం జిల్లాస్థాయి బీసీ సంక్షేమ సంఘ నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో శంకరరావు మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. వైసీపీ పాలనలో బీసీల రిజర్వేషన్ సరిగా అమలు చేయకపోవడం వల్ల 16 వేల మంది బీసీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు రిజర్వేషన్లు పొందలేకపోయారన్నారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా కె.వి.వి. సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అందే జగదీష్‌ను నియమిస్తూ నియామక పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో పెడన నియోజకవర్గ బీసీ నాయకుడు బొర్రా కాశీవిశ్వేశ్వరరావు, వీరంకి శ్రీనివాసరావు, కాగిత వాసు, తుమ్మా కామేశ్వరి, మెతుకుమిల్లి దేవకి, రాజ్యలక్ష్మి, బేగం, సురేఖ, చెన్ను రంగారావు, రాగి చంద్రశేఖర్, కాగిత రవిబాబు, కాగిత సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.


వాహనాలను అడ్డుకున్న గ్రామస్థులు

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్థులు

మోపిదేవి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తవ్వి రవాణా చేసేందుకు వచ్చిన పొక్లెయినర్, ట్రాక్టర్లను ఆదివారం గ్రామస్థులు అడ్డగించిన సంఘటన మండలంలోని నాగాయితిప్ప శివారులో జరిగింది. కోసూరువారిపాలెం, నాగాయితిప్ప గ్రామాలకు పొలిమేర డొంకగా పిలువబడే ప్రదేశంలో కృష్ణానది నుంచి ఇసుక తరలించేందుకు అవనిగడ్డకు చెందిన ట్రాక్టర్లు, పొక్లెయినర్ చేరుకున్నాయి. విషయం తెలుసుకున్న గ్రామస్థులు హుటాహుటిన అక్కడికి వచ్చి నదిలోకి దిగిన ట్రాక్టర్లు, మిషన్‌ను కరకట్టపైకి తీసుకెళ్లాల్సిందిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఆర్‌జెడ్ పరిధిలో ఉన్న కృష్ణానది నుంచి ఇసుక తరలించేందుకు మీకు ఎవరు అనుమతులు ఇచ్చారో చూపాలని గ్రామస్థులు వాహనదారులను నిలదీశారు. పొరుగు ప్రాంతాలకు చెందిన వ్యక్తులు గ్రామంలో ఇసుక తరలించేందుకు రావటం ఏమిటని ప్రశ్నించారు. గ్రామస్థుల సమాచారంతో వీఆర్వో రమణ ఘటనాస్థలానికి చేరుకుని మోపిదేవి మండలంలో సిఆర్‌జెడ్ పరిధిలో ఉన్న నాగాయితిప్ప, కోసూరువారిపాలెం కృష్ణానది నుండి ఇసుక తరలించేందుకు ఏ విధమైన అనుమతులు లేనందున వెంటనే తిరిగి వెళ్లిపోవాలంటూ సూచించారు. కృష్ణానదిలో ఇసుక తవ్వేందుకు ప్రయత్నిస్తే ట్రాక్టర్లు, యంత్రాన్ని సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. దీంతో వారు వెనుతిరిగి వెళ్లిపోయారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 555

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్ : ఎమ్మెల్యే గద్దె

పటమట,నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పేదల ఆరోగ్యానికి అండగా ఉండాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదల వైద్యానికి నిధులు మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. తమిడి దుర్గాప్రసాద్‌కు రూ.2.25000లు, కాట్రగడ్డ దుర్గాదేవికి 2,17,200ల చెక్కును ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, బోడేపూడి నవీన్, గద్దె రమేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌సరఫరాకు అంతరాయం

లబ్బీపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల, మెయింటెనెన్స్ కారణంగా సోమవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు న్యూ బ్రిడ్జి సెక్షన్, న్యూ బ్రిడ్జి ఉప కేంద్రం, 11కేవీ టెలిఫోన్ ఎక్స్‌చేంజ్, ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు కార్య నిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. బెంజ్‌సర్కిల్ ప్రాంతంలో ఫకీరుగూడెం, ప్రగతినగర్, శ్రీరాంనగర్, చంద్రమౌళిపురం, ఎంజీ రోడ్డు, మైత్రేయవీధి, బీఎస్ఎన్ఎల్ హెచ్‌టీ పాయింట్ తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ తెలిపారు.


సత్కరిస్తున్న జీడీఏపీ ప్రతినిధులు

ఘనంగా వీడ్కోలు

ప్రభుత్వాసుపత్రి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్, జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా పదవీ బాధ్యతలు నిర్వహించి పదోన్నతిపై అడిషనల్ డీఎంఈగా బదిలీపై వెళుతున్న డాక్టర్ వెంకటేశ్వరరావుకు ప్రభుత్వ వైద్యుల సంఘం (జీడీఏపీ) ప్రతినిధులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాబ్జీశ్యామ్ కుమార్, డాక్టర్ రత్నబాబు, డాక్టర్ నూరుల్లా, డాక్టర్ దుర్గాకుమారి, డాక్టర్ సరళ, సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ పద్మావతి పాల్గొన్నారు.


వెటర్నరీ కాలనీలో


లయోలా గార్డెన్స్ 1వ రోడ్లో


3వ రోడ్డులో విరిగి పోయిన సూచిక బోర్డు


జయప్రకాష్ నగర్ కాలనీలో

మార్గం తెలిసేదెలా..

● అంతర్గత రోడ్లకు వెళ్లేదెలా.. ● సరిగ్గా కనిపించని సూచిక బోర్డులతో ఇబ్బందులు

నాల్గవ డివిజన్‌లోని అంతర్గత రోడ్ల వెంబడి ఉన్న అర్థం కాని, సరిగా కనిపించని సూచిక బోర్డులతో పాదచారులు , వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇతర ప్రాంతాలనుంచి వచ్చినవారు సమాచారం తెలియక అవస్థలు పడుతున్నారు

భారతీనగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నాల్గవ డివిజన్‌లోని అంతర్గతరోడ్ల వెంబడి ఉన్న అర్థం కాని, సరిగా కనిపించని సూచిక బోర్డులతో పాదచారులు, వాహనదారులు ఇ బ్బందులు పడుతున్నారు. కాలనీలో ఏర్పాటు చేసిన సమయంలో కొత్తవారికి సమాచారం తెలియజేయడానికి ప్రధా న, అంతర్గత రోడ్ల వెంబడి ఆ కాలనీ పేరుతో పాటు రోడ్డు పేరు, నెంబర్లు కూడిన సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ప్రసుత్తం వాటిని ఏర్పాటు చేసి ఏళ్లు గడిచిపోవడంతో ఎ ల్‌ఐసీ కాలనీ, లయోలా గార్డెన్స్, జయప్రకాష్ నగర్ కాలనీ తదితర కాలనీలో ఏర్పాటే చేసిన సూచిన బోర్డులు ధ్వంసం కావడంతో కొత్తవారిని గందరగోళానికి గురిచేస్తున్నాయి. నాల్గవ డివిజన్‌లో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు నివాసం ఉంటూన్నారు. అంతే కాకుండా వివిధ ప్రాంతాల్లో పలు ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థల ప్రధాన కార్యలయాలున్నాయి. వాటి కోసం నగరంతోపాటు ఇతర ప్రాంతాలనుంచి వచ్చిన వారు సమాచారం తెలియక అవస్థలు పడుతున్నారు ఇప్పటికైనా సదరు అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బీసీలకు 33శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

గుణదల, నవంబరు 3: బీసీలకు విద్య, చట్ట సభల్లో 33శాతం రిజర్వేషన్ అమలు జేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు ఇనుకొండ సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. సంచార జాతుల సమాఖ్య రౌండు టేబుల్ సమావేశం గుణదల్లోని నాయీ బ్రాహ్మణ భవనంలో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్రంలో జరపనున్న జనగణనలో కులగణనను బీసీ కులాల వారిగా సేకరణ చేయాలని తీర్మానం చేశారు. 33శాతం రిజర్వేషన్లు కూడా బీసీలను ఎంబీసీ సంచార జాతులుగా వర్గీకరించి అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన బద్వేలు గురుమూర్తి, కృష్ణమూర్తి, కుమార్, సత్యన్నారాయణ, కరుణాకర్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇనుకొండ సుబ్రహ్మణ్యం

ఊపిరితిత్తుల కేన్సర్ అవగాహన ర్యాలీ

ఆటోనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ వల్ల సంభవిస్తున్న మరణాల్లో 25 శాతం ఊపిరితిత్తుల క్యాన్సర్ వల్లే చనిపోతున్నారని, దీనికి ప్రధాన కారణం దూమ పానమని హెచ్‌సీజీ రేడియేషన్ అంకాలజీస్ట్ డాక్టర్ వీఎస్ఎన్ రావు అన్నారు. హెచ్‌సీజీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఊపిరితిత్తుల క్యాన్సర్ అవగాహన సైకిల్ ర్యాలీని బీఆర్‌టీఎస్ రోడ్డు నుంచి రామవరప్పాడు రింగ్ వరకు నిర్వహించారు. తొలుత సీజీఎస్టీ అండ్ కస్టమ్స్ కమిషనర్ ఎస్.నరసింహారెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు దూమ పానంతోపాటు కలుషిత వాతావరణం కూడా కారణమన్నారు. చెట్లను పెంచడం వల్ల కాలుష్యాన్ని నివారించవచ్చునన్నారు. ఆసుపత్రి సీవోవో టి. యువకిషోర్, ఫైనాన్స్ హెడ్ రవి కిరణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభించిన ఎస్. నరసింహా రెడ్డి

ఆత్మస్థైర్యానికి కరాటే వజ్రాయుధం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : కరాటేతో ఆత్మస్థైర్యానికి వజ్రాయుధమని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. జేకే గోజుర్యు కరాటే అకాడమీ ఆధ్వర్యంలో 23వ జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ చెన్నుపాటి రామకోటయ్య స్టేడియంలో ఆదివారం జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సుమారు 800 మందికి కరాటే క్రీ డాకారులు పోటీ పడగా, కటా విభాగంలో గ్రాండ్ చాంపియన్‌షిప్ బాలికల విభాగంలో తేజ శ్రీ, రన్నరప్‌గా భువనసాయి నిలిచారు. టోర్నీ నిర్వాహకులు జె.హరినాథ్, జె.శ్రీనివాస్, జె. దినేష్, కమిటీ సభ్యులు మధుసూదన్‌రావు, టీవీ సాయికుమార్, నరసింహారెడ్డి, హర్ష, శ్రీకర్ పాల్గొనారు.


జాతీయ కరాటే చాంపియన్‌షిప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

లాడ్జీలో మృతదేహం లభ్యం

ఆటోనగర్ : ఆటోనగర్‌లోని ఓ లాడ్జీలో మృతదేహాన్ని ఆదివారం గుర్తించినట్లు పటమట పోలీసుల తెలిపారు. ఆటోనగర్‌లోని చాంద్ హోటల్ ఎదురుగా ఉన్న వెంకటేశ్వరలాడ్జీలో ఆంజనేయులు అనే పేరుతో గది తీసుకున్నట్లు తెలిపారు. ప్రవేట్ కార్ డ్రైవర్‌గా పనిచేస్తానని లాడ్జీ సిబ్బందికి చెప్పాడన్నారు. మృతుడి వయసు సూమారు 60 సంవత్సరాలు ఉంటాయన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వి.పవన్ కిషోర్ తెలిపారు.


ఆవిష్కరిస్తున్న కవి ఖాదర్ మొహియుద్దీన్, అనిల్ తదితరులు

చారల పిల్లి కథ సంపుటి ఆవిష్కరణ

విజయవాడ కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కథా రచయిత వేంపల్లి షరీఫ్ రచించిన చారల పిల్లి కథల సంపుటి విజయవాడ బుక్ ఫెస్టివల్ అసోసియేషన్ హాలులో ఆదివారం కవి ఖాదర్ మొహియు ద్దీన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 90వ దశకంలో ముస్లిం కథాసాహిత్యం విస్తృతంగా మొదల య్యిందన్నారు. రెండు దశాబ్దాల కాలంలో షరీఫ్ ప్రాంతీయ జీవన అస్తిత్వంతో పాటు ముస్లిం సమాజపు జీవన చిత్రాన్ని కూడా కథలుగా మలుస్తూ వచ్చారన్నారు. సభకు అధ్యక్షత వహించిన కథారచయిత కాట్రగడ్డ మాట్లాడారు. ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక కన్వీనర్, కథా రచయిత్రి కె.ఎన్.మల్లీ శ్వరి కథలను విశ్లేషించారు. ఛాయాప్రచు రణల సంపాదకుడు, విమర్శకుడు అరుణాంక్ లత మాట్లాడుతూ కవి, విమర్శకుడు అనిల్ మాట్లాడుతూ అవసరమైన కాలంలో ఒక అవసరమైన కథా సృజనంగా చారల పిల్లి కథలను అంచనా వేయాలి. వేంపల్లి షరీఫ్ మాట్లాడుతూ కథకుడిగా చారల పిల్లి వరకు సాగిన తన ప్రయాణాన్ని తనకు తెలిసిన జీవితాలను పాత్రలను ఘటనలను కథలుగా మలుస్తున్నానని వాస్తవిక దృష్టితో కథలు రాస్తున్నానన్నారు. కార్యక్రమంలో దర్పణం శ్రీనివాస్, వి.సత్యవతి, నందూరి రాజగోపాల్, జాన్సన్ చోరగుడి, ఎస్.దాని, గోళ్ల నారాయణ రావు, విశ్వేశ్వరరావు తదితర సాహిత్యకారులు పాల్గొన్నారు.

న్యూ రాజరాజేశ్వరిపేటలో హోమియో వైద్యశిబిరం

అజిత్‌సింగ్‌నగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : ఎస్ఎస్‌టీ గ్లోబల్ వెల్ఫేర్, గాంధీజీ మహిళా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం న్యూ రాజరాజేశ్వరి పేటలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనం తరం రోగులకు హోమియో మందులను అందజేశారు. కార్యక్రమంలో ఎరుబోతు రమణారావు, కళాశాల యాజమాన్యం కాంతారావు, పిచ్చేశ్వరరావు, పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనే కూటమి లక్ష్యం

● మంత్రి కొలుసు పార్థసారథి

పటమట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాబోయే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి కొలుసు పార్థ సారథి అన్నారు. టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో టీడీపీ అధికార ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణ కార్యాలయం పటమటలో జరిగిన సభ్యత్వ నమోదులో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో సభ్యత్వాల నమోదులో కార్యకర్తలు, అభిమానులు చురుకుగా పాల్గొంటున్నారు. ప్రతీ రెండు సంవత్సరాలను ప్రజాస్వామ్యం పద్ధతిలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతుంటే.. విపక్ష నాయకుడు జగన్మోహనరెడ్డి వైసీపీకి తానే జీవిత కాలపు అధ్యక్షుడిగా తీర్మానం చేయించుకున్నాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ప్రతీ ఇంటిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉండాలన్నది చంద్రబాబు లక్ష్యమన్నారు. తన నియోజకవర్గంలో లక్షమందికి పైగా సభ్యత్వాలు నమోదు చేయాలని లక్ష్యంతో పెట్టుకున్నట్లు వివరించారు. రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ సామాన్య కార్యకర్తగా ఉన్న నాకు టీడీపీ మూడుసార్లు ఎంపీగా పోటీచేసే అవకాశం ఇచ్చిందన్నారు. ప్రస్తుతం ఆర్టీసీ చైర్మన్‌గా నియమించిందని, కష్టపడేవాళ్లకు టీడీపీ సముచితస్థానం ఇచ్చి గౌరవం ఇస్తుందనడానికి తానే ఉదాహరణ అన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా పనిచేయడం చాలా గర్వంగా ఉందన్నారు. పెద్ద ఎత్తున ప్రజలు సభ్యత్వ నమోదును చేసుకున్నారు. టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మోటేపల్లి సత్యనారాయణ, టీ డీపీ అధికార ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణ, ముమ్మనేని ప్రసాద్, కుందన సాయి, యోగా గురు దుర్గారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి పార్థ సారథి













కార్తీక సందడి



● భవానీ ద్వీపంలో పర్యాటకుల కోలాహలం ● వనసమారాధనకు కుటుంబ సమేతంగా వచ్చిన సందర్శకులు








కార్తీకమాసం ప్రవేశంతోనే తొలి ఆదివారం భవానీ ద్వీపం సందర్శకులతో సందడి వాతావరణం నెలకొంది. ఇటీవల వచ్చిన వరదలకు ద్వీపం తీవ్రంగా దెబ్బతిన్నా కార్తీకమాసం సందర్భంగా అశేషంగా వచ్చే సందర్శకులను దృష్టిలో పెట్టుకుని ఏపీటీడీసీ అధికారులు తమ శక్తి మేరకు ద్వీపాన్ని సగం మేర అందుబాటులోకి తెచ్చారు. కార్తీక మాసంలో వనభోజనాలు చేయాలన్న ఉద్దేశంతో సకుటుంబ సపరివార సమేతంగా ద్వీపానికి తరలి వచ్చారు. ముందుగా హరిత బెర్మ్‌పార్క్‌కు చేరుకున్న పర్యాటకులు అక్కడి బోటింగ్ యూనిట్‌లో టికెట్ తీసుకుని మెకనైజ్డ్ బోట్లపై ద్వీపానికి చేరుకున్నారు. అక్కడికి చేరుకున్న తర్వాత రమణీయమైన ప్రకృతిని ఆస్వాదించారు. ఇటీవల వరదల వల్ల సంభవించిన నష్టాలను పరిశీలించారు. ద్వీపంలో చైల్డ్ గేమ్స్ ఏరియాలో పిల్లలు, పెద్దలు కలిసి సందడి చేశారు. చాలా మంది పర్యాటకులు కృష్ణానదిలో స్పీడ్ బోటింగ్ చేశారు. భవానీ ద్వీపం అంతా కలియ తిరిగారు. చాన్నాళ్ల తర్వాత ద్వీపంలోని రెస్టారెంట్లు కళకళలాడుతూ కనిపించాయి. వనభోజనాలు చేసేవారికి ఏపీటీడీసీ అధికారులు ప్రత్యేకంగా భోజన ఏర్పాట్లు చేపట్టారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ



8 గంటలు.. కాల్వలోనే..!

● రైలు నుంచి దూకేసిన మహిళ
● ప్రాణాలతో కాపాడిన పోలీసులు



● మహిళ గుర్తింపు..



● కొబ్బరిమట్ట అందిస్తూ..



● దగ్గరికొచ్చాక చేయి అందిస్తూ..



● రెండు చేతుల్ని పట్టి పైకి లాగుతూ..

విజయవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పుట్టింటికి వెళ్తానని చెప్పి బయటకొచ్చిన మహిళ అక్కడికి వెళ్లలేదు. తెల్లారేసరికి కాల్వలో నానుతూ కనిపించింది. దాదాపు 8 గంటలపాటు నీళ్లలో నానుతున్న ఆ మహిళను పోలీసులు ప్రాణాలతో బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటన విజయవాడలో జరిగింది. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన షేక్ జిన్నిత్ ఉన్నీసా (41) భర్త ఖాదర్ వలీతో కలిసి నివసిస్తోంది. శనివారం రాత్రి తన ఇంటి నుంచి పుట్టింటికి వెళ్తానని వెళ్లి వస్తానని చెప్పింది. కానీ వెళ్లలేదు. తెనాలి రైల్వేస్టేషన్‌కు చేరుకుని విజయవాడకు వచ్చే రైలు ఎక్కింది. రైలు విజయవాడలోని పూలమార్కెట్ దాటి, పీఎన్‌బీఎస్ వద్దకు వస్తుండగా బందరు కాల్వలోకి దూకేసింది. తర్వాత కాల్వలో ఉండే చెత్తను పట్టుకుని నెమ్మదిగా ఒడ్డుకు చేరింది. మొక్కలను పట్టుకుని పైకి ఎక్కాలని భావించినా సాధ్యపడలేదు.

రాత్రంతా నీళ్లలో ఉండిపోయింది. రాత్రి 9 గంటల సమయంలోనే దూకేసిందని పోలీసులు చెబుతున్నారు. ఆదివారం ఉదయం స్థానికులు గమనించి పోలీసు కంట్రోల్ రూంకు ఫోన్ చేశారు. విధుల్లో ఉన్న కృష్ణలంక బ్లూకోట్స్ కానిస్టేబుల్ వీరంకి నాగేశ్వరరావు, హోంగార్డు అబ్దుల్ వజీర్ కంట్రోల్ రూం నుంచి సమాచారం అందుకుని ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఒడ్డుకు కొంతదూరాన ఉన్న ఆమెకు పక్కనే ఉన్న కొబ్బరాకు అందజేశారు. దాని ద్వారా ఉన్నీసాను నెమ్మదిగా ఒడ్డు వరకు లాక్కొచ్చారు. అనంతరం ఆమెను విచారించగా భర్త ఖాదర్ వలీ ఫోన్ నంబరు ఇచ్చింది. పోలీసులు వెంటనే అతడికి ఫోన్ చేశారు. తన భార్యకు మతిస్థిమితం లేదని అందుకే కాల్వలోకి దూకిందని వివరించాడు.

పోలీసులు ఆమెను చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. 8 గంటల పాటు నీళ్లలో ఉండడంతో శరీరమంతా పాచి పట్టింది. ప్రస్తుతం ఆమె ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. కేసును కృష్ణలంక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



పొన్నం ప్రభాకర్‌కు స్వాగతం పలుకుతు కాంగ్రెస్ నేతలు

తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఘనస్వాగతం

వన్‌టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడితో కలిసి నగరానికి విచ్చేసిన తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ నేతలు కొలనుకొండ శివాజీ గన్నవరం విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శివాజీ వారికి పార్టీ కండువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. శివాజీతో పాటు గిడుగు రుద్రరాజు, అల్లం రాజేశ్, నేతలు ఉన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో నేడు జాబ్‌మేళా

కృష్ణలంక, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ - సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు 5న మంగళవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్.శ్రీనివాసరావు ఆదివారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ముత్తూట్ ఫిన్‌కార్ప్, ఎస్‌బీఐ పేమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ముక్కు ఫైనాన్షియల్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని, ఎంపికైతే నెలకు సుమారు రూ.12 నుంచి రూ.35వేల వరకు ఇతర సౌకర్యాలతో కూడిన వేతనం ఇస్తారన్నారు. అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్టు వారు తెలిపారు. ఆసక్తి, అర్హతలు కలిగిన అభ్యర్థులు హెచ్‌టీటీపీఎస్://టిన్యూర్ల్.కామ్/జామ్‌మేళా-వీజేడీస్ట్ లింక్ నందు తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయి రెజ్యూమ్ లేదా బయోడేటాతో పాటు ఆధార్, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు రావాలని, వివరాలకు 9347779032 నంబరులో సంప్రదించాలన్నారు.

ట్విట్టర్‌లో సీఎంను దూషించిన వ్యక్తిపై ఫిర్యాదు

విద్యాధరపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ట్విట్టర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని అసభ్యకరంగా దూషించిన వ్యక్తిపై టీడీపీ నేత ఆదివారం భవానీపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గొల్లపూడి శ్రీనివాసనగర్‌లో నివాసముంటున్న ధరావత్ శ్రీను నాయక్ టీడీపీలో రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. శనివారం ఇతను సోషల్ మీడియాలోని ట్విటర్ చూస్తుండగా జస్టిస్ సికేరి ట్రూత్ అడ్వకేట్ ఎట్‌ది రేట్ ఆఫ్ విక్రాంత్‌స్టుల్ పేరుతో ఉన్న అకౌంట్ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును అసభ్యపదజాలంతో దుర్భాషలాడుతూ పోస్టు పెట్టాడు. దీనిపై స్పందించిన శ్రీను నాయక్ భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డిప్యూటీ సీఎంపై అసభ్యకర పోస్టు.. కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్: ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం కొణిదల పవన్‌కల్యాణ్‌పై అసభ్యకర పోస్టు పెట్టినట్టు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు అందింది. భార్గవ్ ఆర్ - ఎట్ ది రేట్ ఆఫ్ ద రామ్ పేరుతో ఇటీవల పవన్‌కల్యాణ్‌ను దూషిస్తూ ఎక్స్‌లో అసభ్యకరంగా తిడుతూ పోస్టు చేశారు. దీనిపై స్పందించిన 57వ డివిజన్ జనసేన నేత పైల ప్రకాష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్రప్రభుత్వ విధానాలను విద్యార్థులు వ్యతిరేకించాలి

● సీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ రామకృష్ణ

ధర్నాచౌక్, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సామ్రాజ్యవాద, కార్పొరేట్ శక్తుల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని (ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ పిలుపునిచ్చారు. సంఘం 50 ఏళ్ల పోరాటస్ఫూర్తి సభ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ విద్యాసాధన, దోపిడీ పీడనలేని సమాజం కోసం 50 ఏళ్లుగా రాజీలేని పోరాటాలను సంఘం కొనసాగిస్తోందన్నారు. మోదీ ప్రభుత్వం విద్యారంగాన్ని కాషాయీకరణ, కార్పొరేటీకరణ, కేంద్రీకరణ చేస్తుందని మండిపడ్డారు. 2020 నూతన జాతీయ విద్యా విధానం ద్వారా సైన్స్, చారిత్రక పాఠ్యాంశాలను తొలగించి అశాస్త్రీయ భావజాలాన్ని విద్యార్థుల మెదడల్లోకి చొప్పించాలనికి ప్రయత్నిస్తోందన్నారు. డీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వి.కృష్ణయ్య మాట్లాడుతూ విద్యారంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షోభంలోకి నెడుతున్నాయన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. తొలుత సంఘం జెండాను రాష్ట్ర ప్రధానకార్యదర్శి కిరణ్ కుమార్ అవిష్కరించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, హైకోర్టు అడ్వకేట్ అంకాళ్ల పృథ్వీరాజ్, పీడీఎస్‌యూ నేతలు గనిరాజు, భాను ప్రసాద్ పాల్గొన్నారు.



అవినాష్‌ను అభినందిస్తున్న వైసీపీ నాయకులు

ఓవరాక్షన్ చేస్తే పరిగెత్తిస్తాం

● మాజీ మంత్రి పేర్నినాని

పటమట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓవర్‌యాక్షన్ చేసేవాళ్లను ఎవరనీ వదిలిపెట్టేది లేదని, వారిని పరిగెత్తించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వైసీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్నినాని కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా దేవినేని అవినాష్ ప్రమాణ స్వీకారం బందరురోడ్డులో ఓ కల్యాణమండపంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రజలను మోసం చేశారని, వాళ్లు అధికారంలోకి వచ్చాక వైసీపీ శ్రేణులను ఎన్నో రకాలుగా ఇబ్బందులు పెట్టారని, అధికార మదంతో వైసీపీని అణగదొక్కాలని చూస్తున్నారని, సోషల్ మీడియాలో వైసీపీకి అనుకూలంగా పోస్టు పెడుతుంటే వారిని టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నా లేకపోయినా శత్రువులతో పోరాడే వైసీపీ కార్యకర్తలున్నారన్నారు. జనసేన కార్యకర్తల పరిస్థితి పగోడికి కూడా రాకూడదన్నారు. మూడు పార్టీలు కాదు 30 పార్టీలు కలిసి వచ్చినా ఏమీ అవ్వదని, అవినాష్ నాయకత్వాన్ని బలోపేతం చేయడానికి ముందుంటామన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన దేవినేని అవినాష్ మాట్లాడుతూ దేశంలో ఏ సీఎం చేయని విధంగా జగన్ పథకాలు అమలు చేశారన్నారు. టీడీపీ సోషల్ మీడియా అనుకూల మీడియా ప్రజలను తప్పుదారి పట్టించారన్నారు. 6 నెలల కూటమి పాలనలో డొల్లతనం బయటపడిందన్నారు. 2029లో జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేలా కష్టపడి పనిచేద్దామని పిలుపునిచ్చారు. వైసీపీ శ్రేణులెవరూ అధైర్యపడవద్దని, కార్యకర్తల జోలికొస్తే లీగల్‌గా ఎదుర్కొందామన్నారు. రాజ్యసభ సభ్యుడు అయోధ్యరామిరెడ్డి, వెల్లంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, స్వామిదాస్, తన్నీరు నాగేశ్వరరావు, సర్నాల తిరుపతిరావు, కడియాల బుచ్చిబాబు, డిప్యూటీ మేయర్లు, వైసీపీ కార్పొరేటర్లు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గంజాయితో నలుగురి అరెస్టు

చిట్టినగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిట్టినగర్ సాయిరాం థియేటర్ వెనుక నిర్మాణంలో ఉన్న భవనంలో గంజాయి సేవిస్తున్న నలుగురిని కొత్తపేట పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సాయిరాం సెంటర్‌కు చెందిన మంగళగిరి అజయ్ దుర్గాప్రసాద్, గన్నవరం కాసరపల్లి అంబేద్కనగర్‌కు చెందిన చేబ్రోలు ధనకోటేశ్వరరావు, కేసరపల్లి హరిజనవాడకు చెందిన జుజ్జవరపు రత్నభాస్కర్, కండ్రికకు చెందిన బొరిశెట్టి సింహాచలం కొత్తగా నిర్మాణమవుతున్న భవనంలో గంజాయిని తాగుతున్నారు. పక్కా సమాచారంతో కొత్తపేట పోలీసులు అక్కడికి వెళ్లి నలుగురిని అదుపులోకి తీసుకుని 3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

మతసామరస్యాన్ని కాపాడే నేత సీఎం చంద్రబాబు

● ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మతసామరస్యాన్ని కాపాడే నేతని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఆదివారం విద్యాధరపురం, కుమ్మరిపాలెం సెంటర్ సమీపంలోని ఈద్గా మైదానంలో ఆంధ్రప్రదేశ్ జమా అతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో వక్ఫ్ పరిరక్షణ మహాసభ జరిగింది. ఈ సభలో పాల్గొన్న చిన్ని మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు కూలంకషంగా అన్ని ముస్లిం సంఘాల నేతలతో మాట్లాడి తగిన నిర్ణయం తీసుకుంటారన్నారు. తెలుగుదేశం పార్టీ ఏరోజూ ముస్లిం సమాజ అభీష్టానికి వ్యతిరేకంగా పనిచేయదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముస్లిం సమాజాభివృద్ధికి, వక్ఫ్ ఆస్తులు కాపాడేందుకు నిరంతరం ఆలోచిస్తున్నారన్నారు. వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ ముస్లిం సంప్రదాయాలకు విరుద్ధంగా ఉన్న వక్ఫ్ సవరణ బిల్లును వైసీపీ వ్యతిరేకిస్తుందన్నారు. వైఎస్ జగన్ ఎల్లవేళలా ముస్లింలకు అండగా నిలుస్తారన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 75 ప్రకారం ఏ మంత్రి విభేదించినా తన మంత్రి పదవికి రాజీనామా చేసి బయటకు రావాల్సి ఉంటుందన్నారు. వక్ఫ్ సవరణలో 8 అంశాలను వైసీపీ వ్యతిరేకిస్తోందన్నారు. టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, శాసనమండలి మాజీ చైర్మన్ ఎండీ షరీఫ్, జమా అతే ఇస్లామీ హింద్ జాతీయ అధ్యక్షుడు సయ్యద్ సాదాతుల్లా హుస్సేనీ, జమా అతే ఇస్లామీ హింద్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు అబ్దుల్ రఫీ, ఇంకా పలువురు వక్తలు మాట్లాడారు. టీడీపీ మైనార్టీ సెల్ కార్యదర్శి ఎండీ ఫతావుల్లా, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంఎస్ బేగ్, నిర్వాహకులు, ముస్లిం ప్రధాన సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

ఇసుక మాఫియాకు డ్రోన్లతో చెక్

(5వ పేజీ తరువాయి)

ఇసుక గుట్టలను కనిపెడుతున్న డ్రోన్లు

పగటిపూట మాత్రం విజయవాడ నుంచి ప్రత్యేక బృందాలను అక్కడికి పంపుతున్నారు. వారి వెంట డ్రోన్లు వెళ్తున్నాయి. రీచ్‌లతోపాటు పరిసర ప్రాంతాల్లో డ్రోన్లు ఎగురవేసినప్పుడు ఎత్తయిన ఇసుక గుట్టలు కనిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులతో కలిసి వాటిని సీజ్ చేస్తున్నారు. ఇసుక రీచ్‌లకు వచ్చే వాహనాలను ఈ బృందాలు తనిఖీ చేస్తున్నాయి. జీపీఎస్ ఉన్న వాహనాలను మాత్రమే రీచ్‌ల్లోకి పంపుతున్నారు.

తుప్పల మాటున ఇసుక

ఇసుక మాఫియా రహస్యంగా ఉంచిన ఇసుకను పోలీసు డ్రోన్లు బయటకు రప్పిస్తున్నాయి. డ్రోన్లు ఎగుర వేసినప్పుడు కనిపించిన ఇసుక గుట్టలు రీచ్‌లకు దూరంగా, మారుమూల ప్రదేశాల్లో ఉన్నాయి. కొన్ని గుట్టలు ఎత్తుగా పెరిగిన తుప్పల వెనుక ఉన్నాయి. ఈ గుట్టలన్నీ అక్రమంగా ఏర్పాటు చేసినవేనని పోలీసులు గుర్తించారు. గ్రామాల్లో ఉన్న ప్రజలకు చైతన్యం తీసుకురావడానికి పోలీసులు ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఇసుక రీచ్‌ల్లోకి జీపీఎస్ వాహనాలు వెళ్లాలని స్పష్టం చేస్తున్నారు.

జిల్లా నుంచి ఇసుకతో ఏ వాహనం తెలంగాణ సరిహద్దులోకి ప్రవేశించినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తున్నారు. తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో ఉన్న వాహనదారులందరికీ ముందుస్తుగా నోటీసులు అందజేస్తున్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తున్నారు.

నేడు ప్రజా సమస్యలపై అర్జీల స్వీకరణ

కృష్ణలంక, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్టు ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ సిస్టమ్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్టు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. అలాగే డివిజన్, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ ఈ కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మీనా ఆ ప్రకటనలో కోరారు.



కట్లేరు డైవర్షన్ రహదారిపై వరద నీరు

కట్లేరు డైవర్షన్ రహదారిపై నిలిచిన రాకపోకలు

గంపలగూడెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత రాత్రి కురిసిన వర్షానికి ఎగువ నుంచి భారీ వరద రావడంతో తోటమూల - వినగడప రహదారిలో కట్లేరు డైవర్షన్ రహదారిపై వరద నీరు పొంగి పొర్లింది. దీంతో ఆదివారం సుమారు 20 గ్రామాల రాకపోకలు నిలిచిపోయాయి.

రూ.6 వేల కోట్ల రికవరీ లక్ష్యం

కెనరా బ్యాంక్ సీఈఓ సత్యనారాయణ రాజు



న్యూఢిల్లీ: వర్తమాన ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో రూ.6,000 కోట్ల మొండి బకాయిల వసూలు తమ లక్ష్యమని కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ సత్యనారాయణ రాజు తెలిపారు. మూడు, నాలుగు త్రైమాసికాల్లో ఇంచుమించుగా సమానంగా రూ.3,000 వంతున వసూలు చేయగలమని భావిస్తున్నట్టు ఆయన చెప్పారు. మాఫీ చేసిన బాకీల రికవరీ సహా మొత్తం రూ.2,905 కోట్లు క్యూ2లో వసూలు చేయగలిగామని ఆయన వెల్లడించారు. రికవరీలతో పోల్చితే ఎన్‌పీఏలుగా మారేందుకు అవకాశం ఉన్న రుణాల పరిమాణం తక్కువగానే ఉన్నట్టు చెప్పారు. కెనరా రొబెకో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ పబ్లిక్ ఇష్యూ నాలుగో త్రైమాసికంలో ఉండవచ్చునని ఆయన తెలిపారు. త్వరలోనే దీనికి ఆర్థిక మంత్రిత్వ శాఖ అనుమతి లభిస్తుందని భావిస్తున్నామన్నారు. బీమా విభాగంలో 51 శాతం వాటాలున్న కెనరాబ్యాంక్ ఈ ఇష్యూ ద్వారా 13 శాతం వాటా విక్రయించాలని భావిస్తోంది.

యూఎస్ నుంచి రెడ్డీస్ ఔషధం రీకాల్

న్యూఢిల్లీ: రక్తంలో అధిక కాల్షియం స్థాయిల అదుపు, హైపర్ పారాథైరాయిడిజమ్ చికిత్సలో ఉపయోగించే సినాకాల్సెట్ టాబ్లెట్లను అమెరికన్ మార్కెట్ నుంచి రీకాల్ చేస్తున్నట్టు డాక్టర్ రెడ్డీస్ ప్రకటించింది. తయారీలో లోపాలున్నాయంటూ అమెరికన్ ఎఫ్‌డీఏ నివేదికను ఆధారం చేసుకుని ఈ టాబ్లెట్లున్న 3,31,590 బాటిల్స్‌ను ఉపసంహరిస్తున్నట్టు పేర్కొంది. రెడ్డీస్ లేబరేటరీస్ న్యూ జెర్సీ అనుబంధ విభాగం రీకాల్ చేస్తున్న వాటిలో 30 ఎంజి పరిమాణం గల 2,85,126 బాటిల్స్ ఉన్నాయి. మిగతా బాటిల్స్ 60 ఎంజి, 90 ఎంజి డోసేజిలలోనివని కంపెనీ పేర్కొంది.

ఎఫ్ఎంసీజీ వస్తువుల ధరలు సుర్రు?



ద్రవ్యోల్బణం సెగ, పట్టణ మార్కెట్లు నిస్తేజం
తగ్గిన మార్జిన్లతో కంపెనీలు అతలాకుతలం

న్యూఢిల్లీ: వేగంగా అమ్ముడయ్యే వినియోగ వస్తువుల (ఎఫ్ఎంసీజీ) మార్కెట్ నీరసిస్తోంది. మొత్తం విక్రయాల్లో 65-68 శాతం వాటా ఉండే పట్టణ ప్రాంతాల్లో అమ్మకాలు సెప్టెంబరు త్రైమాసికంలో డీలా పడ్డాయి. మరోవైపు ఆహార వస్తువుల విభాగంలో ద్రవ్యోల్బణం సెగలు కక్కుతోంది. పామాయిల్, కాఫీ, కోకో వంటి ప్రధాన ముడి పదార్థాల ధరలు కొండెక్కాయి. దీంతో రెండో త్రైమాసికంలో హెచ్‌యూఎల్, గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (జీసీపీఎల్), మారికో, ఐటీసీ, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (టీసీపీఎల్) వంటి ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీలన్నీ డీలా పడ్డాయి. కొన్ని ఎఫ్ఎంసీజీ కంపెనీల లాభాలకూ గండి పడింది. ఈ పరిస్థితి నుంచి కొద్దిగానైనా కోలుకునేందుకు స్వల్ప స్థాయిలోనైనా ధరలు పెంచే అవకాశం ఉందని కంపెనీలు సూచనప్రాయంగా తెలియజేస్తున్నాయి. 'మేము దీన్ని స్వల్పకాలిక ప్రతికూలతగా భావిస్తున్నాం. ధరలు స్థిరీకరించడం, స్వల్ప స్థాయిలో ధరలు పెంచడం ద్వారా ఈ పరిస్థితి నుంచి బయటపడవచ్చని భావిస్తున్నాం' అని జీసీపీఎల్ ఎండీ, సీఈఓ సుధీర్ సీతాపతి ఇటీవల కంపెనీ క్యూ2 ఆర్థిక ఫలితాలు వెల్లడిస్తూ చెప్పారు.

గ్రామీణ డిమాండూ అంతంతే : ప్రస్తుతం పట్టణ ప్రాంత డిమాండ్‌తో పోలిస్తే గ్రామీణ డిమాండ్ కొద్దిగా మెరుగ్గానే ఉంది. అయితే ఇది కూడా ఆశించిన స్థాయిలో మాత్రం లేదు. ప్రాంతం ఏదైనా ప్రస్తుతం ప్రీమియం/ఈ-కామర్స్ ఉత్పత్తులు జోరుగా అమ్ముడవుతున్నాయి. అధిక వాటా గల మాస్ ఉత్పత్తుల అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉన్నట్టు ఎఫ్ఎంసీజీ కంపెనీల ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఆహార ద్రవ్యోల్బణం, పట్టణ ప్రాంత డిమాండ్ పడకేయడం క్యూ2లో తాము ఎదుర్కొన్న పెద్ద సవాల్ అని డాబర్ ఇండియా తెలిపింది. దీంతో డాబర్ కంపెనీకి చెందిన చవన్‌ప్రాశ్, పుదీనాహర, రియల్ జ్యూస్ అమ్మకాలు క్యూ2లో 17.65 శాతం పడిపోయాయి. మరో ఎఫ్ఎంసీజీ దిగ్గజం నెస్లే ఇండియాదీ ఇదే పరిస్థితి. క్యూ2లో ఈ కంపెనీకి చెందిన ఆహార, పానీయాల విభాగం అమ్మకాల వృద్ధిరేటు సింగిల్ డిజిట్‌కు పడిపోయినట్టు కంపెనీ సీఎండీ సురేశ్ నారాయణన్ చెప్పారు. ముడి పదార్థాల ధరల పెరుగుదల, పట్టణ ప్రాంత డిమాండ్ పడకయేయడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో ఎడతెగని వర్షాలు కూడా సెప్టెంబరు త్రైమాసికంలో ఎఫ్ఎంసీజీ కంపెనీల అమ్మకాలను దెబ్బతీశాయి.

సిమెంట్‌దీ అదే పరిస్థితి: సిమెంట్ కంపెనీల పరిస్థితి కూడా ఏమంత మెరుగ్గా లేదు. ధరలు తక్కువగా ఉండడం, అమ్మకాలు పడిపోడం ఇందుకు ప్రధాన కారణం. దీంతో క్యూ2లో కంపెనీల అమ్మకాలు, లాభాలకూ గండి పడింది. అల్ట్రాటెక్, అంబుజా సిమెంట్ కంపెనీల అమ్మకాలు మాత్రమే కొద్దిగా పెరిగాయి. ఇది కూడా వేరే కంపెనీల కొనుగోళ్ల పుణ్యమే తప్ప, మరోటి కాదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. నైరుతీ రుతుపవనాలతో ఎక్కువ రోజులు వర్షాలు కొనసాగడం, దేశంలోని కొన్ని ప్రాంతాలను వరదలు ముంచెత్తడం, ప్రభుత్వ శాఖల నుంచి డిమాండ్ పెరుగుదలతో మందకొడితనం ఇందుకు ప్రధాన కారణం. ఇదే సమయంలో విద్యుత్, ఇంధన, ఇతర ఖర్చులు పెరిగిపోవడం సిమెంట్ కంపెనీలను మరింత కుంగదీసింది. ఈ ఏడాది జూన్‌లో రూ.348 వరకు ఉన్న 50 కిలోల బస్తా సిమెంట్ ధర సెప్టెంబరులో రూ.330కి పడిపోయింది. గత ఏడాదితో పోలిస్తే ఇది రూ.35 నుంచి రూ.45 తక్కువ. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కేందుకు కొన్ని కంపెనీలు గత నెల మొదటి వారంలో ధరలు కొద్దిగా పెంచాయి. అయితే కొన్ని కంపెనీలు కలిసి రాకపోవడంతో ఆ ప్రయత్నం పెద్దగా విజయవంతం కాలేదు. ధరలతో పాటు అమ్మకాలు కూడా తగ్గడంతో కంపెనీల ఉత్పత్తి సామర్థ్య వినియోగమూ పడిపోయింది.

నవంబరులోనూ పండగ ఆఫర్లు : మారుతీ

నవంబరు నెలలో కూడా తమ కార్లపై పండగల ఆఫర్లు కొనసాగుతాయని మారుతీ సుజుకీ ఇండియా లిమిటెడ్ తెలిపింది. ఈ నెల దేశ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో పెళ్లిళ్లుండడంతో కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. పండగల సీజన్ కలిసి రావడంతో గత నెల కంపెనీ రికార్డు స్థాయిలో 2,02,402 వాహనాలు విక్రయించింది. ఈ నెల పెద్ద ఎత్తున జరిగే పెళ్లిళ్ల భారీ అమ్మకాలకు దోహదం చేస్తాయని భావిస్తున్నట్టు కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ చెప్పారు. అయితే ఈ పెళ్లిళ్ల సీజన్ ఆఫర్లు ప్రాంతాన్ని బట్టి మారతాయని తెలిపారు.

24500 పైన బుల్లిష్

(నవంబరు 4-8 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ వ్యూ

గత వారం నిఫ్టీ : 24205 (+24)

నిఫ్టీ గత వారం 24498-24173 పాయింట్ల మధ్యన కదలాడి 24 పాయింట్ల లాభంతో 24205 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24500 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24325, 24330, 24567, 24972 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా దిగువకు రావడం దీర్ఘకాలిక బేరిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 24600 బ్రేక్‌డౌన్ స్థాయి: 23800

నిరోధ స్థాయిలు: 24400, 24500, 24600 (24300 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు : 24000, 23900, 23800 (24100 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	555
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	128	విజయవాడ	125
వరంగల్	128	గుంటూరు	126
కరీంనగర్	128	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	128	చిత్తూరు	115
కర్నూలు	128	నెల్లూరు	115
విశాఖపట్నం	111	అనంతపురం	115
గోదావరి	125		

అప్రమత్తంగా ఉండడమే బెటర్

స్టాక్ మార్కెట్ ఈ వారం మిశ్రమంగా ట్రేడ్ కావచ్చు. అమెరికా అధ్యక్ష ఎన్నికలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా ఉండడమే మంచిది. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాలకు చెందిన కొన్ని కంపెనీల షేర్లు, ప్రస్తుతం ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుత ధరల్లో మదుపరులు ఈ షేర్లను కొనుగోలు చేయడం ప్రారంభించవచ్చు. ఐటీ, ఫార్మా రంగాలకు చెందిన కొన్ని ప్రముఖ కంపెనీల షేర్లు కూడా ప్రస్తుతం ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. అయితే మిడ్ క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్ల కొనుగోళ్లలో మాత్రం జాగ్రత్తలు పాటించక తప్పదు.

ఈ వారం స్టాక్ రికమండేషన్లు...

ఐషర్ మోటార్స్: సుదీర్ఘకాలంగా అప్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కంపెనీ షేర్లు, గత ఆరు నెలలుగా కన్సాలిడేట్ అవుతున్నాయి. ఈపీఎస్, సేల్స్ మెరుగ్గా ఉండడంతో నిఫ్టీతో పోలిస్తే మంచి జోరు మీద ఉన్నాయి. కీలక మద్దతు స్థాయి రూ.4,500 వద్ద మళ్లీ పుంజుకున్నాయి. గత శుక్రవారం రూ.4,593 వద్ద ముగిశాయి. మదుపరులు రూ.4,970/5,050 టార్గెట్ ధరతో రూ.4,900 వద్ద ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.4,860.

ఐఆర్ఎఫ్‌సీ: జూలైలో జీవిత కాల గరిష్ఠ స్థాయికి చేరిన ఈ షేర్లు ఇప్పటికే 42 శాతం దిద్దుబాటుకు లోనయ్యాయి. రూ.133 వద్ద కీలక మద్దతుతో అప్‌ట్రెండ్ బాట పట్టి గత వారం రూ.158 వద్ద ముగిశాయి. రూ.162/168 స్వల్పకాలిక టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్లో రూ.157 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.155

బ్యాంక్ ఆఫ్ బరోడా: తాజా త్రైమాసిక ఆర్థిక ఫలితాలు బాగుండడంతో బీఓబీ షేర్లపై మళ్లీ ఆసక్తి పెరిగింది. జీవిత కాల గరిష్ఠ స్థాయి నుంచి 20 శాతం దిద్దుబాటు జరిగాక రూ.230 స్థాయిలో స్థిరమైన కన్సాలిడేషన్ కనిపిస్తోంది. గత వారం రూ.230 వద్ద ముగిసిన ఈ షేర్లను మదుపరులు రూ.275 టార్గెట్‌తో రూ.250 వద్ద కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ : రూ.245.

మోతీలాల్ ఓస్వాల్: ప్రస్తుతం ఈ కంపెనీ షేర్లు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ప్రతి త్రైమాసికంలో మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించడం, పెరుగుతున్న అమ్మకాలు, ఈపీఎస్ కంపెనీకి కలిసి వచ్చే ప్రధాన సానుకూలాంశాలు. బెంచ్‌మార్క్ సూచీలు నష్టాల్లో ఉన్నా మోతీలాల్ ఓస్వాల్ కంపెనీ షేర్లు ఇప్పటికీ మంచి లాభాలతో ట్రేడవుతున్నాయి. గత వారం రూ.970 వద్ద ముగిసిన ఈ షేర్లను ఇన్వెస్టర్లు రూ.995 టార్గెట్‌తో రూ.975 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.970.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

24500 పైన నిలదొక్కుకోవాలి

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో 24000 పైన రికవరీ సాధించి 24500 వరకు వెళ్లింది. కాని ఆ స్థాయిలో నిలదొక్కుకోలేక కరెక్షన్‌లో పడి చివరికి 24300 వద్ద ముగిసింది. గత వారం పరిమిత పరిధిలోనే కదలాడుతూ వారం మొత్తం మీద అనిశ్చిత ట్రెండ్‌లో క్లోజయింది. టెక్నికల్‌గా మార్కెట్ ఇప్పటికీ డౌన్‌ట్రెండ్‌లోనే ఉంది. గత వారం మిడ్‌క్యాప్-100 ఇండెక్స్ 1200 పాయింట్ల మేరకు లాభపడింది. అయితే అక్టోబరు నెల మొత్తం మీద 4000 పాయింట్లు నష్టపోయింది. స్మాల్‌క్యాప్-100 ఇండెక్స్ కూడా పునరుజ్జీవం సాధించి 950 పాయింట్ల మేరకు లాభపడింది. నిఫ్టీ ఇప్పటికీ ప్రధాన మానసిక అవధి 24000 వద్ద అప్రమత్త ధోరణిలో నిలిచి ఉంది. శుక్రవారం అమెరికన్ మార్కెట్ల కదలికల ఆధారంగా నిఫ్టీ ఈ వారంలో నెగెటివ్‌గానే ప్రారంభమై మద్దతు స్థాయిల వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ట్రెండ్‌లో ప్రారంభమైతే ఎగువన 24420 వద్ద మైనర్ నిరోధం, 24500 వద్ద ప్రధాన నిరోధం ఉన్నాయి. గత వారం ఏర్పడిన గరిష్ఠ స్థాయి 24500 వద్దనే సూచీ నిలదొక్కుకోలేక కరెక్షన్‌లో పడింది. ఆ పైన నిలదొక్కుకున్నప్పుడే స్వల్పకాలిక అప్‌ట్రెండ్ ఏర్పడుతుంది.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 24150 వద్ద విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 24000. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనత కొనసాగుతున్నట్టుగా భావించి స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తం కావాలి.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా గత వారం 900 పాయింట్ల మేరకు రికవరీ సాధించినా వారం మధ్య స్థాయిలో 51670 వద్ద అనిశ్చితంగా క్లోజయింది. మరింత సానుకూలత కోసం ప్రధాన నిరోధం 52000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన మద్దతు స్థాయి 51000. ఇక్కడ విఫలమైతే స్వల్పకాలిక బలహీనత తప్పదు.

పాటర్న్: నిఫ్టీ 100 డీఎంఏ 24500 వద్ద నిరోధం ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం ఆ పైన నిలదొక్కుకోవాలి. ప్రస్తుతం ఇదే స్థాయిలో "అడ్డంగా ఏర్పడిన రేఖ" కన్నా స్వల్పంగా దిగువన ఉంది. సానుకూలత కోసం దాన్ని బ్రేక్ చేయాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,420, 24,500
మద్దతు	24,220, 24,150

నవ్య | చిత్రజ్యోతి

ఇతర భాషా చిత్రాలను తొక్కేస్తున్న బాలీవుడ్

తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్



ఉత్తరాదిన హిందీ చిత్రాలు మాత్రమే రాజ్యమేలుతున్నాయని, బాలీవుడ్‌లో కేవలం హిందీ చిత్రాలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారని, ఇతర భాషలైన మరాఠీ, బిహారీ, భోజ్‌పురి, హర్యానా, గుజరాత్ తదితర ఉత్తరాది సినిమాలను తొక్కేస్తున్నారని తమిళనాడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, హీరో ఉదయనిధి స్టాలిన్ ఆరోపించారు. ఉత్తరాదిలో కొన్ని రాష్ట్రాలకు సొంతంగా చిత్రపరిశ్రమలే లేవని, బాలీవుడ్ అంటే ఒక్క హిందీ చిత్రాలకే పరిమితమైందని ఆయన పేర్కొన్నారు. కానీ, దక్షిణాదిలో తమిళంతో పాటు తెలుగు, కన్నడం, మలయాళ భాషల చిత్రపరిశ్రమలు పోటీపడుతూ వృద్ధి చెందుతున్నాయన్నారు. కేరళ రాష్ట్రంలోని కోళికోడ్‌లో ఓ మలయాళ పత్రిక ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఈ వ్యాఖ్యలు చేశారు. దక్షిణాదిలో తమిళ చిత్రపరిశ్రమతో పాటు తెలుగు, మలయాళ, కన్నడ పరిశ్రమలు కోట్లాది రూపాయల వ్యాపారం చేస్తున్నాయన్నారు. కానీ, దక్షిణాది తరహాలో ఉత్తర భారతదేశంలో హిందీ కాకుండా మరే ఇతర భాష అయినా శక్తిమంతమైన చిత్రపరిశ్రమను కలిగివుందా? అని ప్రశ్నించారు. ఉత్తరాది రాష్ట్రాల్లో మాట్లాడే దాదాపు అన్ని భాషలు హిందీకి దూరమయ్యాయి అని చెప్పారు.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)

భారీ బందోబస్తుతో సల్మాన్‌ఖాన్ షూటింగ్



సల్మాన్‌ఖాన్ కథానాయకుడిగా ఏ. ఆర్ మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్న 'సికందర్' చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. దర్శకుడు మురుగదాస్, కథానాయిక రష్మిక మందన్నతో కలసి ఆదివారం సల్మాన్‌ఖాన్ హైదరాబాద్‌లో అడుగుపెట్టారు. ఈ నెల 7వ తేదీ వరకూ సల్మాన్‌ఖాన్ చిత్రీకరణలో పాల్గొంటారు. ఈ షెడ్యూల్‌లో సల్మాన్, రష్మికపై ఓ పాటతో పాటు కొంత టాకీపార్ట్‌ను చిత్రీకరించనున్నారు. సల్మాన్‌ఖాన్‌ను చంపుతామంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ హెచ్చరించిన నేపథ్యంలో భారీ బందోబస్తు మధ్య ఆయన చిత్రీకరణలో పాల్గొంటున్నారు. సినిమా యూనిట్‌ను తప్ప షూటింగ్ పరిసర ప్రాంతాల్లోకి ఎవరినీ పోలీసులు అనుమతించడం లేదు. కాజల్ అగర్వాల్, సత్యరాజ్, ప్రతీక్ బబ్బర్ కీలకపాత్ర పోషిస్తున్న ఈ చిత్రాన్ని సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఈద్ సందర్భంగా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



తెలుగువారితో అనుబంధం ఏర్పడింది

దుల్కర్ సల్మాన్



'మహానటి', 'సీతారామం' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత దుల్కర్ సల్మాన్ తెలుగులో నటించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించగా సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. మీనాక్షి చౌదరి కథానాయిక. అక్టోబరు 31న విడుదలైన ఈ చిత్రం ఘన విజయాన్ని సాధించిన నేపథ్యంలో విజయోత్సవ సభను చిత్రబృందం ఆదివారం నిర్వహించింది. ఈ సందర్భంగా దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ 'తెలుగు ప్రేక్షకులు నన్ను ఎంతో ఆదరిస్తున్నారు. ఇక్కడి వారితో నాకు మంచి అనుబంధం ఏర్పడింది. నాగ్, స్వప్న 'మహానటి' కోసం నన్ను సంప్రదించినప్పుడు నాకు తెలుగు రాదు అన్నాను. కానీ నన్ను తీసుకొచ్చి ఈ రోజు ఇలా నిలబెట్టారు. ఆ తర్వాత హను రాఘవపూడి 'సీతారామం'తో ఎప్పటికీ గుర్తుండిపోయే చిత్రాన్ని అందించారు. ఇప్పుడు వెంకీ అట్లూరి 'లక్కీ భాస్కర్' చిత్రంలోని పాత్రలకు ప్రాణం పోశారు' అని అన్నారు. హీరోయిన్ మీనాక్షి చౌదరి మాట్లాడుతూ ' ఈ సినిమాలో భాగం కావడం గౌరవంగా భావిస్తున్నాను. టీమ్ అందరం ఎంతో కష్టపడి పనిచేశాం. ఆ కష్టానికి తగ్గ ఫలితంగా ప్రేక్షకుల నుంచి లభిస్తున్న స్పందన చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది' అన్నారు. వెంకీ అట్లూరి మాట్లాడుతూ "ఏబీసీడీ' సినిమా చూసినప్పటి నుంచి దుల్కర్‌తో పని చేయాలనుకున్నాను. ఇప్పుడు 'లక్కీ భాస్కర్'తో కుదిరింది. కథ విన్న వెంటనే ఏ మాత్రం ఆలోచించకుండా సినిమా చేయడానికి దుల్కర్ అంగీకరించారు. ఒక మంచి సినిమా చూసిన ఫీలింగ్ మనతో లైఫ్ లాంగ్ ఉంటుంది. అందుకే ఒకేసారి మూడు మంచి సినిమాలు వచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తున్నారు' అని అన్నారు.

రిలీజ్ డేట్ ఫిక్స్



లక్ష్మీ రాయ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. తమిళంలో ఘన విజయం సాధించిన ఈ చిత్రం ఈనెల 22న తెలుగులో విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా నిర్మాత ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ 'లక్ష్మీరాయ్ త్రిపాత్రాభినయం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ. ఫైట్ మాస్టర్ థ్రిల్లర్ మంజు కంపోజ్ చేసిన ఎనిమిది ఫైట్లు హైలెట్‌గా నిలుస్తాయి. లక్ష్మీ రాయ్ చేసిన మూడు క్యారెక్టర్స్ డిఫరెంట్ షేడ్స్‌లో ఉంటాయి' అని అన్నారు. నటి అక్షఖాన్ మాట్లాడుతూ 'గతంలో లేడీ ఓరియెంటెడ్ చిత్రాలు ఎన్నో వచ్చాయి. కాని లక్ష్మీరాయ్ నటించిన ఈ చిత్రానికి ప్రత్యేకత ఉంది' అని చెప్పారు. నటుడు జె.వి.ఆర్ మాట్లాడుతూ 'మంచి పబ్లిసిటీతో, అత్యధిక థియేటర్లలో రిలీజ్ అవుతున్న ఈ చిత్రం ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

వినోదం గ్యారంటీ

డైరెక్టర్ సాయికిషోర్



చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో, హీరోయిన్లుగా సాయికిషోర్ మచ్చా దర్శకత్వంలో నటించిన చిత్రం 'ధూం ధాం'. ఎం.ఎస్.రామ్‌కుమార్ నిర్మాత. ఈనెల 8న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ సాయి కిషోర్ మాట్లాడుతూ 'రచయిత గోపీ మోహన్ 'ధూం ధాం' ప్రాజెక్ట్ గురించి చెప్పారు. కథ నాకు బాగా కనెక్ట్ అయ్యింది. అలా ఈ సినిమా మొదలైంది. మొత్తం షూటింగ్ అమెరికాలో చేయాలని అనుకున్నాం. అనుమతుల కోసం ఆరు నెలలు ప్రయత్నించినా కుదరలేదు. ఆ తర్వాత యూరప్‌లోని పోలెండ్‌ను సెలెక్ట్ చేసుకున్నాం. నిర్మాత రామ్‌కుమార్, ఆయన మంచితనం గురించి, సినిమా మీద ఆయనకున్న ప్యాషన్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ సినిమాలో తండ్రీ కొడుకుల మధ్య ఉన్న అనుబంధం చుట్టూ కథ సాగుతుంది. దాంతోపాటు మంచి ప్రేమ కథ కూడా ఉంటుంది. సినిమా సరదాగా మొదలై ఇంటర్వెల్ దాకా మంచి సాంగ్స్, లవ్ ట్రాక్‌తో ప్లెజెంట్‌గా వెళ్తుంది. చేతన్ మంచి టాలెంటెడ్ హీరో. అతనిలో మంచి టైమింగ్ ఉంది. హెబ్బా పటేల్ కూడా తన క్యారెక్టర్‌లో ఆకట్టుకునేలా నటించారు. ఈ మధ్య మనం థ్రిల్లర్, పీడియారిక్, స్కామ్ మూవీస్ చూస్తున్నాం. వాటిలో కామెడీ మిస్ అయ్యాం. ఆ విస్ అయిన ఎంటర్‌టైన్‌మెంట్ 'ధూం ధాం'లో చూస్తారు' అని తెలిపారు.

కొత్తగా..

నార్నే నితిన్ నిశ్చితార్థం

జూనియర్ ఎన్టీఆర్ బావమరిది, టాలీవుడ్ యువ కథానాయకుడు నార్నే నితిన్ ఓ ఇంటివాడవ్వబోతున్నారు. తాళ్లూరి వెంకటకృష్ణ ప్రసాద్- స్వరూప దంపతుల కుమార్తె శివానిని నితిన్ పెళ్లాడనున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగిన నిశ్చితార్థ కార్యక్రమంలో పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు.



ఈ వేడుకలో జూనియర్ ఎన్టీఆర్, ఆయన శ్రీమతి లక్ష్మీప్రణతి, కుమారులు అభయ్, భార్గవ్ ప్రత్యేకాకర్షణగా నిలిచారు. కల్యాణ్‌రామ్, వెంకటేశ్ ఈ వేడుకలో పాల్గొని కాబోయే వధువరులను ఆశీర్వదించారు. 'మ్యాడ్, ఆయ్' చిత్రాలతో నితిన్ హీరోగా గుర్తింపు తెచ్చుకున్నారు.

ఒక సినిమా.. మూడు అవార్డులు!



ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్ హీరోలుగా నటించిన 'బేబి' చిత్రానికి అవార్డుల పరంపర కొనసాగుతోంది. సాయిరాజేశ్ దర్శకత్వంలో ఎస్కేఎన్ ఈ సినిమా నిర్మించారు. ఇందులోని 'ఓ రెండు మేఘాలిలా' పాటకు ఇటీవల ఐఫా అవార్డు అందుకొన్నారు గీత రచయిత అనంత శ్రీరామ్. ఇప్పటి వరకూ 'బేబి' సినిమాకు ఫిల్మ్‌ఫేర్, సైమా, గామా అవార్డులు లభించాయి. అవార్డులు పొందిన అనంత్ శ్రీరామ్‌ను దర్శక నిర్మాతలు అభినందించారు.

ఓ నిరుద్యోగి కథ



విప్లవ్ స్వీయ దర్శకత్వంలో హీరోగా నటించి, నిర్మించిన సినిమా 'ఈసారైనా'. అశ్విని హీరోయిన్. ఈనెల 8న సినిమా విడుదలవుతోంది. ఆదివారం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు, హీరో విప్లవ్ మాట్లాడుతూ 'కథ అందమైన గ్రామీణ నేపథ్యంలో సాగుతుంది. ఒక నిరుద్యోగ యువకుడు ప్రభుత్వ ఉద్యోగానికి సిద్ధమవుతూ, అతని ప్రేమను వెతుక్కునే దిశగా ఎలా సాగుతాడు అనేది ప్రధాన కథ. ఈ సినిమాకి నేనే డైరెక్టర్‌ని, ప్రొడ్యూసర్‌ని. కష్టమైనా అన్నింటినీ మేనేజ్ చేశాను' అని అన్నారు.

1

తమ టెస్టు చరిత్రలో భారత జట్టు స్వదేశంలో మూడు టెస్టుల సిరీస్‌లో వైట్‌వాష్ కావడం ఇదే తొలిసారి.

సుదీర్ఘ ఫార్మాట్‌లో కివీస్ వరుసగా మూడు టెస్టుల్లో గెలవడం ఇదే తొలిసారి. అలాగే భారత్‌ను ఇక్కడ మూడు టెస్టుల సిరీస్‌లో వైట్‌వాష్ చేసిన తొలి టీమ్‌గానూ నిలిచింది.

టెస్టు చరిత్రలో నాలుగు ఇన్నింగ్స్‌లోనూ లెఫ్టామ్ స్పిన్నర్లు (జడేజా, ఎజాజ్) 5+ వికెట్లు తీయడం ఇదే తొలిసారి.

భారత్‌లో ఒకే వేదికపై ఎక్కువ వికెట్లు (25) తీసిన పర్యాటక బౌలర్‌గా ఎజాజ్. ఇయాన్ బోథమ్ (22)ను అధిగమించాడు.

2

టెస్టుల్లో స్వల్ప లక్ష్యాన్ని కాపాడుకోవడం కివీస్‌కిది రెండోసారి. గతంలో ఇంగ్లండ్‌పై 137 పరుగులకు కాపాడుకుంది.

200లోపే టార్గెట్‌ను ఛేదించకపోవడం భారత్‌కిది రెండోసారి. 1997లో విండీస్‌పై 120 పరుగులను పూర్తి చేయలేకపోయింది.

స్వదేశంలో వైట్‌వాష్‌తో సిరీస్‌లను కోల్పోయిన మూడో భారత కెప్టెన్‌గా రోహిత్. గతంలో గుండప్ప విశ్వనాథ్ (1980), సచిన్ టెండూల్కర్ (2000) ఉన్నారు.

3

రెండు ఇన్నింగ్స్‌లోనూ 100+ స్ట్రయిక్ రేట్‌తో అర్ధ సెంచరీలు చేసిన మూడో భారత బ్యాటర్‌గా పంత్. గతంలో సెహ్వాగ్, జైస్వాల్ ఈ ఫీట్ సాధించారు.

కివీస్ తరఫున రెండు ఇన్నింగ్స్‌లోనూ 5+ వికెట్లు తీసిన మూడో బౌలర్‌గా ఎజాజ్. గతంలో వెటోరి, శాంట్నర్ ఉన్నారు.



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్న అనంతరం భార్య, కుమార్తెతో కివీస్ స్పిన్నర్ ఎజాజ్ పటేల్

వేటు తప్పదా?

న్యూజిలాండ్‌తో సిరీస్ వైట్‌వాష్‌తో టీమిండియాలో కొందరు క్రికెటర్ల టెస్ట్ కెరీర్‌కు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల సిరీస్ తర్వాత ఆ ఆటగాళ్లకు ఉద్వాసన ఖాయమని సమాచారం. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జడేజా, అశ్విన్‌లలో ఇద్దరికి బోర్డర్-గవాస్కర్ సిరీస్ నిస్సందేహంగా చివరిది. వయసుమీద పడుతున్న క్రికెటర్ల భవిష్యత్‌పై బీసీసీఐ, సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్, కెప్టెన్ రోహిత్, కోచ్ గంభీర్‌లు త్వరలో చర్చించనున్నారని తెలుస్తోంది. అయితే న్యూజిలాండ్ చేతిలో ఘోర పరాజయం దరిమిలా ఆస్ట్రేలియా వెళ్లే జట్టులో మార్పు, చేర్పులు జరగాలనే డిమాండ్ లేకపోలేదు. కానీ జట్టును ఇప్పటికే ప్రకటించినందున అలాంటి వాటికి ఏమాత్రం అవకాశంలేదని బీసీసీఐ వర్గాలు స్పష్టంజేశాయి. ఈనెల 10న భారత జట్టు ఆసీస్ పయనం కానుంది. ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరడంలో రోహిత్ సేన విఫలమైతే సూపర్ సీనియర్లకు ఉద్వాసన తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంటే..ఆస్ట్రేలియా సిరీస్ తర్వాత ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల టూర్‌కు ఆ దేశం వెళ్లే భారత జట్టులో వారెవరూ ఉండరన్నమాట. పుష్కరకాలంగా స్వదేశంలో టెస్ట్ సిరీస్‌లలో టీమిండియా



కోహ్లీ (1)

సాధించిన అద్భుత విజయాలలో విరాట్, అశ్విన్, జడేజా, రోహిత్‌ల పాత్ర అనన్య సామాన్యం. అయితే వయస్సు వారి ఆటతీరుపై ప్రభావం చూపుతోంది. ఈక్రమంలో ఆ నలుగురు క్రికెటర్లు స్వదేశంలో చివరి టెస్ట్ సిరీస్ ఆడేసినట్టే. ఇక 2011లో సీనియర్లు జట్టును వీడినప్పుడు ఏర్పడిన పరిస్థితులు పునరావృతం కాకూడదంటే..వయస్సు మీరిన ఆటగాళ్ల భవిష్యత్‌కు సంబంధించి అజిత్ అగార్కర్, గౌతమ్ గంభీర్ వారితో వెంటనే చర్చించాల్సిన అవసరం ఎంతో ఉంది.

తదుపరి ఎవరంటే..

తదుపరి ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ సైకిల్‌ను జూన్‌లో ఇంగ్లండ్‌తో జరిగే ఐదు టెస్ట్‌ల సిరీస్‌తో టీమిండియా ప్రారంభించనుంది. భారత జట్టు సుదీర్ఘ ప్రణాళికల కోణంలో చూస్తే..బ్యాటింగ్ విభాగంలో సాయి సుదర్శన్, దేవ్‌దత్ పడిక్కల్‌కు టెస్టు జట్టులో స్థానం దక్కగలదు. ఆల్‌రౌండర్‌గా వాషింగ్టన్ సుందర్ జట్టులో పాతుకుపోయినట్టే. రవిచంద్రన్ అశ్విన్ టెస్టు భవిష్యత్‌పై ఆస్ట్రేలియా పర్యటన తర్వాత సెలక్టర్లు నిర్ణయం తీసుకోనున్నారు. ఫిట్‌నెస్, విదేశీ పిచ్‌లపై బ్యాటింగ్ చేయగల సామర్థ్యం దృష్ట్యా రవీంద్ర జడేజా మరికొంత కాలం కొనసాగొచ్చు. కానీ అక్షర్ పటేల్, మానవ్ సుతార్ రూపంలో ఇద్దరు ఆల్‌రౌండర్లు జడేజా స్థానాన్ని భర్తీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. టెస్టు జట్టు వైస్-కెప్టెన్‌గా జస్‌ప్రీత్ బుమ్రా పేరును ప్రకటించారు. కానీ పని భారం యాజమాన్య నిర్వహణ రీత్యా అతడు అన్ని టెస్టులూ ఆడకపోవచ్చు. అప్పుడు శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్ కెప్టెన్సీ రేసులో ముందుంటారు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)



గిల్ (1) క్లీన్‌బౌల్డ్

పరువూ దక్కలేదు

స్వదేశంలో తొలిసారి 0-3తో భారత్ సిరీస్ ఓటమి

అసలేం జరుగుతోంది?.. స్వల్ప ఛేదన కోసం ఆదివారం బరిలోకి దిగిన టీమిండియా పరిస్థితి చూశాక ప్రతీ అభిమాని ఆవేదన ఇదే. టన్నుల కొద్దీ పరుగులు.. అబ్బురపరిచే రికార్డులు ఖాతాలో ఉన్న స్టార్ బ్యాటర్లు అసలు బ్యాటింగే తెలీదన్నట్టు చకచకా పెవిలియన్‌కు చేరారు. కానీ న్యూజిలాండ్ జట్టు మొత్తానికీ, రిషభ్ పంత్ ఒక్కడు మాత్రం సవాల్ విసిరాడు. స్పిన్నర్లను ఎలా ఎదుర్కోవాలో తన సీనియర్లకు చూపిస్తూ.. భారత్‌ను విజయం వైపు నడిపించాడు. కానీ తను వివాదాస్పద రీతిలో నిష్క్రమించాక ఇక చేసేదేమీ లేకపోయింది. చివరకు ఏదైతే జరుగకూడదనుకున్నామో అదే జరిగింది. నేటి తరం క్రికెట్ ప్రేమికులు ఎన్నడూ చూడని విధంగా సొంత గడ్డపై భారత్ తొలిసారి మూడు టెస్టుల సిరీస్‌ను ప్రత్యర్థికి కోల్పోవాల్సి వచ్చింది. కివీస్ విజయంలో లెఫ్టామ్ స్పిన్నర్ ఎజాజ్ పటేల్ (11 వికెట్లు) అత్యంత కీలకంగా నిలిచాడు.

పంత్ పోరాటం వృధా
6 వికెట్లతో ఎజాజ్ విజృంభణ
క్లీన్‌స్వీప్‌తో న్యూజిలాండ్ చరిత్ర

ముంబై: స్వదేశంలో తమను కొట్టేవారే లేరన్నట్టుగా జైత్రయాత్ర సాగించిన టీమిండియాను న్యూజిలాండ్ చావుదెబ్బ తీసింది. శ్రీలంకపై రెండు టెస్టుల సిరీస్‌ను కోల్పోయి ఇక్కడి వచ్చిన ఈ జట్టు.. ఒక్క టెస్టులో గెలిస్తే గొప్పే అనుకున్నారు. కానీ అనూహ్య ఆటతీరుతో ఏకంగా సిరీస్‌నే 3-0తో క్లీన్‌స్వీప్ చేసేసింది. చివరిదైన మూడో టెస్టులోనూ స్పిన్‌ను ఆడలేక బ్యాటర్లు చేతులెత్తేయడంతో రోహిత్ సేన 147 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కూడా ఛేదించలేకపోయింది. ఫలితంగా



రెండున్నర రోజుల్లోనే ముగిసిన ఈ టెస్టులో పర్యాటక కివీస్ 25 పరుగుల తేడాతో గెలిచింది. వాస్తవానికి భారత జట్టు టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్ కావడం కూడా 24 ఏళ్లలో ఇదే తొలిసారి. 2000లో దక్షిణాఫ్రికా ఇక్కడ 2-0తో నెగ్గింది. స్పిన్నర్ ఎజాజ్ పటేల్ (6/57), ఫిలిప్స్ (3/42) ఇబ్బందిపెట్టడంతో ఆదివారం రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 29.1 ఓవర్లలో 121 పరుగులకే కుప్పకూలింది. జట్టులో పంత్ (64) మాత్రమే రాణించాడు. ఏడుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అంతకుముందు కివీస్ రెండో ఇన్నింగ్స్‌లో 174 పరుగులు సాధించింది. జడేజాకు ఐదు, అశ్విన్‌కు మూడు వికెట్లు దక్కాయి. అలాగే తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 235, భారత్ 263 పరుగులు చేశాయి. ఇక మూడు టెస్టుల్లో ఎక్కువ పరుగులు (244) సాధించిన విల్ యంగ్ ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు ఎజాజ్ పటేల్‌కు దక్కింది.

పంత్ ఒక్కడే..: మూడో రోజు ఆదివారం కివీస్ రెండో ఇన్నింగ్స్ 14 బంతుల్లోనే ముగిసింది. ఎజాజ్ (8)ను జడేజా అవుట్ చేయడంతో భారత్ 147 పరుగుల ఛేదన కోసం బరిలోకి దిగింది. బంతి విపరీతంగా టర్న్ అవుతున్నప్పటికీ, లక్ష్యం మరీ భారీగా లేకపోవడం.. కావాల్సినంత సమయం ఉండడంతో భారత్‌కు విజయం కష్టం కాబోదనిపించింది. కానీ స్పిన్నర్ ఎజాజ్ పటేల్ మరోమారు చుక్కలు చూపించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసిన తను ఈసారి కూడా వరుసగా వికెట్లు తీస్తూ ఓటమిని కళ్లముందుంచాడు. క్రీజులో ఉన్నంతసేపు ఆదుర్దాగా కనిపించిన కెప్టెన్ రోహిత్ (11) అనవసరంగా పుల్ షాట్ ఆడి చేజేతులా పేసర్ హెన్రీకి చిక్కాడు. ఆ తర్వాతి ఓవర్‌లోనే ఎజాజ్ బంతిని సరిగ్గా అంచనా వేయలేక గిల్ (1) బౌల్డ్ అయ్యాడు. అటు విరాట్ కోహ్లీ పేలవ ఫామ్ కొనసాగిస్తూ (1) ఎజాజ్ ఓవర్‌లోనే వెనుదిరిగాడు. పంత్ మాత్రం సిక్సర్‌తో ఖాతా తెరిచి ఫ్యాన్స్‌ను జోష్‌లో నింపాడు. కానీ మరో ఎండ్‌లో వికెట్ల పతనం మాత్రం ఆగలేదు. జైస్వాల్ (5)ను ఫిలిప్స్, ఓ ఫుల్‌టాస్ బంతితో సర్ఫరాజ్ (1)ను ఎజాజ్ బోల్తా కొట్టించారు. ఈ స్థితిలో జట్టు కేవలం 41 బంతుల్లోనే 5 వికెట్లు కోల్పోయి దయనీయంగా కనిపించింది. అప్పటికి స్కోరు 29 పరుగులు మాత్రమే కాగా కనీసం వంద రన్స్ అయినా చేయగలుగుతుందా? అనిపించింది. అయితే పంత్ మాత్రం ఎలాంటి బెరుకు లేకుండా బ్యాటింగ్ సాగించాడు. జడేజా (6)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. ఫిలిప్స్ ఓవర్‌లో రెండు వరుస ఫోర్లతో చెలరేగగా, అతడి ప్రతీ పరుగుకు కూడా వాంఖడే ప్రేక్షకుల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. అయితే 12వ ఓవర్‌లో ఎజాజ్ వేసిన బంతికి తను ఎల్బీ కావాల్సి ఉన్నా కివీస్ రివ్యూకు వెళ్లకపోవడంతో బతికిపోయాడు. అప్పటికి అతడి స్కోరు 21 మాత్రమే. ఇక ఆరో వికెట్‌కు 42 పరుగులు జత చేరాక జడేజా వెనుదిరిగాడు. ఎజాజ్ ఈ వికెట్ తీసి కివీస్‌కు రిలీఫ్‌నిచ్చాడు. పంత్ మాత్రం ఎజాజ్ ఓవర్‌లో రెండు వరుస ఫోర్లతో అర్ధసెంచరీ పూర్తి చేసి తొలి సెషన్‌ను ముగించాడు.

ఆశలు ఆవిరి: లంచ్ బ్రేక్ సమయానికి భారత్ చేతిలో 4 వికెట్లు ఉండగా, మరో 55 పరుగులు చేస్తే చాలు. పంత్ సాధికారికంగా ఆడుతుండగా, అతడికి జతగా సుందర్ ఉండడంతో విజయంపై ఆశలు రేగాయి. అలాగే అశ్విన్ కూడా బరిలోకి దిగాల్సి ఉంది. కానీ భారత్ అంచనాలపై ఎజాజ్ నీళ్లు చల్లాడు. రెండో సెషన్ రెండో ఓవర్‌లోనే గట్టి దెబ్బ తీశాడు. రెండు వరుస ఫోర్లు బాదిన పంత్‌ను నాలుగో బంతికి పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో వాంఖడే ఒక్కసారిగా మూగబోయింది. దీనికితోడు ఫిలిప్స్ ఒకే ఓవర్‌లో అశ్విన్ (8), ఆకాశ్ (0)లను అవుట్ చేయడం.. తర్వాతి ఓవర్‌లోనే సుందర్ (12)ను ఎజాజ్ బౌల్డ్ చేయడంతో భారత్ పరాభవం పూర్తయ్యింది.

స్కోరుబోర్డు

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 235; భారత్ తొలి ఇన్నింగ్స్: 263; న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: 174; భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (ఎల్బీ) ఫిలిప్స్ 5; రోహిత్ (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 11; గిల్ (బి) ఎజాజ్ 1; విరాట్ (సి) మిచెల్ (బి) ఎజాజ్ 1; పంత్ (సి) బ్లండెల్ (బి) ఎజాజ్ 64; సర్ఫరాజ్ (సి) రచిన్ (బి) ఎజాజ్ 1; జడేజా (సి) యంగ్ (బి) ఎజాజ్ 6; సుందర్ (బి) ఎజాజ్ 12; అశ్విన్ (సి) బ్లండెల్ (బి) ఫిలిప్స్ 8; ఆకాశ్ (బి) ఫిలిప్స్ 0; సిరాజ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 29.1 ఓవర్లలో 121 ఆలౌట్. వికెట్ల పతనం: 1-13, 2-16, 3-18, 4-28, 5-29, 6-71, 7-106, 8-121, 9-121, 10-121. బౌలింగ్: హెన్రీ 3-0-10-1; ఎజాజ్ 14.1-1-57-6; ఫిలిప్స్ 12-0-42-3.



డబ్ల్యూటీసీ ఫైనల్ కష్టమే..

న్యూజిలాండ్‌తో వైట్‌వాష్‌కు గురైన భారత జట్టు వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్లో చోటు సాధించడం అత్యంత క్లిష్టంగా మారింది. ఈ ఓటమితో జట్టు 58.33 విజయాల శాతంతో పట్టికలో రెండో స్థానానికి పడిపోగా ఆసీస్ (62.50) టాప్‌లో నిలిచింది. శ్రీలంక (55.56), కివీస్ (54.55) తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ఇక భారత్‌కు ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్ మాత్రమే మిగిలి ఉంది. ఫైనల్‌కు చేరాలంటే ఇందులో కచ్చితంగా నాలుగు టెస్టుల్లో గెలవాల్సిందే. మరో మ్యాచ్‌ను డ్రా చేసుకున్నా ఓకే. అలా అయితేనే ఎలాంటి సమీకరణాలు లేకుండా రోహిత్ సేన తుది పోరుకు అర్హత సాధిస్తుంది. ఇప్పుడున్న స్థితిలో కంగారూలను వారి గడ్డపై క్లీన్‌స్వీప్ చేయడం భారత్‌కు దాదాపు అసాధ్యమే.

కెప్టెన్‌గానూ విఫలమయ్యా..

సిరీస్ ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నాం. గెలుస్తామనుకున్నా ఇలా జరిగింది. కివీస్ మాత్రం అన్ని టెస్టుల్లోనూ మాపై ఆధిపత్యం చూపింది. మేం చాలా తప్పులు చేశాం. తొలి రెండు టెస్టుల్లో మొదట ఆశించిన పరుగులు చేయలేకపోయాం. టర్నింగ్ పిచ్‌పై ఎలా ఆడాలో పంత్, గిల్, జైస్వాల్ ఆడి చూపించారు. ఇక కెప్టెన్‌గా, ఆటగాడిగానూ నేను విఫలమయ్యాను. ఓటమికి పూర్తి బాధ్యత నాదే. కానీ సమష్టిగానూ మేం మంచి ప్రదర్శన కనబర్చలేకపోయాం.

-రోహిత్ శర్మ

ఇదో అద్భుత విజయం

మూడు టెస్టుల్లోనూ అద్భుతంగా ఆడాం. బెంగళూరులో పేసర్లు, ఆ తర్వాత స్పిన్నర్లు భారత్‌ను కట్టడి చేయగలిగారు. ఎజాజ్ ముంబైలో బౌలింగ్ చేయడాన్ని ఆస్వాదించాడు. భారత్ ముందు మంచి టార్గెట్‌ను ఉంచామనే భావించాం. మిగతా పని మా బౌలర్లు కానిచ్చారు. మూడు వారాల క్రితం కలగా భావించిన విజయాన్ని ఇప్పుడు సాధించాం.

- కివీస్ కెప్టెన్ లాథమ్



పంత్ అవుటేనా?

ఛేదనలో జోరు కొనసాగిస్తున్న రిషభ్ పంత్‌ను అవుట్ చేశాక కివీస్ విజయం సులువైంది. అయితే అతడి అవుట్‌పై థర్డ్ అంపైర్ తప్పుడు నిర్ణయం తీసుకున్నారనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇన్నింగ్స్ 21వ ఓవర్ నాలుగో బంతిని డిఫెన్స్ ఆడబోగా బంతి గాల్లోకి లేచి కీపర్ చేతిలో పడింది. దీంతో అవుట్ కోసం అప్పీల్ చేశారు. అంపైర్ నాటౌట్‌గా ప్రకటించడంతో కివీస్ డీఆర్ఎస్ కోరుకుంది. రీప్లేలో బంతి బ్యాట్ అంచును తాకి తర్వాత ప్యాడ్‌ను తాకినట్టుగా కనిపించింది. దీంతో థర్డ్ అంపైర్ అవుట్‌గా ప్రకటించాడు. అయితే ప్యాడ్‌కు బ్యాట్ తాకినందుకే అల్ట్రా ఎడ్జ్‌లో స్పైక్స్ వచ్చాయని, బంతి తగల్లేదంటూ పంత్ ఫీల్డ్ అంపైర్‌కు చెప్పడం కనిపించింది. కానీ బ్యాట్‌కు సమీపంలో బంతి వచ్చినప్పుడు కూడా స్పైక్స్ కనిపించాయి. మూడో అంపైర్ నిర్ణయం ప్రకారం పంత్ మైదానం వీడక తప్పలేదు. అటు సోషల్ మీడియాలో పంత్ అవుట్‌పై మిశ్రమ స్పందన వ్యక్తమైంది. అలాగే రీప్లేలో ఏ విషయం స్పష్టంగా తేలనప్పుడు ఫీల్డ్ అంపైర్ నిర్ణయానికే వదిలేయాలని కెప్టెన్ రోహిత్, ఏబీ డివిలియర్స్ చెప్పారు.



కోచ్‌కు విషమ పరీక్ష

కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు చేపట్టిన మూడు నెలల్లో టీమిండియాకు ఊహించని ఓటములు ఎదురయ్యాయి. శ్రీలంక, న్యూజిలాండ్ చేతిలో పరాజయాలతో గంభీర్‌పై ఎంతో ఒత్తిడి నెలకొంది. గౌతీని బీసీసీఐ ఏరికోరి కోచ్‌గా నియమించుకొంది. గతంలో ఎన్నడూ లేని విధంగా జట్టు ఎంపికలో కూడా అతడు కలజేసుకొనే అవకాశం కల్పించింది. కానీ, తాజా పరిణామాలు గంభీర్ తీరును వేలెత్తి చూపే విధంగా ఉన్నాయి. ఏదైతే అది అనే విధంగా దూకుడుగా ఆడాలనే అతడి మంత్రం పనిచేయడం లేదనిపిస్తోంది. మూడో టెస్ట్‌లో సిరాజ్‌ను నైట్ వాచ్‌మన్‌గా పంపడం, తొలి ఇన్నింగ్స్‌లో సర్ఫరాజ్‌ను 8వ నెంబర్‌లో పంపడానికి అంగీకరించడం లాంటివి వ్యూహాత్మక తప్పిదాలని మాజీలు విమర్శిస్తున్నారు. ఆస్ట్రేలియా టూర్‌కు హర్షిత్ రాణా, నితీశ్ కుమార్ ఎంపికయ్యారంటే అంతా గంభీర్ వల్లేనని బోర్డు అధికారి ఒకరు తెలిపారు. కానీ, వారి సామర్థ్యాలపై ఎన్నో అనుమానాలున్నాయని చెప్పాడు. మొత్తంగా చూస్తే రాబోయే ఆస్ట్రేలియా టూర్‌తో కొందరు సీనియర్లతోపాటు గంభీర్ భవిష్యత్ తేలిపోనుంది.

ఆత్మపరిశీలన చేసుకోవాలి

స్వదేశంలో 0-3తో ఓడడం ఏమాత్రం జీర్ణించుకోలేనిది. ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం. సన్నాహకాల్లో లోపమా? షాట్‌ల ఎంపికలో పొరబాట్లా? లేదా మ్యాచ్ ప్రాక్టీస్ లేకపోవడమా? అయితే పంత్ మాత్రం.. పిచ్ నుంచి సవాళ్లు ఎదురవుతున్నా చక్కని ఫుట్‌వర్క్‌తో అద్భుతంగా పోరాడాడు. - సచిన్ టెండూల్కర్

స్పిన్‌ను ఆడే విషయంలో మనోళ్లు ఎంతో మెరుగుపడాలి. షార్ట్ ఫార్మాట్‌లో కొన్ని ప్రయోగాలు చేయడం మంచిదే. కానీ, టెస్ట్ క్రికెట్‌లో మాత్రం అనవసరం. - వీరేంద్ర సెహ్వాగ్

- మెలికలు తిరిగే వికెట్లే మనకు శత్రువులుగా మారాయి. - హర్భజన్ సింగ్
- స్పిన్‌ను ఎదుర్కోవడంలో చాలా జట్ల తరహాలోనే భారత్ కూడా ఇబ్బంది పడుతోంది. - ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ వాన్

హైలో ఓపెన్
రన్నరప్ మాళవిక

సార్‌బ్రూకెన్ (జర్మనీ): భారత యువ షట్లర్ మాళవిక బన్సోద్ హైలో ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో ఫైనల్ చేరినా టైటిల్ మాత్రం అందుకోలేకపోయింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ టైటిల్ పోరులో మాళవిక 10-21, 15-21తో మియా బ్లిచ్‌ఫెల్డ్ (డెన్మార్క్) చేతిలో ఓటమిపాలైంది.

రెండో వన్డేలో ఇంగ్లండ్ గెలుపు

నార్త్‌సౌండ్ (ఆంటిగ్వా): కెప్టెన్ లివింగ్‌స్టోన్ (124) అజేయ శతకంతో అదరగొట్టడంతో వెస్టిండీస్‌తో రెండో వన్డేలో ఇంగ్లండ్ 5 వికెట్లతో నెగ్గింది. మూడు వన్డేల సిరీస్‌లో 1-1తో సమంగా నిలిచింది. మ్యాచ్‌లో తొలుత విండీస్ 50 ఓవర్లలో 328/6 స్కోరు చేసింది. కెప్టెన్ హోప్ (117) సెంచరీతో, కార్టీ (71), రూథర్‌ఫోర్డ్ (54) అర్ధ శతకాలతో మెరిశారు. అనంతరం ఇంగ్లండ్ 47.3 ఓవర్లలో 329/5 స్కోరు చేసి గెలుపొందింది. లివింగ్‌స్టోన్‌తో పాటు సామ్ కర్రాన్ (52) సత్తా చాటాడు.

వివాదాస్పదమైన 'బంతి మార్పు'

7 వికెట్లతో భారత్-ఎ ఓటమి



మెకే (ఆస్ట్రేలియా): అనధికార టెస్ట్ తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా-ఎ జట్టు 7 వికెట్ల తేడాతో భారత్-ఎపై గెలిచింది. భారత్-ఎ నిర్దేశించిన 225 పరుగుల ఛేదనలో కిందటిరోజు స్కోరు 139/3తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్.. వికెట్ కూడా చేజార్చుకోకుండా 226 పరుగులు చేసి గెలిచింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు నాథన్ మెక్‌స్వీనీ (88 నాటౌట్), వెబ్‌స్టర్ (61 నాటౌట్) అజేయంగా నిలిచి జట్టును గెలిపించారు. భారత్-ఎ 107, 312 స్కోర్లు చేయగా.. ఆసీస్-ఎ తొలి ఇన్నింగ్స్‌లో 195 రన్స్ చేసింది. రెండో ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ గురువారం మెల్‌బోర్న్‌లో మొదలవనుంది.

అంపైర్‌తో కిషన్ వాగ్వాదం: ఈ మ్యాచ్‌లో బంతిని మార్చడం వివాదాస్పదమైంది. నాలుగో రోజు ఆటకుముందు.. బంతిపై గీతలు పడడంతో మార్చినట్టు అంపైర్ స్వాన్ క్రెయిగ్ చెప్పడంతో భారత ఆటగాళ్లు అతనితో వాగ్వాదానికి దిగారు. 'మీరే బంతిని గీకారు.. అందుకే మార్చాం. ఎలాంటి వాదోపవాదాలకు తావులేదు. ఆటను మొదలుపెట్టండి' అని క్రెయిగ్ చెప్పడం స్టంప్ మైక్‌లో వినిపించింది. దీనిపై భారత జట్టు కీపర్ ఇషాన్ కిషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. 'అయితే, ఈ బంతితో మేం ఆడాలా? ఇదో తెలివితక్కువ నిర్ణయమ'ని ఫైర్ అయ్యాడు. దీంతో 'అమర్యాదకర ప్రవర్తనపై ఫిర్యాదు చేస్తాం. మీరు చేసిన పని కారణంగానే బంతిని మార్చాల్సి వచ్చింద'ని క్రెయిగ్ బదులిచ్చాడు. కాగా, బంతి ఆకారం దెబ్బతిన్న కారణంగానే మార్చాల్సి వచ్చిందని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ప్రకటించింది. ఇరుజట్ల కెప్టెన్లు, మేనేజ్‌మెంట్‌కు ముందుగానే సమాచారం ఇచ్చినట్టు పేర్కొంది. కిషన్‌పై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు తీసుకోబోమని తెలిపింది. నిబంధనల ప్రకారం ఉద్దేశపూర్వకంగా బంతి ఆకారాన్ని దెబ్బతీశారని భావిస్తే.. బాల్‌ను మార్చడంతోపాటు బ్యాటింగ్ జట్టుకు పెనాల్టీ కింద ఐదు పరుగులు ఇస్తారు. కానీ, భారత్‌పై ఎటువంటి పెనాల్టీ విధించలేదు.

అనహత్ అదిరెన్

భారత స్క్వాష్ స్టార్‌కు చాలెంజర్ టైటిల్



న్యూఢిల్లీ: భారత స్క్వాష్ టీనేజ్ సంచలనం అనహత్ సింగ్ అంతర్జాతీయ వేదికపై అదరగొట్టింది. ఆస్ట్రేలియాలోని కాఫ్ హార్బర్‌లో జరిగిన కోస్టా నార్త్ కోస్ట్ ఓపెన్‌లో మహిళల సింగిల్స్ చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో మూడో సీడ్ అనహత్ 11-6, 11-6, 11-7తో జపాన్‌కు చెందిన ఆరో సీడ్ అకారి మిదోరికావను చిత్తుచేసి టైటిల్ అందుకుంది. 16 ఏళ్ల అనహత్‌కు ఇది ఈ ఏడాదిలో ఆరో పీఎస్ఏ చాలెంజర్ టైటిల్ కావడం విశేషం.



హరియాణాపై బెంగాల్ విజయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రొ కబడ్డీ లీగ్‌లో వరుస టైలకు ముగింపు పలుకుతూ బెంగాల్ వారియర్స్ మళ్లీ విజయాల బాట పట్టింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో బెంగాల్ 40-38తో హరియాణా స్టీలర్స్‌పై గెలిచింది. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 35-28తో యు ముంబాపై నెగ్గింది.

మరో మూడు స్వర్ణాలు

● అండర్-19 వరల్డ్ బాక్సింగ్

కొలరాడో (అమెరికా): అండర్-19 వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఆదివారం మూడు స్వర్ణ పతకాలు లభించాయి. హేమంత్ సంగ్వాన్ (90 కిలోలు), పార్థవి గరేవాల్ (65 కి), వన్షిక గోస్వామి (80+ కి) పసిడి పంచ్‌లు విసిరారు. నిషా (51 కి), సుప్రియ (54 కి), క్రితిక (80 కి) రజతాలతో సరిపెట్టుకొన్నారు. దీంతో ఈ టోర్నీలో భారత్ మొత్తం 17 పతకాలు సాధించింది.

ఆసీస్-ఎతో 'టెస్టు'కు రాహుల్!

న్యూఢిల్లీ: సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్, రిజర్వ్ కీపర్ ధ్రువ్ జురెల్ నిర్ణీత సమయానికంటే ముందే ఆస్ట్రేలియా వెళ్లనున్నారు. ఆస్ట్రేలియా 'ఎ'తో భారత్ 'ఎ' జట్టు ఆడే రెండో అనధికార టెస్ట్‌లో పాల్గొనేందుకే వారిద్దరినీ ముందుగా ఆసీస్‌కు వెళ్లాలని సూచించినట్టు బోర్డు వర్గాలు తెలిపాయి. ఈ మ్యాచ్ ఈనెల 7నుంచి మెల్‌బోర్న్‌లో జరగనుంది. ఈనెల 22 నుంచి ఆస్ట్రేలియా జట్టుతో జరిగే తొలిటెస్టుకు ముందు మ్యాచ్ ప్రాక్టీస్ లభించేందుకు రాహుల్, జురెల్‌ను పంపుతున్నారు. కివీస్‌తో ముగిసిన మూడు టెస్ట్‌లకు రాహుల్ టీమిండియాలో ఉన్న సంగతి తెలిసిందే. కానీ తొలిటెస్టు తర్వాత రాహుల్ తుదిజట్టులో చోటు కోల్పోయాడు.

నవ్య
కుటుంబ కదంబం
సోమవారం
4 నవంబరు 2024

వినూత్నం

అలంకరణ చేపలతో ఆదాయం ఆర్జించవచ్చనే ఆలోచనే వినూత్నమైనది. అయినా ఆ వ్యాపారాన్ని ఒక సవాలుగా స్వీకరించడమే కాకుండా, నెలకు అర లక్షకు పైగా లాభాలను ఆర్జించే స్థాయికి ఎదిగింది కేరళకు చెందిన పార్వతి వినోద్. చేపల పెంపకంలో పద్దెనిమిదేళ్ల ప్రస్థానాన్నీ, అనుభవాలనూ ఇలా వివరిస్తోంది.

అలంకరణ చేపలతో ఆదాయం...



"నేను సోషియాలజీలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశాను. వివాహమైనతరవాత కేరళలోని కొల్లాం వచ్చేనాటికి నాకు చేపల గురించి అసలు ఏమీ తెలియదు. కానీ మా అత్తగారి కుటుంబమంతా చేపల పెంపకం, వ్యాపారాల్లో అనుభవజ్ఞులు. ప్రతిరోజూ ఈ వ్యవహారాలు చూస్తుండడంతో క్రమంగా నాకు కూడా ఆసక్తి మొదలైంది. చేపల పెంపకంలో మెలకువలు నేర్చుకోవాలనుకున్నాను. అందుకు నాకు కొన్నేళ్లు పట్టింది. ఒక్కోసారి చెరువులో పెంచుతున్న చేపలన్నీ చనిపోయేవి. ఆర్థికంగా నష్టపోయేవాళ్లం. అప్పుడే ఇది చాలా కష్టమైన పనని నాకర్థమైంది. అయినా నేర్చుకోవాలన్న తపనతో పట్టుదలతో చాలా విషయాలు తెలుసుకున్నాను.

గుప్పి, ఏంజిల్, కోయ్ కార్ప్

మాకు ఎనిమిది చేపల చెరువులు ఉండేవి. వీటిలో ఆహారంగా ఉపయోగించే చేపలతోపాటు అలంకరణ కోసం అక్వేరియంలో ఉంచే చేపలను కూడా పెంచేవాళ్లం. గుప్పి, ఏంజిల్, కోయ్ కార్ప్ వంటి అలంకరణ చేపలు త్వరగా చేతికంది వచ్చేవి. వీటి పెంపకంలో రిస్క్ తక్కువగా ఉండేది. దీంతో ఈ అలంకరణ చేపల వ్యాపారాన్ని పెద్ద ఎత్తున ప్రారంభించాలని మావాళ్లకి సూచించా! మొదట ఇంట్లోనే గదుల్లో కొన్ని చేపలను పెంచడం ప్రారంభించాను. తరవాత సిమెంట్ ట్యాంక్‌లు, గ్లాస్ ట్యాంక్‌లు నిర్మించుకున్నాం. తర్వాత ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన స్కీమ్ కింద కొంత రుణం తీసుకొని మొత్తం పదిహేను లక్షల పెట్టుబడితో మూడేళ్ల కిందట కొల్లాంలో 'దేవూస్ ఆక్వాఫామ్' అనే హేచరీని ప్రారంభించాం. ఈ హేచరీలో వివిధ రకాల సైజుల్లో 21 సిమెంట్ ట్యాంకులు, 150 గ్లాస్ ట్యాంక్‌లు ఉన్నాయి. వీటితో పాటు, బయట వేర్వేరు ప్రదేశాల్లో మరో ఏడు ట్యాంక్‌లు ఉన్నాయి. సిమెంట్ ట్యాంక్‌ల్లో ఒక్కోదానిలో లక్ష వరకు కోయ్ కార్ప్ చేప పిల్లలను, గ్లాస్ ట్యాంక్‌ల్లో ఒక్కోదానిలో అయిదు వందల వరకు ఏంజిల్ ఫిష్ చేప పిల్లలను పెంచుతున్నాం. వీటితోపాటు మార్ఫ్, క్రిబిన్‌సిస్, జులిడోక్రోవిస్, బుటికాఫురీ, ఫ్రంటోసా, జీబ్రాడానియస్, రెయిన్‌బో సిచ్లైడ్, హెకెల్లీ, మూన్‌లైట్ గౌరమీ వంటి అరుదైన అలంకరణ చేపలనూ పెంచుతున్నాం. అంతేకాదు ఈ హేచరీలో ఔత్సాహికులకు శిక్షణ కూడా ఇస్తున్నాం.

ట్యాంక్‌ల నిర్వహణ కష్టం

ట్యాంక్‌ల్లో అలంకరణ చేపలను పెంచేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఒక్క చేప చనిపోయి కనిపించినా దానిని వెంటనే తీసివేయాలి. ట్యాంక్ నీటిలో చేపలు వదిలిన వ్యర్థాలను, మిగిలిన ఆహారాన్ని ట్యూబ్‌ల సహాయంతో తీసివేయాలి. లేనిపక్షంలో నీటిలో అమ్మోనియా గ్యాస్ విడుదలై చేపలు చనిపోతాయి. తొట్టిని పరిశుభ్రమైన నీటితో నింపిన తరవాతనే చేపలకు ఆహారాన్ని వేయాలి. తొట్టి బాగా మురికిగా మారినపుడు చేపలన్నింటినీ మరో తొట్టిలోకి మార్చాల్సి ఉంటుంది. మొదట్లో ఇది చాలా కష్టంగా అనిపించేది. దీనికే చాలా సమయం పడుతూ ఉంటుంది.

గోల్డ్ ఫిష్‌కే డిమాండ్...

కస్టమర్ల నుంచి వస్తున్న డిమాండ్‌ను అనుసరించి వైవిధ్యమున్న చేపలను అందించాల్సి ఉంటుంది. గోల్డ్‌ఫిష్, ఫైటర్, ఏంజిల్, గుప్పి చేపలకు డిమాండ్ ఉన్నప్పటికీ కొత్తవాటి గురించి అడుగుతుంటారు. ఎప్పుడూ పాత రకాలనే మార్కెట్లోకి పంపితే ఒక్కోసారి నష్టపోక తప్పదు. వ్యాపారమన్నాక ఒడిదొడుకులు సహజం. ప్రస్తుతం గోల్డ్ ఫిష్, కియోకార్ప్ రకాల చేపలకు ఆదరణ ఎక్కువగా ఉంది. వీటి ఉత్పత్తిని ఏడాదికి మూడు లక్షల నుంచి అయిదు లక్షల వరకు పెంచాం. కియోకార్ప్ ధర అంగుళానికి రూపాయిన్నర, బనానా మార్ఫ్ ధర రెండు అంగుళాలకు నలభై రూపాయలు, బ్లూ మార్ఫ్ ధర రెండు అంగుళాలకు ఇరవై రూపాయలు, ఎర్రని కళ్లున్న అల్బినో క్రిబెన్‌సిస్ ధర ఒక్కోటి అయిదు వందలకు అమ్ముడుపోతున్నాయి. చేపల ఆహారానికి నెలకు 20 వేలు, విద్యుత్తుకు ఐదు వేలు ఖర్చవుతాయి. మెడిసిన్స్, బ్రూడ్‌స్టాక్ ఖర్చులు అదనం. అన్నీ పోను ఒక్కోసారి అత్యధికంగా లాభపడతాం. మరోసారి ఏమీ మిగలదు. ప్రస్తుతం ఇళ్లలో, కార్యాలయాల్లో వాస్తుప్రకారం అక్వేరియం పెట్టుకోవడం మంచిదనే అభిప్రాయం ఉంది. దీనివల్ల రకరకాల చేపలకు డిమాండ్ పెరుగుతోంది. అందుకే అయిదు, ఆరు, పది సెంటీమీటర్ల సైజున్న ఫిష్ పాండ్లను రూపొందించే ఆలోచనలో ఉన్నా. అన్ని పెంపుడు జంతువుల మాదిరిగానే ఈ చేపలు కూడా మనతో బంధాన్ని ఏర్పరచుకుంటాయి. వీటితో సమయం గడపడం మనసుకి అహ్లాదాన్నిస్తుంది.

శిక్షణనిస్తూ...

మొదట అలంకరణ చేపలను పెంచాలని అనుకున్నపుడు అందరూ నిరుత్సాహపరిచారు. కానీ మా వారు, వెన్ను తట్టి ప్రోత్సహించారు. ఆయన నుంచే ప్రాథమికంగా చాలా మెలకువలు నేర్చుకున్నా. శాస్త్రీయంగా అవగాహన ఉండాలన్న ఆలోచనతో కేరళ యూనివర్సిటీ ఆఫ్ ఫిషరీస్ అండ్ ఓషన్ స్టడీస్‌లో చేపల పెంపకానికి సంబంధించిన కోర్సు పూర్తిచేశాను. ఈ పరిజ్ఞానంతోనే 2014 నుంచి ఫిషరీస్ స్కూళ్లు, కాలేజీల్లో తరగతులు నిర్వహిస్తున్నా. నా అనుభవాలను విద్యార్థులతో పంచుకోవడం నాకెంతో ఆనందాన్ని ఇస్తుంది.

వినూత్నం



ఆటిజం పిల్లలు ఎంతో ప్రత్యేకం

బుద్ధిమాంద్యం పట్ల అవగాహన లేని రోజుల్లో బిడ్డలోని లోపాన్ని తొలినాళ్లలోనే పసిగట్టలేక పోయింది ఆ తల్లి. ఆలస్యంగా కనిపెట్టిన తర్వాత ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు బాసటగా మారాలనే లక్ష్యంతో, అనన్య చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ ఎర్లీ ఇంటర్వెన్షనల్ క్లినిక్‌ను స్థాపించింది. ఈ క్లినిక్ ద్వారా తన లాంటి తల్లులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు, పిల్లలకు థెరపీలను కూడా అందిస్తోన్న ఆటిజం నిపుణురాలు, మాధవి ఆదిమూలం నవ్యతో పంచుకున్న విశేషాలు.

"నాకు ఇద్దరు పిల్లలు. వరుణ్, ప్రణవ్. పెద్ద బాబు వరుణ్‌కు ఇప్పుడు 26 ఏళ్లు. రెండేళ్ల వయసొచ్చేవరకూ వరుణ్‌కు మాటలు రాలేదు. ఆలోగా రెండో బాబు ప్రణవ్ పుట్టాడు. ఎదుగుదలలో ఆ ఇద్దరు పిల్లల మధ్య వ్యత్యాసాలున్నట్టు గమనించాను. వెంటనే పిల్లల వైద్యులను సంప్రతించి పెద్ద బాబు పరిస్థితిని వివరించాను. కానీ వైద్యులు నా అనుమానాలను తేలికగా కొట్టిపారేశారే తప్ప, నా ప్రశ్నకు సూటి సమాధానాలు ఇవ్వలేకపోయారు. అయితే ఐటి రంగంలో పని చేస్తున్న నాకు ఇంటర్నెట్ సౌలభ్యం ఉండడంతో, సమాధానాల కోసం ఇంటర్నెట్‌ను ఆశ్రయించాను. ఆన్‌లైన్‌లో ఆటిజం సొసైటీ ఆఫ్ అమెరికా వెబ్‌సైట్ కనిపించింది. దాన్లో, పిల్లల్లోని ఆటిజంను అనుమానిస్తున్న తల్లితండ్రుల కోసం కేటాయించిన ప్రశ్నాపత్రం పూరించాను. ఫలితం మా అబ్బాయి లక్షణాలతో సరిపోలడంతో, ఆ కాగితం ప్రింట్ తీసుకుని మళ్లీ పిల్లల వైద్యుల దగ్గరకు పరుగులు తీశాను. 'ఆటిజం ఉన్నంత మాత్రాన ఏం చేయగలుగుతావు?' అని ప్రశ్నించిందా వైద్యురాలు. ఆవిడ ఉన్నంత రిలాక్స్‌డ్‌గా నేను ఉండలేను. వరుణ్ నా బిడ్డ. వాడి సమస్యను పూర్తిగా అర్థం చేసుకుని, పరిష్కారం వెతకవలసిన బాధ్యత తల్లిగా నాదే! ఆ క్రమంలో క్లినికల్ సైకాలజిస్టును కలవడం, బాబుకు ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ అని తేలిపోవడం చకచకా జరిగిపోయాయి. బాబు హైపర్ యాక్టివిటీతో బడిలో కూడా సమస్యలు ఎదుర్కొంటున్నాడు. వైద్యులే ఆ సమస్యను గుర్తించలేనప్పుడు, టీచర్లకు దాని పట్ల అవగాహన లేకపోవడంలో ఆశ్చర్యం లేదు. కాబట్టి బాబు సమస్యకు పరిష్కారాన్ని వెతికే పూర్తి బాధ్యత నేనే తీసుకున్నాను. భారతదేశంలో ఆటిజం చికిత్సావకాశాలు కూడా లేవని నా పరిశోధనలో తేలిపోయింది. దాంతో నేనొక కీలకమైన నిర్ణయం తీసుకున్నాను.

ఆటిజం పట్ల అవగాహన పెంచుకుని...

ఆ రోజుల్లో నేను ఐటి కంపెనీ తరఫున యూరప్ రీజియన్ కోసం పని చేస్తున్నాను. విదేశాల్లో ఆటిజం పట్ల అవగాహన, చికిత్సలు విస్తృతంగా అందుబాటులో ఉన్నాయి కాబట్టి భాష సమస్యలు లేని యుకెకు ట్రాన్స్‌ఫర్ చేయమని మా బాస్‌ను అడిగాను. కారణం తెలుసుకున్న ఆయన వెంటనే నన్ను ట్రాన్స్‌ఫర్ చేసేశారు. అలా 2001లో బాబును తీసుకుని యుకె వెళ్లిపోయాను. అక్కడి బడుల్లో ఈ కోవకు చెందిన పిల్లలకు ప్రత్యేక సదుపాయాలున్నాయి. బాబుకు అర్థం కాని పాఠాలను విడిగా వివరించడం కోసం సపోర్ట్ టీచర్ కూడా ఉండేది. అలా కొన్నేళ్లు అక్కడే ఉండిపోయాను. ఆటిజం పట్ల పూర్తి అవగాహన పెంచుకున్నాను. పేరెంట్ ట్రైనింగ్ కూడా తీసుకున్నాను. దాంతో బాబుతో ఎలా నడుచుకోవాలో అర్థమైపోయింది. కాబట్టి ఇండియా వచ్చేసి స్వయంగా నేనే వాడికి విద్యాబుద్ధులు నేర్పించాలని నిర్ణయించుకుని, 2007లో ఇండియా తిరిగొచ్చేశాను. కానీ అప్పటికీ హైదరాబాద్‌లో ఆటిజం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. బడిలో చేర్చినా మా బాబును ఎలా స్టిమ్యులేట్ చేయాలో టీచర్లకు తెలియడం లేదు. ఊరికే తరగదిలో కూర్చోబెడితే, ప్రయోజనం ఏముంటుంది? అందుకే నేను కూడా అదే బడిలో టీచర్‌గా చేరిపోయాను. కానీ ప్రతి రోజూ బడికెళ్లి, మా బాబుకు నేనే టీచర్‌గా మారే బదులు, ఆ పనేదో ఇంట్లోనే చేయొచ్చు కదా? అనిపించింది. అలా ఐటి ఉద్యోగానికి రాజీనామా చేసి, 2008, ఏప్రిల్ రెండున, అనన్య చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ ఎర్లీ ఇంటర్వెన్షనల్ క్లినిక్‌ను మొదలుపెట్టాను.

వర్చువల్ ఆటిజంకు అడ్డుకట్ట

వర్చువల్ ఆటిజం అనే పదం కొవిడ్‌లో పుట్టుకొచ్చింది. నిజానికి ఇది ఆటిజం కాదు. ఇదొక డెవలప్‌మెంటల్ డిజార్డర్. దీన్ని సరిదిద్దడం కూడా చాలా తేలిక. కొవిడ్ కాలంలో పిల్లలను వేరే పనిలో ఎంగేజ్ చేసేసి, సొంత పనులు చేసుకోవచ్చనే ఆలోచనతో తల్లితండ్రులే పిల్లలకు గ్యాడ్జెట్స్ అందించడం మొదలుపెట్టారు. అప్పటి నుంచి అదే పరిస్థితి కొనసాగుతోంది. ఇలా చిన్న వయసులోనే ఫోన్లు, ఐప్యాడ్‌లకు పిల్లలు అతుక్కుపోవడం వల్ల డెవలప్‌మెంటల్ డిలేస్ తలెత్తుతాయి. వయసుకు తగిన ఎదుగుదల మందగించి, మాటలు రాకపోవడం, సాధారణ నైపుణ్యాలు కొరవడడం లాంటి సమస్యలు మొదలవతాయి. ఈ సమస్యను సరిదిద్దడం కంటే, సమస్య తలెత్తకుండా ముందుగానే జాగ్రత్త పడడం తల్లితండ్రుల బాధ్యత. పిల్లలతో సఖ్యంగా మెలుగుతూ, వాళ్లతో మాట్లాడుతూ, ఆడుతూ పాడుతూ, నాణ్యమైన సమయాన్ని గడపాలే తప్ప, వాళ్లకు గ్యాడ్జెట్స్ అలవాటు చేయకూడదు.



సమస్యను ప్రారంభంలోనే కనిపెడితే...

ఇప్పుడు వరుణ్‌కి 26 ఏళ్లు. బాబుకు సంగీతం పట్ల ఆసక్తి ఎక్కువ. ఈ విషయాన్ని గ్రహించిన నేను క్లాసికల్ మ్యూజిక్ నేర్పించాను. బాబుకు భాషల పట్ల కూడా ఆసక్తి ఎక్కువే! 18 ఏళ్ల నుంచీ హిందుస్తానీ క్లాసికల్ మ్యూజిక్ నేర్చుకుంటున్నాడు. టీచర్లతో కలిసి ప్రదర్శనలు కూడా ఇస్తున్నాడు. వీకీపీడియా ద్వారా 80 నుంచి 90 భాషలు నేర్చుకున్నాడు. బుద్ధిమాంద్యం పిల్లల పట్ల సాధారణంగా జాలి, దయ వ్యక్తపరుస్తాం! ఆ పిల్లలెందుకూ పనికిరారనీ, వాళ్లకెలాంటి తెలివితేటలూ ఉండవని అనుకుంటాం! కానీ ఈ పిల్లలెంతో ప్రత్యేకం. వాళ్లకూ నైపుణ్యాలుంటాయి. వాటిని వెతికి మెరుగుదిద్దడం తల్లితండ్రుల బాధ్యత. అన్నిటికంటే ముఖ్యంగా ఈ పిల్లలను ప్రారంభంలోనే గుర్తించి, థెరపీ ఇప్పించగలిగితే ఫలితాలు మెరుగ్గా ఉంటాయి. ఈ విషయం చాలా మంది తల్లితండ్రులకు తెలియదు. సాధారణంగా తల్లితండ్రులందరూ ఆటిజం విషయంలో ఒక పెద్ద పొరపాటు చేస్తూ ఉంటారు. మా పిల్లలు 'నార్మల్'గానే ఉన్నారనే నిశ్చితాభిప్రాయంలో ఉంటూ ఉంటారు. త్వరగా బాగైపోయి, పెద్ద చదువులు చదివేసి ఏ డాక్టరో, ఇంజనీరో అయిపోవాలనే ఆరాటపడతారు తప్ప, బిడ్డకు ఉన్న సమస్యను అర్థం చేసుకునే ప్రయత్నం చేయరు. నిజానికి ఈ పిల్లల సమస్యను ప్రారంభంలో తేలికగానే కనిపెట్టవచ్చు. పేరుతో పిలిస్తే పలకకపోవడం, వేరే పిల్లలతో కలవకుండా విడిగా ఆడుకోవడం, సామాజిక నియమనిబంధనలు, ప్రవర్తనల పట్ల అవగాహన లేకపోవడం లాంటి లక్షణాలను పసిగట్టాలి.

టైలర్డ్ థెరపీతో...

డెవలప్‌మెంటల్ డిలేస్ వేరు ఆటిజం వేరు. అయితే సమస్య మాటలు రాకపోవడానికి డెవలప్‌మెంటల్ డిలే కారణమైతే, ఆరు నెలల థెరపీతో పిల్లలు మాట్లాడడం మొదలుపెట్టేస్తారు. కానీ ఆటిజంలో ఇది సాధ్యపడదు. ఈ తేడాలను తల్లితండ్రులు తెలుసుకోవాలి. ఆటిజం తీవ్రతలో కూడా తేడాలుంటాయి. అలాగని థెరపీతో ఉపయోగం ఉండదని అనుకోకూడదు. ఇప్పుడు అనన్యలో పని చేస్తున్న కౌన్సెలర్లు అందరూ అత్యున్నత అర్హత ఉన్నవాళ్లే! వీళ్లందరూ థెరపీలో భాగంగా ఆక్యుపేషనల్ థెరపీ, సోషల్ ఇంటరాక్షన్, పీర్ ప్లే సేవలందిస్తూ ఉంటారు. తల్లితండ్రులకు వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేస్తూ ఉంటాం. వాళ్లకూ శిక్షణనిస్తాం! ఇంట్లో పిల్లలతో నడుచుకోవలసిన విధానాలను నేర్పిస్తాం. క్లినికల్ అబ్జర్వేషన్, పేరెంట్ ఇంటర్వ్యూ, డెవలప్‌మెంటల్ అసెస్‌మెంట్ ఆధారంగా పిల్లల్లో ఆటిజం తీవ్రతను అంచనా వేసి, టైలర్డ్ థెరపీని తయారు చేసుకుంటాం. ప్రతి బిడ్డకూ తగినంత సమయాన్ని కేటాయిస్తూ, మాట్లాడడం, నడవడిక, ప్రవర్తనలను గాడిలో పెడుతూ, తల్లితండ్రులకు గైడెన్స్ ఇస్తూ బిడ్డకు మెరుగైన జీవితాన్ని అందించడం కోసం కృషి చేస్తూ ఉంటాం. మా సేవలను ఆన్‌లైన్‌లో కూడా పొందవచ్చు.

> మా వారు, మోహన్ ఫ్రీల్యాన్స్ కార్పొరేట్ ట్రైనింగ్ ఇస్తూ ఉంటారు. మా రెండో బాబు, ప్రణవ్, ఎమ్‌బిబిఎస్ పూర్తి చేసి ప్రస్తుతం పిజికి సిద్ధపడుతున్నాడు. బంజారాహిల్స్, మాధాపూర్, మణికొండ, కోకాపేట్, నల్లగండ్లలో అనన్య బ్రాంచెస్ ఉన్నాయి. అన్ని చోట్లా థెరపిస్టులతో పాటు, పిల్లలకు అవసరమైన అన్ని సౌకర్యాలూ ఉంటాయి.

పిల్లల్లో ఆటిజంను పూర్తిగా నయం చేయడం నా లక్ష్యం కాదు. అది సాధ్యపడదు కూడా! ఈ సమస్య ఉన్న పిల్లలతో తల్లితండ్రులు ఎలా నడుచుకోవాలో నేర్పించడం, వాళ్లకు శిక్షణ ఇవ్వడంతో పాటు పిల్లలకు వ్యక్తిగత, సామాజిక ప్రవర్తనలు, నియమనిబంధనలు నేర్పించడం నా పని.

● గోగుమళ్ల కవిత



నుదిటి మీద మొటిమలు వస్తున్నాయా!

చలికాలంలో నుదిటిమీద ఎక్కువగా మొటిమలు వస్తుంటాయి. ఇవి చిన్నగా ఉన్నప్పటికీ విపరీతమైన నొప్పిని కలిగిస్తాయి. హార్మోన్ల అసమతుల్యత, జన్యువుల తీరు, పరిశుభ్రత పాటించకపోవడం వల్ల చర్మ రంధ్రాలు మూసుకుపోయి ఈ రకం మొటిమలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. వీటిని నివారించే మార్గాలు తెలుసుకుందాం!

- శీతాకాలంలో అందరికీ తలలో చుండ్రు ఉంటుంది. ఇది నుదిటి భాగంపై రాలినపుడు అందులోని బ్యాక్టీరియా చర్మ రంధ్రాల్లోకి చేరి వాటిని మూసివేయడం వల్ల మొటిమలు ఏర్పడతాయి. అందుకే తలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చుండ్రు, పేలు వంటివి ఉంటే వాటి నివారణకు చికిత్స చేయించుకోవాలి.
- శరీరంలో హార్మోన్ల పనితీరు సరిగా లేనప్పుడు చర్మ రంధ్రాల నుంచి అధికంగా నూనె ఉత్పత్తవుతుంది. ఇది చర్మం మీద ఉన్న మృత కణాలు, చెమట, ఇతర బ్యాక్టీరియాలతో కలసి చర్మ రంధ్రాలు మూసుకుపోయేలా చేస్తుంది. అప్పుడు కూడా మొటిమలు వస్తాయి. జిడ్డు చర్మం ఉన్నవారికి ఈ సమస్య అధికంగా ఉంటుంది. వీలైనన్నిసార్లు ముఖాన్ని కడుక్కోవడం, దిండు గలీబులను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నుదిటిని చేతితో తాకకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకుంటే మొటిమలు తగ్గుముఖం పడతాయి.
- ఒక గిన్నెలో రెండు చెంచాల జోజోబా ఆయిల్ లేదా కొబ్బరి నూనె వేసి దానికి రెండు చుక్కల టీ ట్రీ ఆయిల్ కలిపి ఆ మిశ్రమాన్ని కాటన్ బాల్ సహాయంతో నుదుటి మీద రాస్తే మొటిమల్లోని సూక్ష్మజీవులు నశించిపోతాయి. రెండు చెంచాల పసుపుకు తగినంత తేనె కలిపి ఆ మిశ్రమాన్ని మొటిమల మీద రాసినాకూడా మంచి ఫలితముంటుంది. ఒక చెంచా యాపిల్ సైడర్ వెనిగర్‌కు మూడు చెంచాల నీళ్ల కలిపి ఆ మిశ్రమాన్ని నుదుటికి పట్టించి రాత్రంతా అలాగే ఉంచుకొని ఉదయాన్నే గోరువెచ్చని నీళ్లతో కడగాలి. ఇలా రెండు రోజులకోసారి చేయడం వల్ల మొటిమలు పెరగకుండా ఉంటాయి.

హాట్ హిట్స్



ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
3. భూల్ భులాయా (భూల్ భులాయా3)
4. ఆయీ నై (స్త్రీ-2)
5. జో తుమ్ మేరే హో (జో తుమ్ మేరే హో)
6. సాజ్‌నీ రే (లాపతా లేడీస్)
7. అఖియా గులాబ్ (తేరీబాతోమ్‌మే ఐసా ఉల్జా జియా)
8. నైనా (క్రూ)
9. అపనా బనాలే (భేడియా)
10. మేరీ మెహబూబ్ (విక్కీ విద్యా కా ఓ వాలా వీడియో)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)

ఆమె పాట... చిన్నారి గుండెలకు రక్ష



పలక్ ముచ్చల్ పాట సంగీతాభిమానుల వీనులకు విందే కాదు... చిన్నారి గుండెలకు రక్షా కవచం కూడా! ఏడేళ్ల వయసులోనే పలక్‌లో చిగురించిన ఔదార్యం ఆమె గాన ప్రతిభతోపాటే ఎదిగింది. మూడువేల మందికి పైగా పిల్లలకు కొత్త జీవితాన్నిచ్చింది.

ముంబయిలోని తన ఇంట్లో ఒక గది పలక్ ముచ్చల్‌కు ఎంతో ప్రత్యేకం. మ్యూజిక్ కాన్సర్ట్ కోసం వేరే ఊళ్లకు వెళ్తే తప్ప... ప్రతి రోజూ ఆ గదిలో కొంతసేపైనా ఆమె గడుపుతారు. ఇంతకీ ఆ గదిలో ఉండేవి... అలమరాల్లో పేర్చిన రకరకాల సైజుల్లోని బొమ్మలు మాత్రమే. ఇప్పటివరకూ మూడువేల మందికి పైగా నిరుపేద పిల్లలకు ఆమె గుండె ఆపరేషన్లు చేయించారు. అందుకు బదులుగా వారి నుంచి ఒక బొమ్మను మాత్రమే ఆమె తీసుకుంటారు. వాటన్నిటి కోసం ఒక గదిని ఆమె కేటాయించారు. "ఒక్కొక్క బొమ్మ వెనుకా ఒక్కొక్క గుండె ఉంది. గది నిండా ఎన్నో గుండెల జాలి కథలున్నాయి. అవి నాలో ఉద్వేగాన్ని కలిగించడమే కాదు... ప్రేరణ కలిగిస్తాయి. కర్తవ్యాన్ని బోధిస్తాయి" అంటారు పలక్. ఆమె సేవా ప్రయాణం ప్రారంభమై సరిగ్గా పాతికేళ్లయింది.

కార్గిల్ అమరుల కుటుంబాల కోసం...

పలక్ స్వస్థలం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్. ఆమె తండ్రి రాజ్‌కుమార్ ముచ్చల్ ప్రైవేట్ ఉద్యోగి. తల్లి అమిత సంగీతాభిమాని. ఆ అభిరుచితోనే పలక్‌కు, ఆమె సోదరుడు పలాశ్‌కు సంగీతంలో శిక్షణ ఇప్పించారు. సుప్రసిద్ధ సంగీత దర్శకులు కళ్యాణ్‌జీ-ఆనంద్‌జీ బాల గాయకులను ప్రోత్సహించడానికి ఏర్పాటు చేసిన "లిటిల్ స్టార్" అనే బృందంలో నాలుగేళ్ల వయసులో పలక్ చేరి, తన ప్రతిభకు మెరుగులు దిద్దుకున్నారు. వివిధ కార్యక్రమాల్లో తన గళాన్ని వినిపించేవారు. కార్గిల్ యుద్ధం జరిగినప్పుడు ఆమెకు ఏడేళ్ళు. సైనికుల మరణాల గురించి విని చలించిపోయిన ఆమె... మృత జవాన్ల కుటుంబాలకు సహాయం అందించడానికి... ఇండోర్‌లోని దుకాణాల ముందు నిలబడి... పాటలు పాడారు. దాదాపు పాతిక వేల రూపాయలకు పైగా పోగు చేసి... కేంద్ర ప్రభుత్వానికి పంపారు. అదే ఏడాది ఒడిశా తుపాను బాధితుల కోసం కూడా నిధులు సేకరించారు. స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు ఈ సంగతి తెలుసుకొని... గుండెకు సంబంధించిన లోపంతో బాధపడుతున్న తమ విద్యార్థి ఆపరేషన్ కోసం ఒక ఛారిటీ షో నిర్వహించాల్సిందిగా పలక్‌ను, ఆమె తల్లితండ్రులను కోరారు. "ఆ విద్యార్థి తండ్రి చెప్పుల వ్యాపారి. ఆపరేషన్ చేయించే స్థోమత ఆ కుటుంబానికి లేదు. అందుకే మరో ఆలోచన లేకుండా అంగీకరించాం. నాలుగు రోడ్ల కూడలిలో... తోపుడు బండి మీద నిలబడి పాటలు పాడాను. విరాళాలుగా రూ.51 వేలు వచ్చాయి. ఇది చదివి... బెంగళూరుకు చెందిన కార్డియాలజిస్ట్ దేవీ ప్రసాద్ శెట్టి ఎలాంటి ఫీజు తీసుకోకుండా ఆపరేషన్ చెయ్యడానికి ముందుకు వచ్చారు. ఒక మనిషి ప్రాణాలను కాపాడితే కలిగే సంతృప్తి ఎలా ఉంటుందో అప్పుడే నాకు తెలిసింది" అని గుర్తు చేసుకున్నారు పలక్. ఆ తరువాత.. గుండె ఆపరేషన్లు అవసరమైన పేద పిల్లల విరాళాల సేకరణ కోసం పలక్ ఎప్పుడైనా పాడడానికి సిద్ధమంటూ పత్రికల్లో ఆమె తల్లితండ్రులు ఒక ప్రకటన ఇచ్చారు. వారం రోజుల్లోనే 33 మంది పిల్లల సర్జరీల కోసం విజ్ఞాపనలు వచ్చాయి. పలక్ వరుసగా ప్రోగ్రామ్‌లు చేయడం ప్రారంభించారు. దీనికి పలు ఆసుపత్రులతో పాటు వైద్యులు కూడా ఛార్జీల తగ్గింపుతో, ఫీజుల మినహాయింపుతో తమ వంతు సాయం అందించారు.

> "ఇప్పటికి మూడు వేలకు పైగా సర్జరీలు పూర్తయ్యాయి. అదృష్టవశాత్తూ నా పాటలకు ప్రాచుర్యం ఉంది. నా సంగీత కార్యక్రమాలకు ఆదరణ కూడా బాగానే ఉంది. వాటి ద్వారా వచ్చే ప్రతి పైసా దాని కోసమే ఖర్చు చేస్తున్నాను.



అది గొప్ప అదృష్టంగా భావిస్తా...

ఒక వైపు ఛారిటీ షోల్లో పాల్గొంటూనే మరో వైపు చదువును, సంగీత సాధనను పలక్ కొనసాగించారు. 2001లో... 'చైల్డ్ ఫర్ చిల్డ్రన్' పేరిట తొలి మ్యూజిక్ ఆల్బమ్ విడుదల చేశారు. "ఆ తరువాత పదేళ్లలో మరో అయిదు ఆల్బమ్స్ చేశాను. సినీ పరిశ్రమలో గాయనిగా పేరు తెచ్చుకోవాలనేది నా కల. దానికోసం ఇండోర్ నుంచి ముంబయికి మా కుటుంబం వచ్చేసింది. 2011లో... హిమేష్ రేష్మియా సంగీత దర్శకత్వంలో 'డమాడమ్' సినిమా టైటిల్ సాంగ్ పాడే అవకాశం వచ్చింది. ఆ తరువాత 'ఆషికీ 2', 'ఏక్తా టైగర్', 'ప్రేమ్ రతన్ ధన్‌పాయో', 'కిక్' తదితర చిత్రాల్లో వరుసగా అవకాశాలు వచ్చాయి. ముఖ్యంగా ఎంఎస్ ధోనీ: ది అన్‌టోల్డ్ స్టోరీ'లో 'కౌన్ తుఝే' పాట నాకు ప్రేక్షకుల నుంచి, సినీ రంగం నుంచి గొప్ప ప్రశంసల్ని తెచ్చిపెట్టింది" అంటున్న పలక్ హిందీతోపాటు తెలుగు, బెంగాలీ, భోజ్‌పురి, ఉర్దూ, గుజరాతీ, పంజాబీ, మరాఠీ, తమిళ్, కన్నడ తదితర భాషల్లో తన గళాన్ని వినిపించి మెప్పించారు. అలాగే మ్యూజిక్ కాన్సర్ట్‌లో పాల్గొని... వాటి ద్వారా వచ్చే డబ్బును... 'పలక్ ముచ్చల్ ఫౌండేషన్' తరఫున 'సేవింగ్ లిటిల్ హార్ట్స్ ప్రాజెక్ట్ ద్వారా... పేద పిల్లల గుండె ఆపరేషన్లకు ఖర్చు చేస్తున్నారు. 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్', 'లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' లో చోటు సంపాదించుకున్న ఆమె కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రీయ బాల పురస్కార్, అమెరికన్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్‌తో సహా సినీ, సామాజిక రంగాల్లో చేసిన సేవలకు ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. ఆమె కథను మహారాష్ట్ర ప్రభుత్వం ఏడో తరగతి మోరల్ సైన్స్‌లో పాఠంగా చేర్చింది. అది గొప్ప అదృష్టంగా భావిస్తానంటారు పలక్. "ఇప్పటికి మూడు వేలకు పైగా సర్జరీలు పూర్తయ్యాయి. అదృష్టవశాత్తూ నా పాటలకు ప్రాచుర్యం ఉంది. నా సంగీత కార్యక్రమాలకు ఆదరణ కూడా బాగానే ఉంది. వాటి ద్వారా వచ్చే ప్రతి పైసా దానికోసమే ఖర్చు చేస్తున్నాను. ఇప్పుడు ఒక కాన్సర్ట్ చేస్తే వచ్చే డబ్బుతో 13-14 సర్జరీలకు సాయం చేయగలుగుతున్నాను. రెండేళ్ళ క్రితం సంగీత దర్శకుడు మిథున్‌తో నాకు వివాహమయింది. ఆయన కూడా నన్ను ఎంతో సపోర్ట్ చేస్తున్నారు. నా ద్వారా సాయం పొందిన కుటుంబాలన్నీ నావిగానే భావిస్తాను. వారి నుంచి నేను తీసుకొనేది... వారి జ్ఞాపకంగా ఒక్క బొమ్మ మాత్రమే. సర్జరీల కోసం నా సాయం కోరిన వారి జాబితాలో మరో 400 మందికి పైగా ఉన్నారు. ఇప్పుడు వారందరి బాధ్యత నా మీద ఉంది. ఇలాగే.. జీవితాంతం ఈ కార్యక్రమాన్ని కొనసాగించే శక్తి నాకు ఇవ్వాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను" అంటున్నారు పలక్.

వైద్య ఖర్చు భారమే..!



వైద్యంపై అత్యధిక ఖర్చులో దేశంలోనే నాలుగో స్థానంలో ఆంధ్రప్రదేశ్

- తక్కువ ఖర్చు చేస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ నంబర్‌వన్
- మద్యం ఖర్చులో తెలంగాణ 4, ఏపీ 6వ స్థానంలో..
- దేశంలో 82 శాతం చిన్నారులు సర్కారీ బడులకే!
- 'జాతీయ శాంపిల్ సర్వే'లో వెల్లడి

హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వైద్య ఖర్చులు పెరిగిపోతున్నాయి. ఇతర రాష్ట్రాల పరిస్థితి ఎలా ఉన్నా వైద్యంపై అత్యధికంగా వెచ్చిస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నాలుగో స్థానంలో నిలిచింది. అయితే.. పొరుగున ఉన్న తెలంగాణలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. వైద్యంపై అతితక్కువ ఖర్చు చేస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది! ఇక నెలవారీ తలసరి వ్యయంలో కూడా తెలంగాణ టాప్‌లో నిలిచింది! మద్యం, మాంసాహారంపై ఖర్చులో తెలుగు రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి! ఈ విషయాలు కేంద్ర ప్రభుత్వ సంస్థ 'జాతీయ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్‌ఎస్ఎస్‌వో)' సర్వేలో వెల్లడయ్యాయి. మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ వినియోగం, పట్టభద్రులు, నిరుద్యోగం.. లాంటి అనేక అంశాలపై ఎన్‌ఎస్ఎస్‌వో వివరాలు సేకరించింది. జూలై-2022 నుంచి జూన్-2023 మధ్య అన్ని రాష్ట్రాల్లో 3 లక్షలకు పైగా కుటుంబాలు ఈ సర్వేలో పాల్గొన్నాయి. వీటిలో గ్రామీణ ప్రాంతాల్లో 1.73 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 1.28 లక్షల కుటుంబాలు ఉన్నాయి. గ్రామీణ, పట్టణాల్లో కుటుంబాలు చేస్తున్న ఖర్చు, ఇతర అంశాలకు సంబంధించిన సర్వే వివరాలను ఇటీవలే విడుదల చేసింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణ ప్రాంతాల్లో వైద్యంపై అతి తక్కువ ఖర్చుతో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవగా, అత్యధిక ఖర్చులో ఏపీ(12%) నాలుగో స్థానంలో నిలిచింది. పశ్చిమబెంగాల్ ప్రజలు తమ మొత్తం ఆదాయంలో అత్యధికంగా 15 శాతం వైద్యంపై ఖర్చు చేస్తుండగా.. 14.4%తో కేరళ, 12.4తో పంజాబ్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ విభాగంలో తెలంగాణలో ఖర్చు 6.1 శాతం మాత్రమే. గ్రామీణ ప్రాంతాల్లో 17.9 శాతంతో కేరళ, 16.8తో పశ్చిమ బెంగాల్ తొలి రెండు స్థానాల్లో ఉండగా.. 16.6 శాతంతో ఏపీ తర్వాతి స్థానంలో ఉంది. ఈ విభాగంలో తెలంగాణ 10.3 శాతంతో తక్కువ ఖర్చు చేస్తున్న రాష్ట్రంగా నిలిచింది.

తలసరి వ్యయంలో నంబర్ వన్..

నెలవారీ సగటు తలసరి వినియోగ వ్యయంలో పట్టణ ప్రాంతాల్లో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. జాతీయ స్థాయిలో పట్టణ ప్రాంతాల్లో ఓ కుటుంబం సగటున రూ.6459 ఖర్చు చేస్తుండగా.. తెలంగాణలో రూ.8158 ఖర్చు చేస్తున్నారు. రూ.7911తో హరియాణా, రూ.7666తో కర్ణాటక, రూ.7630తో తమిళనాడు, రూ.7078 కేరళ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఏపీలో ఇది రూ.6782గా ఉంది.

మద్యం ఖర్చులో ఆరో స్థానం

ఆహారంపై చేస్తున్న మొత్తం ఖర్చు వివరాలను ఈ సర్వేలో వెల్లడించారు. ఇందులో మద్యం, ప్రాసెస్డ్ ఫుడ్‌పై అత్యధిక ఖర్చు చేస్తున్న టాప్-6 (గ్రామీణ ప్రాంతాలు) రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి. 28.4 శాతంతో తమిళనాడు అగ్రస్థానంలో ఉండగా.. కర్ణాటక 25.4, అసోం 24.6 తర్వాతి స్థానాల్లో నిలిచాయి. 23.2 శాతంతో తెలంగాణ నాలుగో స్థానంలో నిలవగా. 22.9తో ఒడిశా 5, 21.4 శాతంతో ఆంధ్రప్రదేశ్ ఆరో స్థానంలో ఉన్నాయి. ఇందులో జాతీయ సగటు 20.7 శాతంగా ఉండగా.. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఖర్చు జాతీయ సగటు కంటే అధికంగా ఉంది.



పట్టణ ప్రాంతాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వరుసగా 3, 4 స్థానాల్లో ఉన్నాయి. 33.7 శాతం ఖర్చుతో తమిళనాడు, 32.9తో కర్ణాటక తొలి రెండు స్థానాల్లో ఉండగా.. 32.4తో తెలంగాణ, 28.0తో ఏపీ 3, 4 స్థానాల్లో నిలిచాయి. పట్టణ ప్రాంతాల్లో జాతీయ సగటు 27.2గా ఉంది.

ముద్దలో ముక్క ఉండాల్సిందే..



మాంసాహారంపై ఎక్కువ ఖర్చు చేయడంలో తెలుగు రాష్ట్రాలు దేశంలోనే ఐదో స్థానంలో నిలిచాయి. కేరళ వాసులు 19.8 శాతం మాంసాహారంపై ఖర్చు చేస్తుండగా.. పశ్చిమబెంగాల్ 18.9, అసోం 17.0, తమిళనాడు 12.3 శాతంతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఈ విషయంలో తెలంగాణ, ఏపీ సమానంగా నిలిచాయి. రెండు రాష్ట్రాల ప్రజలు మాంసాహారంపై 11.9 శాతం ఖర్చు చేస్తున్నారు. ఇందులో జాతీయ సగటు 9.1 శాతంగా ఉంది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో చూస్తే.. 23.5 శాతంతో కేరళ ప్రథమ, 20తో అసోం ద్వితీయ, 18.9తో పశ్చిమ బెంగాల్ తృతీయ స్థానంలో ఉండగా.. 15.8తో తెలంగాణ నాలుగు, 14.8తో ఏపీ ఐదో స్థానంలో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ సగటు 10.6 శాతంగా ఉంది.

తృణ ధాన్యాలపై 4 శాతం ఖర్చు..

2022-23లో సరాసరిగా ఓ కుటుంబం చేసిన మొత్తం ఖర్చులో తృణధాన్యాలు, ఇతర ఆహార పదార్థాలకు వెచ్చిస్తున్నదాన్ని చూస్తే.. బిహార్, అసోం రాష్ట్రాల్లోని పట్టణ ప్రాంతాల్లో 55శాతం ఖర్చు ఆహార పదార్థాలపై చేస్తుండగా.. ఇందులో 6శాతం తృణధాన్యాలపై ఉంది. ఏపీలోని పట్టణ ప్రాంత జనాభా మొత్తం ఖర్చులో 43 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 48 శాతం ఆహారంపై ఖర్చుచేస్తున్నారు. తెలంగాణ పట్టణ ప్రాంతాల్లో 39%, గ్రామీణ ప్రాంతాల్లో 47శాతం వెచ్చిస్తున్నారు. తెలుగురాష్ట్రాల్లో తృణధాన్యాలపై ఖర్చు సరాసరిగా 4 శాతంగా ఉంది.

82% సర్కారు బడుల్లోనే..



ప్రైవేటు పాఠశాలలు పెరుగుతున్నా.. కార్పొరేట్ సంస్కృతి విస్తరిస్తున్నా.. దేశవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అత్యధికులు సర్కారు బడుల్లోనే చేరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 6-10 ఏళ్ల వయసు చిన్నారుల్లో 82.2 శాతం మంది సర్కారు పాఠశాలల్లో చదువుతుండగా.. పట్టణ ప్రాంతాల్లో 54.7 శాతం మంది చదువుతున్నారు.

86 లక్షల మందికి బడి తెలియదు..

దేశవ్యాప్తంగా 6-18 ఏళ్ల వారిలో 2.1 శాతం మందికి పాఠశాల అంటేనే తెలియదు. ఇలాంటివారు గ్రామీణ ప్రాంతాల్లో 2.2% మంది.. పట్టణ ప్రాంతాల్లో 1.9% మంది ఉన్నారు. ఇందులో బాలురు, బాలికలు సమానంగా ఉన్నారు. దేశవ్యాప్తంగా 6-18 ఏళ్ల వారి సంఖ్య 43.10 కోట్లుగా ఉంది. ఈ లెక్కన 2% మంది అంటే 86 లక్షల మంది అక్షరాభ్యాసానికి దూరంగా ఉన్నారు. తెలంగాణలో 6-18 ఏళ్ల వారిలో 0.4% మందికి బడి అంటే తెలియదు. దీనికి గల కారణాలను విశ్లేషిస్తే.. 82.2% మంది చిన్నారులకు అనారోగ్యం, అంగవైకల్య సమస్యలు, 16.6% మంది చదువుపై అనాసక్తి, 1.2% మంది ఆర్థిక సమస్యలతో పాఠశాలలకు దూరంగా ఉన్నారు.

టెక్నాలజీ పట్టభద్రుల్లో ఏపీ రెండో స్థానం



సైన్స్ అండ్ టెక్నాలజీ పట్టభద్రుల సంఖ్యలో తెలంగాణ టాప్‌లో ఉంది. దేశవ్యాప్తంగా 21ఏళ్ల పైబడిన వారిలో మొత్తం పట్టభద్రుల్లో 34శాతం ఈ కోర్సుల్లో పట్టా పొందుతుండగా.. తెలంగాణలో వీరి శాతం 62.3గా ఉంది. ఏపీ 58.5 శాతంతో రెండోస్థానంలో ఉంది. కేరళలో సైన్స్ పట్టభద్రులు 47 శాతం, ఢిల్లీలో 26 శాతం, కర్ణాటకలో 41 శాతం, తమిళనాడులో 57శాతంగా ఉంది. 21-59 మధ్య వయసున్న పట్టభద్రుల్లోనూ 63 శాతంతో తెలంగాణ అగ్రస్థానంలో ఉండగా.. 59.8 శాతంతో ఏపీ రెండో స్థానంలో ఉంది. దేశంలోని మొత్తం పట్టభద్రుల్లో 38శాతం సైన్స్, టెక్నాలజీ గ్రాడ్యుయేట్లే.

మొబైల్ వినియోగంలో ఏపీ 4వ స్థానం



దేశవ్యాప్తంగా 96.1 శాతం మంది జనాభా మొబైల్ ఫోన్లు (స్మార్ట్ ఫోన్లతో సహా) వినియోగిస్తున్నారు. 99.40 శాతం మందికి ఫోన్లతో కేరళ అగ్రస్థానంలో.. 98.6 శాతంతో తమిళనాడు రెండో స్థానంలో ఉంది. 98.5 శాతంతో తెలంగాణ మూడో స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ జనాభాలో 97.8 శాతం మంది మొబైల్ ఫోన్లు వినియోగిస్తున్నారు. కేరళ మొత్తం జనాభాలో 99 శాతం మంది ఇంటర్నెట్ వినియోగిస్తుండగా.. తెలంగాణలో 94.4 శాతం మంది వినియోగదారులు ఉన్నారు. కర్ణాటకలో 92.4 శాతం, తమిళనాడులో 90.5, ఏపీలో 91.1% ఇంటర్నెట్ వినియోగిస్తున్నారు.

'ఆమె'కు ప్రాధాన్యం

అంతంతే!

- నిర్ణాయక స్థాయిలో స్వల్పంగా పెరిగిన మహిళా శక్తి
- స్థానిక సంస్థల్లో 10 లక్షల మందికి పైగా గెలుపు
- ఎన్ఎస్ఎస్‌వో నివేదికలో వెల్లడి

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దేశ, రాష్ట్ర ప్రగతి కోసం అన్ని స్థాయిల్లో తీసుకునే నిర్ణయాల్లో మహిళల పాత్ర కొంత మెరుగుపడిందని జాతీయ శాంపిల్ సర్వే సంస్థ (ఎన్ఎస్ఎస్‌వో) నివేదిక వెల్లడించింది. 2015లో కేంద్ర మంత్రివర్గంలో మహిళల శాతం 17.8 శాతానికి చేరిందని, ఇప్పటికీ ఇదే అత్యధికమని తెలిపింది. ప్రస్తుతం కేంద్ర కేబినెట్‌లో మహిళల శాతం 13.7శాతంగా ఉందని పేర్కొంది. ఈ నివేదికలోని వివరాల ప్రకారం... గత లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన పురుషుల్లో గెలిచిన అభ్యర్థుల శాతం కంటే గెలుపొందిన మహిళా అభ్యర్థుల శాతమే ఎక్కువ. 17వ లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రాల వారీగా మహిళా అభ్యర్థులు గెలుచుకున్న ఎంపీ సీట్లు ఒడిశాలో అత్యధికం. ఆ రాష్ట్రంలో 33 శాతం మంది మహిళా ఎంపీలున్నారు. కేవలం 5శాతం మహిళా ఎంపీలతో కేరళ చివరి స్థానంలో ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో అత్యధికంగా 21 శాతం మంది మహిళా అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేశారు. ఏపీలో ఎన్నికల్లో పోటీ చేసినవారిలో కేవలం 8 శాతం మందే మహిళలు. స్థానిక సంస్థల్లో గెలిచిన మహిళలు 78,025 మంది ఉన్నారు. గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడంతో నిర్ణయాత్మక స్థాయిల్లో మహిళా శక్తి పెరిగింది. ఈ రిజర్వేషన్ వల్ల లక్షలాది మహిళలు ఎన్నికల్లో పోటీ చేయగలుగుతున్నారు. పంచాయతీరాజ్ సంస్థల్లో 22 రాష్ట్రాలు మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాయి. మణిపూర్‌లో ఈ విధానం అమలులో లేకపోయినప్పటికీ అక్కడి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచినవారిలో 50.7 శాతం మంది మహిళలే. ప్రస్తుతం దేశవాప్తంగా ఉన్న మూడంచెల స్థానిక సంస్థల్లో మహిళా నాయకులు 10లక్షల మందికి పైగానే ఉన్నారు. 2023లో సుప్రీంకోర్టులో 33 మంది న్యాయమూర్తులు ఉంటే వారిలో మహిళలు ముగ్గురు మాత్రమే. హైకోర్టుల్లో కూడా మహిళా జడ్జిల శాతం 14 శాతమే. ఎంఎస్ఎంఈల్లో మహిళల శాతం 20.5 శాతం. ఈ వెబ్‌సైట్‌లో నమోదైన ఎంఎస్ఎంఈల ద్వారా లభిస్తున్న మొత్తం ఉద్యోగాల్లో మహిళలు నడుపుతున్న సంస్థల ద్వారా లభిస్తున్న ఉద్యోగాలు 18.73 శాతం. మహిళలు సారథ్యం వహిస్తున్న ఐఎంఈల ద్వారా అందుబాటులోకి వచ్చిన ఉద్యోగాలు ఆ విభాగంలో లభించిన మొత్తం ఉద్యోగాల్లో 70.84 శాతం. 2016 నుంచి 2023 డిసెంబరు వరకు డీపీఐఐటీ గుర్తించిన స్టార్టప్‌లు 1,17,254. వీటి బోర్డుల్లో కనీసం ఒక మహిళా డైరెక్టర్ ఉన్న స్టార్టప్‌లు 55,816 ఉన్నాయి. మొత్తం స్టార్టప్స్‌లో వీటి వాటా 47.6 శాతం. 2023లో ఏపీలో కనీసం ఒక మహిళా డైరెక్టర్ ఉన్న స్టార్టప్‌లు 295 ఉన్నాయి.

పోలవరం ప్రధాన పనులపై..

రేపటి నుంచే వర్క్‌షాపు

- తొలి మూడ్రోజుల్లో క్షేత్ర స్థాయి పరిశీలనలు
- డయాఫ్రం వాల్, ఈసీఆర్ఎఫ్ డ్యాంపై చర్చ
- కాఫర్ డ్యాంలలో సీపేజీ నివారణపై సూచనలు

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పునర్నిర్మాణం దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. మంగళవారం నుంచి అంతర్జాతీయ నిపుణులు, కేంద్ర జలసంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, రాష్ట్ర జలవనరుల శాఖ, నిర్మాణ సంస్థలు బావర్, మేఘా ఇంజనీరింగ్ ప్రతినిధులతో ఐదు రోజుల పాటు వర్క్‌షాప్ జరుగనుంది. మొదటి మూడ్రోజులూ క్షేత్రస్థాయి పరిశీలనలు ఉంటాయి. తొలిరోజున ప్రధాన డ్యాం నిర్మాణ ప్రాంతాన్ని నిపుణులు, అధికారులు పరిశీలిస్తారు. రెండోరోజు డయాఫ్రం వాల్ నిర్మాణ ప్రాంతానికి వెళ్తారు. మూడో రోజున ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యాం నిర్మాణ ప్రాంతంలోని గ్యాప్‌లను పరిశీలిస్తారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలలో సీపేజీని అరికట్టడంపై సలహాలు ఇస్తారు. ఈ వర్క్‌షాప్‌లో నాలుగో రోజు అత్యంత కీలకంగా మారనుంది. ఆ రోజున సమీక్షలను ప్రాజెక్టు క్షేత్రం నుంచి రాజమహేంద్రవరానికి మార్చాలని యోచిస్తున్నారు. కొంతమంది నిపుణులు నాలుగో రోజునే తిరుగుప్రయాణం కానుండడమే దీనికి కారణం. రాజమండ్రి సమావేశంలో.. మెయిన్ డ్యాం నిర్మాణ పనులను ఎప్పుడెప్పుడు ప్రారంభించాలి.. ఎప్పటిలోగా పూర్తిచేయాలి.. డిజైన్ల ఆమోదం తదితర అంశాలన్నిటిపైనా జలసంఘం, పీపీఏ, అంతర్జాతీయ నిపుణులు, జలవనరుల శాఖ, మేఘా ఇంజనీరింగ్ సంస్థ, జర్మన్ కంపెనీ బావర్ అధికారులు, ప్రతినిధులు సమీక్షిస్తారు. డయాఫ్రం వాల్, ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులు చేపట్టడంపై ప్రధానంగా నిర్ణయం తీసుకుంటారు. వీటి డిజైన్లను ఎప్పటిలోగా ఆమోదించేదీ జలసంఘం డెడ్‌లైన్‌ను నిర్దేశించుకుంటుంది. పీపీఏ ద్వారా బావర్, మేఘా సమర్పించే డిజైన్లను ఎప్పటిలోగా ఆమోదిస్తారో వెల్లడిస్తుంది. కీలకమైన క్వాలిటీ కంట్రోల్‌పైనా కేంద్రం స్పష్టత ఇవ్వనుంది. ఈ బాధ్యతను వాప్కోస్ తీసుకుంటుంది. నాలుగు రోజుల్లో తీసుకున్న నిర్ణయాలు, వచ్చిన ఆలోచనలపై వర్క్‌షాపు ఐదోరోజున సమగ్ర సమీక్ష జరుగుతుందని అంటున్నారు. కేంద్ర సంస్థల అధికారులు, నిపుణులంతా అదే రోజు నిష్క్రమిస్తారు.

3 నెలల గడువుపై బావర్‌తో పేచీ..!

పోలవరం ప్రాజెక్టులో ప్రధానమైన కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణ పనులను వచ్చే జనవరి 2న ప్రారంభించాలని జలశక్తి శాఖ, రాష్ట్ర జలవనరుల శాఖ నిర్ణయించాయి. ఇందుకు బావర్, మేఘా ఆమోదం తెలిపాయి. అయితే దీనిని 2026 నవంబరుకల్లా పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టుబడుతున్నాయి. బావర్ మాత్రం ప్రతికూల వాతావరణం, వరదల నేపథ్యంలో..2027 ఫిబ్రవరికి పూర్తిచేయగలమని చెబుతోంది. డిసెంబరు, జనవరి, ఫిబ్రవరిల్లోనే ప్రాజెక్టు



వద్ద వాతావరణం నిర్మాణానికి అనువుగా ఉంటుందని.. తుది పనులన్నీ అప్పుడు సమర్థంగా పూర్తి చేయగలుగుతామని అంటోంది. అయితే.. ఇప్పటికే తొలి డయాఫ్రం వాల్ నిర్మాణంలో అనుభవం వచ్చినందున.. 2026 నవంబరుకే నిర్మించాలని జలవనరులశాఖ అడుగుతోంది. తమపై ఒత్తిడి చేయవద్దని.. ఆ 3 నెలల సమయం ఇవ్వాల్సిందేనని బావర్ స్పష్టంచేస్తోంది. నవంబరుకల్లా వాల్ పూర్తయితే తక్షణమే ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులు ప్రారంభించాలన్నది జలవనరుల శాఖ ఉద్దేశం. 2026 నవంబరులో ఆ పనులు మొదలుపెడితే.. ఫిబ్రవరిలోపు ఆ డ్యాం కూడా కొలిక్కి వస్తుందని భావిస్తోంది. ఈ నేపథ్యంలో బావర్, మేఘా ప్రతినిధులతో సీఎం చంద్రబాబు వద్ద ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు యోచిస్తున్నారు. ఈ భేటీ తర్వాత 3నెలల అదనపు గడువుపై బావర్ పట్టుసడలించవచ్చని భావిస్తున్నారు. ఐదేళ్ల జగన్ విధ్వంసం నుంచి తేరుకుని.. పోలవరం ప్రాజెక్టుకు కొత్తరూపాన్నిచ్చే మహా క్రతువుకు కేంద్ర, రాష్ట్ర సంస్థలు సిద్ధమవుతున్నాయి. ఈ వర్క్‌షాపులో దీనిని త్వరగా పూర్తిచేసే దిశగా నిర్మాణాత్మకమైన ఆలోచనలు వస్తాయని జల వనరుల శాఖ ఆశిస్తోంది.



మాకు అప్పు

ఇప్పించండి

అమరావతికి భూములిచ్చిన రైతుల రుణఘోష

వెలగపూడికి చెందిన ఓ రైతు గడిచిన ఐదేళ్లలో పూర్తిగా అప్పులపాలైపోయాడు. పంట పొలాలు రాజధానికి ఇవ్వడంతో అతడికి వ్యవసాయ రుణాలు రాలేదు. ప్రభుత్వం ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లకు బ్యాంకులు అప్పులు ఇవ్వలేదు. దీంతో తన కుమార్తె వివాహానికి ఆ ప్లాట్లు తనఖా పెట్టి భారీ వడ్డీకి ప్రైవేటు వ్యక్తుల దగ్గర అప్పులు చేశాడు. ఆ వడ్డీల భారం తడిసి మోపెడవడంతో తన ప్లాట్లు అమ్మేసుకుని అప్పు తీర్చాల్సి వచ్చింది

ఉద్దండరాయునిపాలెంలో మరో రైతు రాజధాని కోసం తనకున్న 6 ఎకరాల జరీబు భూమి ఇచ్చాడు. ప్రభుత్వం అతనికి నివేశనా స్థలం కింద 6,000 గజాలు, వాణిజ్య సముదాయం కింద 2,700 గజాలు ప్లాట్లు కేటాయించింది. గడిచిన ఐదేళ్లలో అప్పుల పాలైన అతడు 7వేల గజాలు అమ్ముకోవాల్సి వచ్చింది. అయినప్పటికీ ఇంకా అప్పులు ఉండటంతో మిగిలిన 1,700 గజాలు కూడా అమ్మకోక తప్పని పరిస్థితి. ఇది ఏ ఒక్క రైతు పరిస్థితో కాదు.. రాజధాని కోసం భూములిచ్చిన సామాన్య, మధ్యతరగతి రైతులందరూ ఈ పరిస్థితినే ఎదుర్కొంటున్నారు.

- వ్యవసాయ రుణాలు రాక భారీ వడ్డీలకు ప్రైవేటు అప్పులు
- రిటర్నబుల్ ప్లాట్‌లపై రుణాలు ఇవ్వని బ్యాంకులు
- ప్రభుత్వం రుణపరపతి కల్పించాలని అభ్యర్థన

గుంటూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): భూమి ఉండే రైతులకు బ్యాంకుల్లో రుణ పరపతి ఉంటుంది. అడిగిన వెంటనే బ్యాంకులు వారికి వ్యవసాయ రుణాలు ఇస్తాయి. ప్రభుత్వాలు కూడా అందుకు తగిన ప్రోత్సాహాన్ని అందిస్తాయి. కానీ రాజధాని కోసం భూములు త్యాగం చేసిన అమరావతి రైతులు అనూహ్యంగా ఆ రుణ పరపతి కోల్పోయారు. అప్పులిచ్చేందుకు బ్యాంకులు నిరాకరించడంతో చిన్న మొత్తాలకు కూడా ప్రైవేటు వారి వద్ద పెద్దమొత్తంలో వడ్డీకి అప్పు చేయాల్సిన పరిస్థితి ఈ రైతులకు వచ్చింది. రాజధాని రైతులు తమకు తరతరాల నుంచి వచ్చిన పొలాలను కోల్పోవడమే కాకుండా, అందుకు ప్రతిఫలంగా వచ్చిన రిటర్నబుల్ ప్లాట్లను కూడా అప్పులబారిన పడి కోల్పోవాల్సిన అత్యంత విషాదకర పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వ వైఖరితో అప్పు పుట్టక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం ప్రభుత్వం మారినా వారికి రుణ పరపతి దక్కలేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి రాజధాని కోసం భూములిచ్చిన తమకు రుణ పరపతి కల్పించాలని రాజధాని రైతులు కోరుతున్నారు.

కక్షగట్టి ఇబ్బంది పెట్టిన వైసీపీ ప్రభుత్వం

రాజధాని రైతుల విషయంలో వైసీపీ ప్రభుత్వం కక్షగట్టి అత్యంత కఠినంగా వ్యవహరించింది. వారికి ఏటా ఇవ్వాల్సిన వార్షిక కౌలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టింది. దీంతో రైతులు అప్పులు చేయాల్సి వచ్చింది. గతంలో రైతుల పొలాలపై వ్యవసాయ రుణాలు వచ్చేవి. లేదంటే భూమి పత్రాలు బ్యాంకుల్లో తనఖా పెట్టి తక్కువ వడ్డీకి రుణాలు తెచ్చుకునే వారు. వ్యవసాయ రుణానికి తక్కువ వడ్డీ ఉండేది కాబట్టి రైతులపై పెద్దగా భారం పడేది కాదు. కానీ రాజధానికి భూములు ఇవ్వడంతో రైతులకు ఈ పరపతి మొత్తం పోయింది. రాజధాని గ్రామాల్లో రైతులు వ్యవసాయం ఆపేయడంతో పీఏసీఎస్, బ్యాంకుల నుంచి వారికి వ్యవసాయ రుణాలు ఆగిపోయాయి. దీంతో రైతులు ప్రైవేటు వ్యక్తుల దగ్గర రూ. 3, అంతకు మించి వడ్డీలకు రుణాలు తీసుకోవాల్సి వచ్చింది.

అక్కరకు రాని రిటర్నబుల్ ప్లాట్లు

రాజధానికి భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లపై రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ససేమిరా అన్నాయి. రాజధానిపై వైసీపీ ప్రభుత్వం రాజకీయం కారణంగా గడిచిన ఐదేళ్లుగా రైతుల ప్లాట్లు విలువలేనివిగా మారిపోయాయి. కొంతమంది రైతులు రాజధానిలో పొలాలు ప్రభుత్వానికి ఇచ్చి, ప్రభుత్వం ఇచ్చిన కౌలు పరిహారంతో వేరే ప్రాంతాల్లో పొలాలు కొనుక్కున్నారు. వారికీ కష్టాలు తప్పలేదు. ఆ పొలాలు కొన్న చోట నివసించడంలేదన్న కారణంతో అక్కడి బ్యాంకులు రుణాలు ఇవ్వలేదు. దీంతో ప్రైవేటు వడ్డీ వ్యాపారులనే రైతులు ఆశ్రయించాల్సి వచ్చింది.

తక్కువ రేట్లకే ప్లాట్లు అమ్ముకుని..

అప్పులు పాలైన రైతులు వాటిని తీర్చేందుకు తమ స్థలాలను తెగనమ్ముకున్నారు. ఇప్పుడు గజం రూ. 50 వేల నుంచి రూ. 60 వేలు పలుకుతుండగా.. కూటమి ప్రభుత్వం రావడానికి మూడు నెలల ముందు గజం కేవలం రూ. 13 వేలకు మాత్రమే అమ్ముడైంది. ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్తుల దగ్గర తెచ్చిన రుణాలకు వడ్డీ భారాన్ని తట్టుకోలేక అప్పట్లో రైతులు తమ స్థలాలను అయినకాడికే తెగనమ్ముకోవాల్సి వచ్చింది. ఇప్పుడున్న రేట్లను బట్టి చూస్తే అప్పుడు అమ్ముకున్న రైతులు ఎంత నష్టపోయారో అర్థమవుతుంది. గత ప్రభుత్వం నుంచి వారికి చేయూత లభించి ఉంటే, బ్యాంకుల ద్వారా రుణాలు వచ్చిఉంటే రైతులు తమ పొలాలను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉండేది కాదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ విషాదకోణాన్ని పరిగణనలోకి తీసుకుని రాజధాని కోసం భూములిచ్చిన తమకు రుణ పరపతి కల్పించాలని రైతులు కోరుతున్నారు. లేకుంటే అప్పుల విషవలయంలో చిక్కుకున్న రైతులు రాజధానిలో తమ అస్తిత్వాన్నే కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెనుకబాటు నుంచి బయటకు!

- 33 ఎంబీసీ కులాల అభివృద్ధికి బాటలు
- వడ్డీ వ్యాపారుల నుంచి విముక్తి
- అన్ని రకాల గుర్తింపు కార్డుల జారీ
- సీడ్ ప్రణాళిక ద్వారా బ్యాంకు రుణాలు
- ప్రత్యేకంగా స్వయం ఉపాధి పథకాలు
- కొత్త ప్రణాళికలకు కూటమి సర్కారు శ్రీకారం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ ప్రభుత్వం గాలికొదిలేసిన సంచార జాతులకు సంక్షేమాన్ని పునరుద్ధరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దుర్భర జీవనం గడుపుతున్న బీసీల్లోని అత్యంత వెనుకబడిన 33 కులాల గోడు పట్టించుకోవాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాలతో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పలు పథకాలకు శ్రీకారం చుట్టారు. స్కీం ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ నోటిఫైడ్ ట్రైబల్స్ (సీడ్) పథకం ద్వారా రుణాలందించేందుకు కసరత్తు జరుగుతోంది. చిన్నచిన్న వ్యాపారాలు, వీధి వ్యాపారాలు, సంచార వ్యాపారాలు చేసుకునే వారికి సబ్సిడీపై రుణాలు అందించి వారి అభ్యున్నతికి తోడ్పడనుంది. వారికి గుర్తింపు కార్డులివ్వడం, వాటి ద్వారా వారు ఎక్కడున్నా.. సంక్షేమ పథకాల ఫలాలతో పాటు, ఆయా స్వయం ఉపాధి పథకాలు అందించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తోంది. సంచార జీవనం గడిపే ఈ ప్రజలకు రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతాల వంటివి కూడా లేవు. జగన్ ప్రభుత్వం ఇచ్చిన నవరత్నాల పథకాల్లో వీరెవరూ లబ్ధిదారులు కాలేకపోయారు. బీసీ-ఏ కేటగిరీకి చెందిన ఈ కులాలు బాగా వెనుకబడిన జాబితాలో ఉన్నాయి. వీరు నివసిస్తున్న ప్రాంతాల్లో చాలా వరకు ప్రభుత్వ పథకాలు చేరడం లేదని చంద్రబాబు ప్రభుత్వం అప్పట్లోనే గుర్తించింది. గంగిరెద్దులు, బుడబుక్కలు, జంగం, కాటిపాపలు తదితర పలు రకాల కులాలకు చెందిన వారు చేస్తున్న వృత్తులకు ఆదరణ లేకపోయినా.. ఇప్పటికీ అదే వృత్తిలో ఊరూరా తిరుగుతూ జీవనం కొనసాగుతున్నారు. కొన్ని కులాల వారు వీధుల్లో చిన్నచిన్న ప్లాస్టిక్ సామాన్లు, బొమ్మలు విక్రయిస్తూ పొట్ట పోసుకుంటున్నారు. మరికొన్ని కులాల వారు ఇప్పటికీ యాచక వృత్తిలోనే ఉన్నారు. వారి సామాజిక, విద్య, ఆర్థిక, రాజకీయ స్థాయి చాలా తక్కువగా ఉన్నాయి. ఎక్కువ మంది నిరక్షరాస్యులు కావడం, పథకాలపై అవగాహన లేకపోవడంతో సంక్షేమ లబ్ధి చేకూరడం లేదు. వారిలో ఎక్కువ మంది రోజుకో చోట సంచరిస్తుండడంతో రేషన్ కార్డులు గానీ, ఆధార్, బ్యాంకు అకౌంట్లు పొందలేకపోతున్నారు. బ్యాంకుల నుంచి రుణ సదుపాయం లేకపోవడంతో చాలామంది వడ్డీ వ్యాపారుల చేతుల్లో నలిగిపోతున్నారు. వారికి ఆర్థికంగా చేయూతనిస్తే వారు చేసుకునే చిన్న చిన్న వ్యాపారాలు వృద్ధి చెంది వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అప్పట్లో అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దరిమిలా యాచక వృత్తి ప్రధానంగా ఉన్న ఈ కులాలను ఆర్థికంగా, సామాజికంగా వృద్ధిలోకి తీసుకొచ్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం గతంలోనే పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఈ కులాల కోసం ఆంధ్రప్రదేశ్ అత్యంత వెనుకబడిన తరగతుల సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్‌ను 2016 జూన్‌లో ఏర్పాటుచేసింది. దీని ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.30వేల చొప్పున ఆర్థిక సాయం అందించింది. కార్పొరేషన్ ద్వారా 90 శాతం సబ్సిడీ, ఎన్‌బీసీఎఫ్‌డీసీ నుంచి 10శాతం రుణం ఇవ్వడం ద్వారా స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంది. బీసీ సంక్షేమశాఖ చొరవతో 2017-18లో ఈ కార్పొరేషన్‌కు రూ.60 కోట్లు, 2018-19 సంవత్సరంలో రూ.100 కోట్లు, 2019-20లో రూ.60కోట్లు కేటాయించారు. లబ్ధిదారులను వెతికి వారికి గుర్తింపుపత్రాలు అందించి జనజీవనంతో కలిసిపోయేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు పలు కార్యక్రమాలు చేపట్టారు. తర్వాత ఒక్కో లబ్ధిదారుకు రూ.50 వేల సాయం అందించాలని నిర్ణయించారు. ఈ కార్పొరేషన్ ద్వారా అందించిన ఆర్థిక సాయంతో పలువురు వీధి వ్యాపారాలు సమర్థంగా అభివృద్ధి చేసుకున్నారు. చంద్రబాబు ప్రభుత్వం 100 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా ఇచ్చింది. జగన్ సీఎంగా రాగానే ఇవన్నీ ఆపేశారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో గత సంక్షేమ పథకాలను పునరుద్ధరించడంతో పాటు మరింత సాయం అందించేందుకు సిద్ధమైంది.





అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడికి సిడ్నీ విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న ఎన్ఆర్ఐలు

కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సుకు అయ్యన్న

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆస్ట్రేలియా వెళ్లారు. న్యూసౌత్ వేల్స్ నగరంలో జరగనున్న 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ (సీపీసీ)లో పాల్గొనేందుకు ఆయన ఆదివారం సిడ్నీ నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఎన్ఆర్ఐలు ఎయిర్‌పోర్టులో స్పీకర్‌కు ఘనస్వాగతం పలికారు. అయ్యన్న వెంట కుమారుడు చింతకాయల రాజేశ్, శాసన సభ కార్యదర్శి ప్రసన్నకుమార్ సూర్యదేవర ఉన్నారు.

గత ఐదేళ్లూ తీవ్ర సంక్షోభంలో రాష్ట్రం

- దీన్ని చక్కదిద్దే సామర్థ్యం సీఎం చంద్రబాబుకే ఉంది: జేపీ



విజయవాడ, నవంబరు 3: గత ఐదేళ్లూ రాష్ట్రం తీవ్ర సంక్షోభంలో ఉందని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ అన్నారు. గుణదల ఈఎస్ఐ ఆస్పత్రి రోడ్డులోని రోటరీ క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి రూ.9.64 లక్షల కోట్ల అప్పు ఉందని, వచ్చే ఆదాయంలో సగం వడ్డీలకే సరిపోతుందని పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంతగా అప్పులు లేవని, గత వైసీపీ ప్రభుత్వం సంపద సృష్టిపై కాకుండా.. బటన్లు నొక్కడంపైనే దృష్టి పెట్టిందని అన్నారు. రాష్ట్రాన్ని దివాళా పరిస్థితికి తీసుకొచ్చిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రజలకు అపార నమ్మకం ఉందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దే సామర్థ్యం ఆయనకే ఉందని పేర్కొన్నారు. రాజధానిగా అమరావతి అభివృద్ధి చెందాలని జేపీ ఆకాంక్షించారు. దేశ, రాష్ట్ర భవిష్యత్తును కాపాడేలా నేతలు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా లక్ష్మీశ

- వైఎస్ఆర్ జిల్లాకు శ్రీధర్ నియామకం.. సీఎస్ ఉత్తర్వులు



లక్ష్మీశ



శ్రీధర్


అమరావతి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్, వైఎస్ఆర్ కడప జిల్లాలకు ప్రభుత్వం కొత్త కలెక్టర్లను నియమించింది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా 2013 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి లక్ష్మీశను, వైఎస్ఆర్ కడప జిల్లాకు 2006 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి సి.శ్రీధర్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా ఉన్న సృజన, వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్‌గా ఉన్న శివశంకర్ తెలంగాణకు బదిలీ అయ్యారు. దీంతో వారి స్థానంలో కొత్త కలెక్టర్లను నియమించారు. లక్ష్మీశ ప్రస్తుతం ఏపీఎంఎస్ఐడీసీ ఎండీతో పాటు ఆరోగ్యశ్రీ సీఈవో, డ్రగ్స్ డీజీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన స్థానంలో కొత్త వారిని నియమించే వరకూ తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ప్రభుత్వం ఆదేశించింది. అలాగే కడప జిల్లా కలెక్టర్‌గా నియమితులైన శ్రీధర్ పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆయన బదిలీ కావడంతో పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా ఎం.అభిషేక్త కిశోర్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది.

నాకంటే నాకే.. నామినేటెడ్!

- పదవుల కోసం వేలల్లో దరఖాస్తులు
- ఇప్పటి వరకు టీడీపీ నుంచే 30 వేల మంది నేతల నుంచి అందిన వినతులు
- మరోవైపు కూటమి పార్టీల ఎదురుచూపు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నామినేటెడ్ పదవుల కోసం నేతలు కుస్తీలు పడుతున్నారు. 'నాకంటే నాకే' ఇవ్వాలంటూ పోటీ పడుతున్నారు. ముఖ్యంగా టీడీపీ నుంచి వినతుల పరంపర ఎక్కువగా ఉంది. మరోవైపు కూటమి పార్టీలు కూడా పదవుల పంపకంపై ఆశగా ఎదురు చూస్తున్నాయి.



టీడీపీ నేతృత్వంలోని కూటమి సర్కారు ఏర్పడిన తర్వాత నామినేటెడ్ పదవుల కోసం పోటీ భారీగా పెరిగింది. ముఖ్యంగా తెలుగు తమ్ముళ్లు పదవుల కోసం ఉవ్విళ్లూరుతున్నారు. 'నాకంటే నాకే' అంటూ పోటాపోటీగా పార్టీ అధిష్ఠానానికి దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరిలో టీడీపీ నాయకులు, సీనియర్ కార్యకర్తలు లెక్కకు మిక్కిలిగా ఉన్నారు. వేల సంఖ్యలో వస్తున్న ఈ దరఖాస్తులు పార్టీ అధినాయకత్వానికి ఎటూ పాలుపోని పరిస్థితిని కల్పిస్తున్నాయి. నామినేటెడ్ పదవుల కోసం ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు సుమారు 30 వేలకు పైగా ఉన్నాయని సమాచారం. సీఎం చంద్రబాబు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన ప్రతిసారీ వందల సంఖ్యలో దరఖాస్తులు అదనంగా వచ్చి చేరుతున్నాయి. మంత్రులు, పార్టీ నేతలు నిర్వహిస్తున్న వినతుల స్వీకరణ కార్యక్రమంలో కూడా కొందరు పార్టీ నేతలు ఈ పదవులపై దరఖాస్తులు ఇస్తున్నారు. టీడీపీ అధినాయకత్వం సేకరించిన సమాచారం ప్రకారం.. భర్తీ చేయడానికి అవకాశం ఉన్న కార్పొరేషన్లు, ఫెడరేషన్లు, ఇతర సంస్థల్లోని చైర్మన్లు, పాలక మండలి సభ్యుల పదవులు అన్నీ కలిపి 2 వేలలోపే ఉన్నాయి. వీటిలో చైర్మన్ పదవులు సుమారుగా 150 వరకు ఉంటే పాలక మండలి సభ్య పదవులు 1500-1800 వరకు ఉంటాయి. వీటిలో కొన్నింటిని కూటమి మిత్ర పక్షాలకు పంచాల్సి ఉంటుంది. అంతర్గత ఒప్పందం ప్రకారం మొత్తం నామినేటెడ్ పదవుల్లో జనసేన, బీజేపీలకు 20 శాతం ఇవ్వడానికి అంగీకారం కుదిరిందని ఆయా పార్టీల వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. నామినేటెడ్ పదవుల తొలి జాబితాలో కొన్ని మిత్రపక్షాలకు ఇచ్చారు. మొత్తం 20 కార్పొరేషన్లలో పదవులు భర్తీ చేస్తే వీటిలో 3 సంస్థల చైర్మన్ పదవులను జనసేనకు, 1 బీజేపీకి దక్కాయి. ఇదిలావుంటే, పదవులు తక్కువ ఉండి.. ఆశిస్తున్న వారు వేల సంఖ్యలో ఉండటంతో ఎలా సర్దుబాటు చేయాలన్నది అధిష్ఠానానికి సవాలుగా మారింది.

చైర్మన్ పదవి కోసం పట్టు

గతంలో ఎన్నడూ లేని స్థాయిలో ఈసారి పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు చైర్మన్ పదవులను ఆశిస్తున్నారు. వాటిని దక్కించుకునేందుకు పార్టీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఏదో ఒకటి ఇచ్చి నేతలను సంతృప్తి పరచాలన్న ప్రయత్నంలో మొదటి జాబితాలో కొందరు నేతలకు డైరెక్టర్ల పదవులు ఇచ్చారు. మాజీ మంత్రి పర్సా రత్నం, మాజీ ఎమ్మెల్యేలు గద్దె బాబూరావు, వంతల రాజేశ్వరి, చిల్లా జగదీశ్వరి వంటివారు డైరెక్టర్ల పదవులు పొందారు. శిష్టా లోహిత్, సప్తగిరి ప్రసాద్ వంటి కొందరు నేతలు తమకు డైరెక్టర్ల పదవులు అవసరం లేదని పార్టీ నాయకత్వానికి లేఖలు రాశారు.

దక్కేది వీరికే!

నామినేటెడ్ పదవుల కోసం వచ్చిన దరఖాస్తులపై టీడీపీ అధిష్ఠానం వివిధ మార్గాల్లో వడపోత చేపట్టింది. ప్రతిపక్షంలో ఉండగా బాగా పనిచేసిన వారు, కేసుల్లో ఇరుక్కొని దాడులకు గురైన వారు, జైళ్లకు వెళ్లినవారు, ఆస్తులు నష్టపోయిన వారిని ఎంపిక చేసి వారికి పదవుల్లో చోటు కల్పించాలని భావిస్తోంది. సుదీర్ఘకాలంగా పార్టీలో పనిచేస్తూ ఇంత వరకు అవకాశాలు రానివారు కూడా ఈసారి తమకు ఇవ్వాలని కోరుతున్నారు. "నామినేటెడ్ పదవులు కోరుతున్న వారంతా అర్హులే. ఎవరి శ్రమనూ పక్కన పెట్టలేం. కాకపోతే భర్తీ చేయడానికి అన్ని పదవులు లేవు. దీంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కొంత మందికి అవకాశం కల్పించాలని భావిస్తున్నాం. జడ్పీటీసీలు, ఎంపీపీ అధ్యక్షులు, ఎంపీటీసీలు, మేయర్లు, మునిసిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సహకార సంఘాల అధ్యక్షులు, సర్పంచులు వంటి పదవుల్లో వేల మందికి అవకాశాలు లభిస్తాయి. ఏదో రకంగా అందరినీ సర్దుబాటు చేయాలన్న ప్రయత్నంలో ఉన్నాం" అని టీడీపీ ముఖ్య నేత ఒకరు చెప్పారు. నామినేటెడ్ పదవుల భర్తీకి సంబంధించి టీడీపీ అధిష్ఠానం అన్ని కోణాల్లోనూ కసరత్తు చేస్తోంది. ప్రాంతాలు, సామాజిక వర్గాలు, మహిళలు, యువత వంటి అన్ని వర్గాలకు వీటిలో చోటు కల్పించాలని నిశ్చయించారు.

బీమా బూచోడు ఔట్!

- ఏపీజీఐసీఎల్ కన్సల్టెంట్ సుజిత్‌పై వేటు
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన
- కమీషన్ల దందా విచారణపై ఇంకా మౌనమే!

అమరావతి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో బీమా దందాలకు పాల్పడిన ఆంధ్రప్రదేశ్ జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీజీఐసీఎల్) కన్సల్టెంట్ ఎస్.సుచిత్‌పై వేటుపడింది. ఆయన్ను తొలగిస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. బీమా అవసరం ఉన్న ప్రభుత్వ శాఖలన్నిటినీ తన గుప్పిట్లోకి తెచ్చుకుని.. నిబంధనలకు అనుగుణంగా పనిచేసే ప్రభుత్వరంగ సంస్థ (పీఎస్‌యూ)ల్లోని బీమా కంపెనీలను దూరంగా పెట్టి.. సొంత బ్రోకరేజీ ఏజెన్సీలను తెరపైకి తెచ్చి కమీషన్లు దండుకోవడంలో కీలక పాత్ర పోషించిన సుజిత్‌కు పాత ప్రభుత్వంలోనే కాదు.. కూటమి ప్రభుత్వంలోనూ గాడ్‌ఫాదర్లు ఉన్నారు. ప్రస్తుత కేబినెట్‌లోని ఒక మంత్రి పీఎస్ కూడా అతడి దందాకు వెసులుబాటు కల్పించారు. రూ.వందల కోట్ల ప్రీమియం కట్టిస్తూ పదుల కోట్లలో కమీషన్లు జేబులో వేసుకుంటూ ప్రభుత్వ ఖజానాకు నేరుగా చిల్లు పెడుతున్న సుజిత్‌పై 'బీమా బూచోడు' శీర్షికన గత బుధవారం (అక్టోబరు 30న) 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతో ఏపీజీఐసీఎల్ నుంచి సుజిత్‌ను తొలగిస్తూ ఆర్థిక శాఖ అధికారికంగా ఆదేశాలిచ్చింది. కానీ బ్రోకరేజ్ కంపెనీలను తెచ్చి కమీషన్ల పేరుతో వందల కోట్లు దోచుకుని, ప్రస్తుత ప్రభుత్వంలోనూ వందల కోట్ల కమీషన్ దోపిడీకి ఏర్పాట్లు చేసుకున్న అతడిపై విచారణ చేయాలా వద్దా అన్న సందిగ్ధం కొనసాగుతోంది. అతడిని ఉద్యోగం నుంచి తీసేసినా.. నాయకులు, ఐఏఎస్‌లు ఇంకా ప్రేమ చూపిస్తూనే ఉన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని బీమా విధానంలో అమలుచేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనికోసం బీమా కంపెనీలతో చర్చలు జరుపుతోంది. ప్రభుత్వ రంగంలో ఉన్న ఇన్సూరెన్స్ కంపెనీలను కాదని 'గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ'తో ఒప్పందం కుదుర్చుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. ఆయా సమావేశాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో పాటు సుజిత్ కూడా పాల్గొన్నాడు. ఆరోగ్యశ్రీని బీమా విధానంలో అమలుచేయాలంటే రూ.4,000కోట్ల ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని అంచనా. థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేటర్ ఫీజు, కమీషన్లు కలుపుకొని 10 శాతం ఉంటాయని సమాచారం. అంటే దాదాపు రూ.400 కోట్లు. పీఎస్‌యూ బీమా కంపెనీలతో నేరుగా ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంటే ఈ కమీషన్ల భారం తగ్గుతుంది. ఇప్పుడు సుజిత్‌ను ఉద్యోగం నుంచి తొలగించిన నేపథ్యంలో ఈ పథకంలో మార్పులేమైనా జరుగుతాయేమో చూడాలి.

84 వేలకోట్ల పెట్టుబడులు.. 5 లక్షల ఉద్యోగాలు

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించినట్లు తెలిపింది. ఐటీ పార్కులకు సరిపడేంత విద్యుత్, నీరు సరఫరా చేస్తామని పేర్కొంది. ప్రాజెక్టుల ప్రారంభానికి ఎలాంటి అవరోధాలు లేకుండా, సత్వర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించింది. ఎలక్ట్రానిక్స్ పాలసీ అమలుపై ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పాలసీ ప్రకారం.. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే సంస్థలకు సింగిల్ విండో విధానం ద్వారా 21 రోజుల్లో అనుమతులు మంజూరు చేస్తారు. ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఈడీబీ)తో సమన్వయం చేస్తూ పెట్టుబడులకు సానుకూల వాతావరణం కల్పిస్తారు. విదేశీ పెట్టుబడిదారులకు ప్రత్యేక చేయూతనిస్తూ సహకారం అందిస్తారు. ఇంటిగ్రేటెడ్ డేటా మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను అమలు చేస్తారు. రూ.50 కోట్ల నుంచి 200 కోట్ల దాకా సబ్‌లార్జ్ ప్రాజెక్టులుగా, రూ.200 కోట్ల నుంచి 1000 కోట్ల దాకా లార్జ్ ప్రాజెక్టులు, రూ.1000 కోట్ల నుంచి 5,000 కోట్ల దాకా మేజర్ ప్రాజెక్టులు, రూ.5,000 కోట్లు దాటితే అల్ట్రా మెగా ప్రాజెక్టులుగా ప్రభుత్వం గుర్తిస్తుంది. ఈ మేరకు ప్రోత్సాహకాలు కూడా నిర్దేశిస్తుంది. ఐదు సమాన వాయిదాల్లో 25 శాతం క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీని అందిస్తుంది. ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా సబ్సిడీలు ఉంటాయి. ఐదేళ్ల పాటు యూనిట్ రూపాయికే విద్యుత్తును అందిస్తారు. స్టాంపు డ్యూటీలో మినహాయింపు ఉంటుంది. ఉద్యోగుల ప్రోత్సాహకాల్లో భాగంగా ప్రతినెలా ప్రతి పురుష ఉద్యోగికి రూ.4,000, ప్రతి మహిళా ఉద్యోగికి రూ.6,000 చొప్పున ఆరు నెలలపాటు చెల్లిస్తారు.

ఇండస్ట్రియల్ నోడ్‌లు

ఐటీ, ఎలక్ట్రానిక్స్ పార్కుల్లో సమర్థ యాజమాన్య నిర్వహణను కల్పిస్తామని ప్రభుత్వం వెల్లడించింది. రవాణా వ్యయాలు తగ్గేలా పోర్టులు, విమానాశ్రయాలు, రహదారుల సదుపాయాలు రాష్ట్రంలో ఇప్పటికే ఉన్నాయని పేర్కొంది. విశాలమైన భూములు, మౌలిక సదుపాయాలతో కూడిన ఇండస్ట్రియల్ నోడ్‌లను అందుబాటులోకి తెస్తున్నామని పాలసీలో పేర్కొంది. ఉత్పత్తి రంగానికి చెందిన క్లస్టర్లకు అత్యుత్తమ లాజిస్టిక్ ఇన్‌ఫ్రా అందుబాటులో ఉందని వెల్లడించింది. విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్, హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపింది.

రేపు బంగాళాఖాతంలో ఆవర్తనం

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ నెల ఐదో తేదీన ఉపరితల ఆవర్తనం ఆవరించనుంది. దీని ప్రభావంతో ఆరు, ఏడు తేదీల్లో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. ఆ తరువాత తమిళనాడుతోపాటు రాయలసీమ, దక్షిణ కోస్తాలో వర్షాలు పెరుగుతాయని పేర్కొన్నారు. కాగా రాష్ట్రంలో ఆదివారం ఎండతీవ్రత కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. అత్యధికంగా నర్సాపురంలో 35 డిగ్రీలు నమోదైంది. అలాగే పలుచోట్ల ఉరుములతో వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా ఉరుములతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

9 హైస్పీడ్ కారిడార్లు!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రాల్లో ఒక్క రోడ్డు లేకపోవడం గమనార్హం. హైస్పీడ్ కారిడార్లలో ఆంధ్రప్రదేశ్‌కు 9, తెలంగాణకు 6-7 (తెలంగాణ మీదుగా ఏపీకి కొన్ని రోడ్లున్నాయి) రానున్నాయి. ఏపీలో పోర్టు కనెక్టివిటీ రోడ్లు 8 వరకు ఉన్నాయి. ఇక పట్టణ ప్రాంతాల్లోని ఇరుకు రోడ్లను వెడల్పు చేసే ప్రాజెక్టులు ఏపీలో 04, తెలంగాణలో 3 చోట్ల ఉన్నాయి. మిస్సింగ్ లింక్, అధిక రద్దీ ఉన్న ప్రాంతాల్లో చేపట్టే రహదారుల నిర్మాణాల ప్రాజెక్టుల్లో ఏపీకి 07, తెలంగాణకు 4 చొప్పున ఉన్నాయి. ఈ ప్రాజెక్టులన్నింటినీ రెండు దశల్లో నిర్మించనున్నారు. కేంద్ర క్యాబినెట్‌లో ఈ ప్రాజెక్టులకు ఆమోదం లభించిన తర్వాత నిర్మాణ వ్యయం, భూ సేకరణ, రూట్ మ్యాప్‌లపై స్పష్టత రానుంది.

రెండు దశల్లో నిర్మాణాలు..

దేశవ్యాప్తంగా ఎక్కడెక్కడ ఎలాంటి రోడ్లను నిర్మించాలి? ఏయే రాష్ట్రాల గుండా హైస్పీడ్ కారిడార్ల నిర్మాణాలు చేపడితే బాగుంటుంది? వంటి అంశాలపై సర్వే చేసే బాధ్యతల్ని కేంద్రం ఓ సంస్థకు అప్పగించింది. ఆ సంస్థ ప్రాథమిక సర్వే నిర్వహించి.. దేశంలోని పలు రాష్ట్రాలు, జిల్లాల మీదుగా నిర్మించాల్సిన హైస్పీడ్ కారిడార్లు, పోర్టులకు కనెక్టివిటీలు, జిల్లా కేంద్రాలు, పర్యాటక ప్రదేశాల నుంచి గ్రీన్‌ఫీల్, హైస్పీడ్ కారిడార్లకు అనుసంధానం చేసే ఫీడర్ రోడ్లతో పాటు స్ట్రాటజిక్, ఇంటర్నేషనల్ కనెక్టివిటీ రోడ్లకు సంబంధించిన నివేదికను కేంద్రానికి అందించింది. దాని ప్రకారం.. హైస్పీడ్ కారిడార్లు తొలి దశలో 18 వేల కి.మీ., రెండో దశలో 20 వేల కి.మీ. కలిపి 39 వేల కి.మీ., ఫీడర్లు, స్పర్ రోడ్లు 6 వేల కి.మీ., పోర్టు కనెక్టివిటీ రోడ్లు 2,500 కి.మీ., పట్టణ ప్రాంతాల్లో ప్రస్తుతమున్న రోడ్ల వెడల్పుకు సంబంధించి 4 వేల కి.మీ., స్ట్రాటజిక్, ఇంటర్నేషనల్ రోడ్ల కింద దాదాపు 3 వేల కి.మీ., ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్న చోట, హైవేల్లో మిస్సింగ్ లింక్‌ల కింద దాదాపు 2 వేల కిలోమీటర్లు కలిపి దేశవ్యాప్తంగా రెండు దశల్లో 59 వేల కిలోమీటర్లను నిర్మించాల్సి ఉందని నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. అయితే ప్రస్తుత ట్రాఫిక్, భవిష్యత్తులో పెరగబోయే రద్దీని దృష్టిలో పెట్టుకొని దీన్ని రూపొందించారు. ఈ ప్రాజెక్టుల పనులు వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ప్రారంభించాలని, అనంతరం ఏటా ఆయా పనులకు అవసరమైన అనుమతులు ఇస్తూ నిర్మాణాలను చేపట్టాలని, మొత్తంగా 2047 నాటికి వీటిని పూర్తి చేయాలని ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు.

ఏపీకి రాబోయే ప్రాజెక్టులు

- హైదరాబాద్- బెంగళూరు వరకు ఒకటి. ఏపీలో 261 కి.మీ., కర్ణాటకలో 65 కి.మీ., తెలంగాణలో 190 కి.మీ. మేర కింద నిర్మాణం కానుంది.
- ఖరగ్‌పూర్- కటక్- విశాఖపట్నం వరకు బెంగాల్, ఒడిశా మీదుగా ఏపీకి రానుంది. మొత్తం 783 కి.మీ. కాగా, ఏపీలో 179 కి.మీ. ఉండనుంది.
- తెలంగాణలోని నల్లగొండ జిల్లా చౌటుప్పల్ ఎన్‌హెచ్-65 నుంచి విజయవాడ మీదుగా మచిలీపట్నం వరకు ఒకటి; మొత్తం 140 కి.మీ.
- వైజాగ్- కాకినాడ- రామేశ్వరం- విజయవాడ- గుంటూరు- ఒంగోలు వరకు ఒకటి. ఏపీ పరిధిలో 335 కి.మీ.తో అతిపెద్ద హై స్పీడ్ కారిడార్.
- నాగపూర్-కాకినాడకు ఒక కారిడార్. ఇది ఒడిశాలో మొదలై మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ మీదుగా ఏపీకి అనుసంధానం కానుంది. మొత్తం 696 కి.మీ. ఉండగా, ఏపీలో 113 కి.మీ. నిర్మాణం కానుంది.
- హైదరాబాద్-చెన్నై మార్గంలోనూ ఏపీలో 400 కిలోమీటర్ల మేర నిర్మాణం కానుంది.
- కర్నూలు- కడప- తిరుపతి (బెంగళూరు-చెన్నై మార్గంలో భాగం) ఒకటి. ఇది ఏపీ పరిధిలో దాదాపు 377 కి.మీ. ఉండనుంది.

పోర్టు కనెక్టివిటీలు..

- కాకినాడ పోర్టు నుంచి ఉప్పాడ బీచ్ వరకు 41 కి.మీ. 4 లేన్ల రోడ్డు నిర్మాణం.
- నెల్లూరు సిటీ నుంచి కృష్ణపట్నం పోర్టు వరకు 22 కి.మీ. మేర 4 లేన్ల రోడ్డు.
- గంగవరం పోర్టు నుంచి తంగలం వరకు 7 కి.మీ. మేర రోడ్డు నిర్మాణం.
- సూళ్లూరుపేట- మోమిడి వరకు 62 కి.మీ. మేర ఒక రోడ్డు.
- గుంటూరు- నారకోడూరు- తెనాలి- చందోల్- నిజాంపట్నం వరకు 31 కి.మీ. మేర రహదారి.
- భావనపాడు పోర్టు నుంచి ఖారాపూర్- విశాఖపట్నం రోడ్డుకు, రామాయపట్నం పోర్టు నుంచి హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ కారిడార్‌కు కనెక్టింగ్ రోడ్లు. (వీటిని స్పర్ రోడ్లు అంటారు.) వీటితో పాటు పట్టణ ప్రాంతాల్లో ఇరుకు రోడ్లను వెడల్పు చేసే ప్రాజెక్టులు కూడా నివేదికలో ఉన్నాయి.

తెలంగాణకు రాబోయే హైస్పీడ్ కారిడార్‌లు

- హైదరాబాద్- రాయపూర్ వరకు ఒకటి. ఇది ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర మీదుగా రానుంది. మొత్తం 429 కిలోమీటర్లు ఉండగా తెలంగాణలో 165 కి.మీ. నిర్మాణం కానుంది.
- నాగపూర్-హైదరాబాద్‌కు ఒకటి. ఇది తెలంగాణలో 297 కి.మీ. మేర నిర్మాణం కానుంది.
- హైదరాబాద్- విశాఖపట్నం వరకు ఒక రోడ్డు ఉండగా ఇది రాష్ట్రంలో 244 కి.మీ. మేర ఉండనుంది.
- పూణె-సోలాపూర్-సంగారెడ్డి వరకు ఒక కారిడార్. ఇది మహారాష్ట్ర నుంచి తెలంగాణకు రానుంది. మొత్తం 403 కి.మీ. ఉండగా, రాష్ట్రంలో 72 కి.మీ. నిర్మాణం జరగనుంది.

రాబందుల్లా చేరి.. రాజకీయాలు చేయొద్దు!

- ప్రతిపక్షంపై హోంమంత్రి అనిత ఆగ్రహం
- చిన్నారిపై హత్యాచార ఘటన దురదృష్టకరం
- నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు
- బాధిత కుటుంబానికి పరామర్శ
- ప్రభుత్వం తరపున రూ.10 లక్షల చెక్కు అందజేత



తిరుపతిలో మీడియాతో మాట్లాడుతున్న హోంమంత్రి వంగలపూడి అనిత

పుత్తూరు అర్బన్/రేణిగుంట/తిరుపతి (నేరవిభాగం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మూడున్నరేళ్ల చిన్నారిపై హత్యాచార ఘటన దురదృష్టకరమని హోంమంత్రి అనిత అన్నారు. ఆదివారం తిరుపతి జిల్లా వడమాలపేట మండలంలోని ఎస్టీ కాలనీకి చేరుకున్న ఆమె.. బాధిత చిన్నారి కుటుంబాన్ని పరామర్శించారు. నిందితుడికి మూడు నెలల్లో కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.10 లక్షల చెక్కును బాధిత తల్లిదండ్రులకు అందజేశారు. అనంతరం మంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. ఇలాంటి ఘటనలను సీఎం చంద్రబాబు ఉపేక్షించబోరని పేర్కొన్నారు. నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి సొంతిల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఘటనను ప్రతిపక్షం రాజకీయం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ హయాంలో మద్యం ఏరులై పారిందని విమర్శించారు. ఏదైనా ఘటన జరిగితే రాబందుల్లా చేరి రాజకీయాలు మాట్లాడటాన్ని దేవుడు కాదు కదా ప్రజలు కూడా క్షమించరని అన్నారు. మంత్రి వెంట చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు ఉన్నారు. అంతకు ముందు తిరుపతి విమానాశ్రయంలో మంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో యువత, చిన్న పిల్లలు గంజాయి, మద్యానికి బానిసలవుతున్నా పట్టించుకోలేదని విమర్శించారు. తమ కూటమి ప్రభుత్వం నాలుగు నెలల్లోనే రాష్ట్రవ్యాప్తంగా గంజాయి అక్రమ రవాణా, వినియోగాన్ని అదుపు చేసిందని పేర్కొన్నారు. ప్రత్యేకంగా నార్కోటిక్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు.

జగన్ కోసమే రుషికొండ ప్యాలెస్

- వైసీపీ పాలనలో పోలీసు వ్యవస్థ భ్రష్టు: హోంమంత్రి

'జగన్ కోసమే రుషికొండ ప్యాలెస్‌ను రూ.430 కోట్ల ఖర్చుతో నిర్మించారు. అందులో కనీసం రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్లను పోలీసు వ్యవస్థకు అవసరమైన మౌలిక వసతులు, సీసీ కెమెరాల ఏర్పాటు, ఫోరెన్సిక్ ల్యాబ్‌ల బలోపేతం, ఫింగర్ ప్రింట్ వ్యవస్థకు అవసరమైన టెక్నాలజీ కోసం ఖర్చు చేసుంటే.. ఈ రోజు నేరాల కట్టడికి ఎంతగానో ఉపయోగపడేవి. ఆ దిశగా ఆలోచించకుండా ప్రజాధనాన్ని ఇష్టమొచ్చినట్లు దుబారా చేశారు' అని హోం మంత్రి అనిత విమర్శించారు. తిరుపతిలో ఆదివారం రాత్రి అనంతపురం డీఐజీ షిమోషి, రాష్ట్ర శాంతి భద్రతల ఐజీ శ్రీధర్, తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్పీలు, ఇతర పోలీసు అధికారులతో ఆమె సుదీర్ఘంగా సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గంజాయి నిర్మూలన, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలను సీరియస్‌గా తీసుకున్నామన్నారు. నేరాల కట్టడికి అత్యాధునిక టెక్నాలజీ వాడకం కోసం సీసీ కెమెరాలు, డ్రోన్ల ఏర్పాటుకు జిల్లాల వారీగా పోలీసు శాఖ నుంచి ఇండెంట్లు తీసుకుంటున్నట్లు చెప్పారు. గంజాయి రవాణా కట్టడి కోసం రైల్వే శాఖతో సమన్వయం చేసుకుని ముందుకు వెళుతున్నామని తెలిపారు. నేరస్థులు, స్మగ్లర్లలో దడ పుట్టించి.. నేరం చేయాలంటేనే భయపడేలా చర్యలు తీసుకుంటున్నట్లు అనిత చెప్పారు.

చంద్రబాబు, పవన్‌పై అసభ్య పోస్టులు

- ఒకేరోజు 45 సైబర్ ఎఫ్ఐఆర్‌లు నమోదు.. పోలీసుల అదుపులో 8 మంది

విజయవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ లక్ష్యంగా అసభ్య పోస్టులపై ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా పోలీసులు శనివారం రాత్రి 45 సైబర్ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. కొద్దిరోజులుగా చంద్రబాబు, పవన్, బాలకృష్ణతో పాటు పవన్ కుమార్తెలపైనా కొందరు 'ఎక్స్'లో అసభ్య పదజాలంతో పోస్టింగులు పెడుతున్నారు. దీనిపై టీడీపీ, జనసేన నేతలు ఫిర్యాదు చేశారు. శనివారం ఈ ఫిర్యాదులు మరింత పెరిగాయి. కేసులు నమోదు చేయాలని పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. ఈ మొత్తం కేసులను సైబర్ క్రైం పోలీసులకు బదిలీ చేసే అవకాశం ఉంది. వేర్వేరు అకౌంట్లలో ఈ వ్యాఖ్యలు కనిపిస్తుండడంతో వీటిని నిర్వహిస్తున్నదెవరు, పోస్టు చేస్తున్నదెవరు తదితర అంశాలపై ఒక బృందం దర్యాప్తు చేస్తోంది. 8 మందిని ఇప్పటి వరకు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారిలో ఎక్కువమంది వైసీపీ సానుభూతిపరులేనని తెలిసింది. చంద్రబాబు కుటుంబసభ్యులపై వ్యాఖ్యలు చేసిన ఫిర్యాదుపై నున్న పోలీస్ స్టేషన్‌లో కొద్దిరోజుల క్రితం నమోదైన కేసులో పోలీసులు పురోగతి సాధించినట్టు తెలుస్తోంది. ఎక్స్‌లో పోస్టింగ్ చేసిన ఖాతాను ఐపీ అడ్రస్ ఆధారంగా గుర్తించినట్టు సమాచారం. దాని ఆధారంగా నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

అధికారి కాదు.. కార్యకర్త!

- రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి సత్యనారాయణపై కేంద్రానికి బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ ఫిర్యాదు
- పరిశీలించాలంటూ రాష్ట్రానికి డీవోపీటీ ఆదేశాలు
- ఫైలు సిద్ధం చేసిన పాలనా విభాగం
- బయటపడేందుకు సత్యనారాయణ యత్నాలు
- తనను రిలీవ్ చేయాలని సీఎస్‌కు లేఖ



అమరావతి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీస్ (ఐఆర్ఏఎస్) అధికారి, రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణపై విచారణకు రంగం సిద్ధమైంది. జగన్ ప్రభుత్వ హయాంలో ఆయన వైసీపీ నేతలకు నిధులు దోచిపెట్టారని, ప్రభుత్వ అధికారిలా కాకుండా వైసీపీ కార్యకర్తలా వ్యవహరించారని ఆరోపిస్తూ.. బీజేపీ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ కేంద్ర సిబ్బంది-శిక్షణ శాఖ (డీవోపీటీ)కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై ఆ శాఖ స్పందించి.. పరిశీలించాలని రాష్ట్ర సాధారణ పరిపాలన విభాగాన్ని (జీఏడీ) ఆదేశించింది. ఈ మేరకు జీఏడీలో ఫైలు సిద్ధమైంది. దీంతో తనను తక్షణమే రిలీవ్ చేయాలని కోరుతూ సత్యనారాయణ గత నెల 29వ తేదీన రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌ను కోరారు. రాష్ట్రంలో 2019-24 మధ్యకాలంలో బిల్లుల చెల్లింపు పేరుతో వేల కోట్ల రూపాయలను వైసీపీ నేతలకు, జగన్ చెప్పిన వారికి నిబంధనలకు విరుద్ధంగా పందేరం చేశారని రమేశ్ తన ఫిర్యాదులో ఆరోపించారు. 'మొదట నమోదైన బిల్లులకు మొదటే చెల్లింపులు జరపాలన్న ఫిఫో నిబంధనలను ఆయన ఉల్లంఘించారని, దీంతో జగన్ హయాంలో చెల్లింపుల విధానాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో 4 లక్షల పిటిషన్లు నమోదయ్యాయని తెలిపారు. భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) ద్వారా రాష్ట్రప్రభుత్వం బాండ్లు వేలం వేసి తెచ్చిన రూ.4,000 కోట్ల అప్పును వైసీపీ నేతల బినామీ కాంట్రాక్టర్లకు చెల్లించేందుకు సత్యనారాయణ వాటిని దారి మళ్లించారని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలిచి చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన రోజున కూడా కోర్టుల్లో అమరావతికి వ్యతిరేకంగా, జగన్ కేసుల్లో ఆయన తరఫున వాదించిన లాయర్లకు సత్యనారాయణ బిల్లులు చెల్లించారని.. ఈ ఉల్లంఘనలన్నింటికీ సత్యనారాయణే కారణమని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి ఇన్ని ఆర్థిక అక్రమాలకు కారణమైన సత్యనారాయణపై గట్టి చర్యలు తీసుకోవాలని రమేశ్ డీవోపీటీ అడ్మిన్ డైరెక్టర్‌ను కోరారు.

మాతృ శాఖకు వెళ్లిపోతా: సత్యనారాయణ

ఇంకోవైపు.. తన డిప్యుటేషన్ గడువు ముగిసిపోయినందున.. తిరిగి మాతృశాఖలో చేరేందుకు తక్షణమే తనను రిలీవ్ చేయాలని కోరుతూ కేవీవీ సత్యనారాయణ సీఎస్‌కు లేఖ రాశారు. రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై వచ్చి జూన్ 18వ తేదీ నాటికే ఐదేళ్లు పూర్తయిందని వెల్లడించారు. కానీ తమ అనుమతి లేకుండా సత్యనారాయణను రిలీవ్ చేయకూడదని జీఏడీ గతంలో ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో సత్యనారాయణ ఇంకా ఇక్కడే కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శికి ఓఎస్డీగా ఉన్నారు. తాను నాటి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగానే పనిచేశానని ఆయన చెబుతున్నారు. కానీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత, సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన రోజున కూడా ఆయన వైసీపీ నేతలకు బిల్లులు చెల్లించారు. దీనికి ఆయన గత ప్రభుత్వ పెద్దలను బాధ్యులను చేయలేరు. అందుకే డీవోపీటీ ఆదేశాల మేరకు రాష్ట్రప్రభుత్వం తనపై విచారణకు నిర్ణయం తీసుకునేలోపే బయటపడేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

షుగర్ ఉన్నా లేనట్టే!

రక్తంలో చక్కెర స్థాయుల ఆధారంగా పని చేసే స్మార్ట్ ఇన్సులిన్

ఇన్సులిన్ హార్మోన్‌లో రెండు చోట్ల మార్పులు చేయడం ద్వారా 'ఎన్ఎన్‌సీ 2215' అభివృద్ధి

యూకే, డెన్మార్క్ 'ఫార్మా' శాస్త్రవేత్తల ఘనత

భారతదేశానికి 'మధుమేహ రాజధాని' అనే పేరుంది! ప్రపంచవ్యాప్తంగా ఉన్న చక్కెర వ్యాధి బాధితుల్లో 17 శాతం మంది మనోళ్లే! తాజా గణాంకాల ప్రకారం దేశంలో నమోదైన షుగర్ పేషెంట్ల సంఖ్య 8 కోట్లు. 2045 నాటికి రికార్డుల్లో ఉన్న లెక్కల ప్రకారమే భారత్‌లో మధుమేహుల సంఖ్య 13.5 కోట్లు దాటుతుందని అంచనా. దీనిబారిన పడితే.. కడుపు నిండా తినడానికి ఉండదు! ఎంతో ఇష్టమైన స్వీట్లపై మనసు చంపుకోవాల్సిందే!! పదేపదే దాహం వేస్తుంటుంది. మంచినీళ్లు ఎక్కువగా తాగేయడం వల్ల మాటిమాటికీ మూత్రవిసర్జన చేయాల్సి వస్తుంది. క్రమంగా బరువు తగ్గిపోతారు. దీర్ఘకాలం పాటు షుగర్‌తో బాధపడేవారి శరీరంలో ఇతర అవయవాలపైనా ప్రభావం పడుతుంది. కళ్లు దెబ్బతింటాయి. కిడ్నీల పనితీరు మందగిస్తుంది!! కొంచెంకొంచెంగా ప్రాణాలుతీసే ఈ తియ్యటి జబ్బుకు కళ్లాలు వేసి దాని జోరు తగ్గించేది ఇన్సులిన్. కానీ.. ఇన్సులిన్ మోతాదు ఎక్కువ తక్కువ అయితే దానివల్ల వేరే దుష్ప్రభావాలుంటాయి. ఎందుకంటే.. రక్తంలో చక్కెర స్థాయులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. షుగర్ లెవల్స్ తక్కువగా ఉన్నప్పుడు.. రోజువారీ రొటీన్‌గా ఇన్సులిన్ తీసుకుంటే.. చక్కెరస్థాయులు మరింతగా పడిపోయి హైపోగ్లైసీమియాకు దారితీయొచ్చు. కొన్నిసందర్భాల్లో అది ప్రాణాంతకం కూడా అవుతుంది. అందుకే.. షుగర్ లెవల్స్ ఆధారంగా తగు మోతాదులో ఇన్సులిన్ విడుదల అయ్యే/విడుదల చేసే పరిజ్ఞానంపై 1970ల నుంచి.. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలకు చెందిన శాస్త్రజ్ఞులు రకరకాల పరిశోధనలు చేస్తున్నారు. అందులో భాగంగానే.. డెన్మార్క్, యూకే తదితర దేశాలకు చెందిన ఫార్మా సంస్థల శాస్త్రజ్ఞులు మానవ ఇన్సులిన్ హార్మోన్‌లోని బీ29 (మాక్రోసైకిల్) ప్రాంతాన్ని, బీ1 (గ్లూకోసైడ్) ప్రాంతాన్ని మార్చడం ద్వారా.. రక్తంలోని చక్కెర స్థాయులకు అనుగుణంగా పనిచేసే ఇన్సులిన్ సంయోజకాన్ని తయారు చేశారు! దానికి 'ఎన్ఎన్‌సీ 2215' అని పేరు పెట్టారు. ఈ స్మార్ట్ ఇన్సులిన్‌లోని మాక్రోసైకిల్ భాగం రింగు ఆకారంలో ఉంటుంది. గ్లూకోసైడ్ మాలిక్యూల్ గ్లూకోజ్ తరహాలో ఉంటుంది. రక్తంలో చక్కెరస్థాయులు పడిపోయినప్పుడు గ్లూకోసైడ్ మాలిక్యూల్ వెళ్లి రింగ్ భాగానికి అతుక్కుంటుంది. అప్పుడు ఇన్సులిన్ పని చేయడం మానేస్తుంది. దీనివల్ల చక్కెరస్థాయులు తగ్గడం ఆగుతుంది. అదే రక్తంలో చక్కెరస్థాయులు ఎక్కువగా ఉన్నప్పుడు.. గ్లూకోసైడ్ స్థానాన్ని గ్లూకోజ్ భర్తీ చేస్తుంది. వెంటనే తగు మోతాదులో ఇన్సులిన్ పనిచేస్తుంది. షుగర్ లెవల్స్ సురక్షిత స్థాయులకు చేరుకుంటాయి. అయితే, ఇదంతా ప్రస్తుతానికి ప్రయోగాల దశలో ఉంది. కొన్ని సమస్యలు కూడా ఉన్నాయి. మనుషులపై పరీక్షలు పూర్తయి.. మార్కెట్లో అందుబాటులోకి రావడానికి మరికొంత కాలం పడుతుంది.హ్యూమన్ ట్రయల్స్ కూడా విజయవంతమవుతాయని, ఈ స్మార్ట్ ఇన్సులిన్ కూడా మన శరీరంలోని సహజ ఇన్సులిన్ అంత సమర్థంగా పనిచేస్తుందని దీని రూపకర్తలు నమ్మకంగా చెబుతున్నారు.

\- సెంట్రల్ డెస్క్

> "మధుమేహ బాధితులకు శుభవార్త. ఇన్సులిన్ డోసులో తేడాల కారణంగా రక్తంలో చక్కెర స్థాయులు పడిపోయే సమస్యకు చెక్ పెట్టే 'స్మార్ట్ ఇన్సులిన్'ను శాస్త్రజ్ఞులు అభివృద్ధి చేశారు. ఇంజెక్షన్ ఇవ్వగానే రక్తంలో కలిసిపోయి పని మొదలెట్టడం కాకుండా.. కాస్తంత ఆగి.. షుగర్ లెవల్స్ ఎలా ఉన్నాయో చూసి, తక్కువగా ఉంటే నిశ్శబ్దంగా ఉండి, ఎక్కువగా ఉంటే పని చేసే తెలివైన ఇన్సులిన్ అన్నమాట!! ఇది అందుబాటులోకి వస్తే.. బాధితులు చాలావరకూ సాధారణ జీవితం గడిపే అవకాశం ఉంటుంది."



మేం తప్పుకొంటాం!

108, 104ల నిర్వహణపై చేతులెత్తేసిన 'అరబిందో'

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'108 అంబులెన్సులు, 104 వాహనాల నిర్వహణ మేం చేయలేం. ఆ సేవల నుంచి మేం తప్పుకొంటాం. మా స్థానంలో ఈ రెండు సంస్థలకు సబ్-కాంట్రాక్ట్ ఇవ్వండి' అంటూ అరబిందో సంస్థ.. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవోకు లేఖ రాసింది. 108లు, 104ల నిర్వహణలో అరబిందో సంస్థ పూర్తిగా విఫలమైంది. ఉద్యోగులకు జీతాలు ఇవ్వకపోగా, వాహనల నిర్వహణను గాలికి వదిలేసింది. కనీసం వాహనాల మెయింటెనెన్స్ కూడా సక్రమంగా చేయడం లేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహించిన సమీక్షలో అరబిందో సంస్థ సేవలపై ముఖ్యమంత్రితోపాటు మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అయినప్పటికీ.. ఆ సేవల నుంచి తమను తప్పించాలని ఆ సంస్థ స్వయంగా లేఖ రాసి 40 రోజులైనా ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం ఆ సంస్థపై అలవిమాలిన ప్రేమ కనబరుస్తూనే ఉన్నారు. గత వైసీపీ పాలనలో ఆ సంస్థ టెండర్ దక్కించుకున్న సమయంలోనే అనేక ఆరోపణలు వచ్చాయి. అయినప్పటికీ ఆ సంస్థకే కోట్ల రూపాయల టెండరును కట్టబెట్టాలనే ఉద్దేశంతో నాటి ప్రభుత్వం నిబంధనలు పక్కన పెట్టింది. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులూ నిబంధనలను తుంగలో తొక్కి మరీ టెండర్‌ను ఆ సంస్థకు కట్టబెట్టారు. మళ్లీ వైసీపీ ప్రభుత్వమే వస్తుందనే ఉద్దేశంతో, ఇక తమకు ఎలాంటి ఇబ్బందీ ఉండదని భావించి ఒకేసారి ఏడేళ్లకు టెండర్‌ను ఆ సంస్థ దక్కించుకుంది. ఏపీఎంఎస్ఐడీసీ(ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) పిలిచే ఏ టెండర్ అయినా ఐదేళ్ల కాల పరిమితికి మాత్రమే ఇస్తారు. తర్వాత ఆ సంస్థ పని తీరును బట్టి ప్రభుత్వ అంగీకారంతో మరో రెండేళ్లు పొడిగించుకునే వెసులుబాటు కల్పిస్తారు. అరబిందో విషయంలో మాత్రం అడ్డగోలుగా ఒకేసారి ఏడేళ్లకు టెండర్ కట్టబెట్టారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారం కోల్పోయి, కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో ఇక తమ ఆటలు సాగవని భావించి.. సేవల నుంచి తప్పుకోవాలని ఆ సంస్థ నిర్ణయించుకుంది. ఆ మేరకు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవోకు సెప్టెంబరులో లేఖ రాసింది. తమ స్థానంలో జీవీ కంపెనీ, యునైటెడ్ బి హెల్త్‌కేర్ సంస్థలకు సబ్-కాంట్రాక్ట్ ఇవ్వాలని సూచించింది. దీనికోసం ఆర్ఎఫ్‌పీ(రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్) నిబంధనను లేఖలో ప్రస్తావించింది. ఆర్ఎఫ్‌పీలోని క్లాజ్ 6.23.13 సీ ప్రకారం సబ్‌కాంట్రాక్టుకు ప్రభుత్వం అనుమతివ్వాల్సి ఉంటుంది. దీనిపై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఇప్పటి వరకూ సమాధానం ఇవ్వలేదు. ఆ లేఖను ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లలేదు. అధికారులకు ఆ సంస్థతో పాత సంబంధాలు ఉన్నాయి. దీంతో ఆ సంస్థపై అలవిమాలిన ప్రేమను ప్రదర్శిస్తున్నారు. ఆ సంస్థపై ఈగను కూడా వాలనీయడం లేదు. లేఖను బయటకు రానివ్వకుండా తొక్కిపెట్టేశారు.

లేఖ వెనుక భారీ స్కెచ్..

సేవలు చేయలేకపోతే తప్పుకోవాలి కానీ, ఎవరికి సబ్-కాంట్రాక్ట్ ఇవ్వాలో ఆ సంస్థ సూచించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీని వెనుక భారీ స్కెచ్ ఉన్నట్లు తెలుస్తోంది. బయటకు మాత్రం సేవల నుంచి తప్పుకొన్నట్లు చూపిస్తూనే.. తమ సంస్థకే చెందిన కంపెనీలకు ఆ బాధ్యతలు అప్పగించేలా స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. దీనికి ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు అండదండలు అందిస్తున్నట్లు సమాచారం. దీనిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

జీతాలివ్వకుండా ఉద్యోగులకు నరకం...

అరబిందో సంస్థ దెబ్బకు 108 అంబులెన్స్, 104 వాహనాలు, 102(తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్) ఉద్యోగులు నరకం అనుభవిస్తున్నారు. ఈ మూడు పథకాల కింద వాహనాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు రెండు, మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. దీంతోపాటు కొన్నేళ్ల నుంచి ఉద్యోగులకు వివిధ అలవెన్సుల కింద దాదాపు రూ.50 కోట్లను అరబిందో సంస్థ నిలిపివేసింది. దీంతో ఉద్యోగులంతా రోడ్డెక్కారు. తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులు ఇప్పటికే నిరసనలు చేస్తున్నారు. 108, 104 వాహనాల ఉద్యోగులు కూడా తాజాగా నిరసన నోటీసులు ఇచ్చారు.

సంజయ్ స్కామ్!

(మొదటి పేజీ తరువాయి)

అవగాహన కార్యక్రమం పేరిట మూడు లక్షలు ఖర్చు చేసి, రూ.1.16 కోట్లు స్వాహా చేశారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణలో తాజాగా ఈ దోపిడీ బట్టబయలైంది. 2023-24 బడ్జెట్‌లో సీఐడీ ఖర్చులకు రూ.32.44 కోట్లు కేటాయించారు. అట్రాసిటీ చట్టంపై ఎస్సీ, ఎస్టీలకు అవగాహన పెంచేందుకు ఇందులోనే అప్పటి ప్రభుత్వం బడ్జెట్ కేటాయించింది. ఇదే అవకాశంగా రాష్ట్రంలోని 25 ప్రాంతాల్లో దళితులు, గిరిజనులతో పాటు స్థానిక పోలీసు సిబ్బందికి అవగాహన పెంచుతామంటూ నాటి సీఐడీ అధిపతి సంజయ్ ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ కార్యక్రమాలు నిర్వహించేందుకు మార్గదర్శకాలకు భిన్నంగా హడావుడిగా ఒక ప్రైవేటు ఏజెన్సీతో కాంట్రాక్టు కుదుర్చుకున్నారు. 1.19 కోట్ల రూపాయలు ఖర్చు చేసేందుకు అగ్రిమెంటు చేసుకున్నారు. ఈ ఏడాది జనవరిలో 25 చోట్ల అవగాహనా కార్యక్రమాలు నిర్వహించగా, 24 చోట్ల ప్రభుత్వ భవనాలు వాడుకున్నారు. వీటికి అద్దె చెల్లించినట్లు ఇష్టానుసారం దొంగ బిల్లులు పెట్టారు. ప్రభుత్వ ఫర్నీచర్ వాడుకోగా, తెలిసినవారు టీ, స్నాక్స్ సమకూర్చారు. సీఐడీ అధికారులే తమ సెల్‌ఫోన్లతో వీడియోలు తీశారు. కానీ ఇందుకు లక్షల్లో ఖర్చు పెట్టినట్లు దొంగ బిల్లులు పెట్టారు. ఈ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతను ప్రైవేటు ఏజెన్సీకి ఇచ్చినట్టుగా 1.19 కోట్లు డ్రా చేశారు. మొత్తం 3.10 లక్షలు ఖర్చు చేసి, 1.16 కోట్లు నొక్కేశారు. అంతసొమ్ము ఖర్చయిందా అని అప్పట్లోనే సీఐడీ వర్గాల్లో అనుమానాలు వ్యక్తమయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో విచారణ జరిపించడంతో దోపిడీ వెలుగు చూసింది.

విజిలెన్స్ విచారణతో వెలుగులోకి

గత ప్రభుత్వంలో దళితులు, గిరిజనుల్లో అట్రాసిటీ చట్టంపై అవగాహన పెంచే సమావేశాల కోసం తగిన ఏర్పాట్లు చేసేందుకు ఏపీ సీఐడీ టెండర్లు పిలిచింది. అప్పుడు సీఐడీ అధిపతిగా సంజయ్ ఉన్నారు. ఈ టెండర్లలో హైదరాబాద్‌లోని క్రిత్వాప్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, సౌత్రికా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, మెటా పాయింట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థలు పాల్గొన్నాయి. క్రిత్వాప్ టెక్నాలజీస్ రూ.59,52,500తో ఎస్టీ సభల కోసం ఎల్-1గా, ఎస్సీల సభల కోసం రూ.59,51,100తో ఎల్-1గా నిలిచింది. ఈ ఏడాది జనవరిలో జరిగిన సమావేశాల్లో కనీస స్థాయిలో కూడా ఖర్చు చేయలేదని కూటమి ప్రభుత్వం వచ్చాక ఫిర్యాదులు వచ్చాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ హరీశ్ కుమార్ గుప్తా అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. రంగంలోకి దిగిన బృందాలు విచారణ చేపట్టాయి. హైదరాబాద్‌కు వెళ్లి విచారించగా క్రిత్వాప్ అనే సంస్థ పేరుతో బిడ్డర్ లేరని తేలింది. ఈ సంస్థ విజయవాడలో ఉన్నట్టు వెల్లడైంది. అలాగే సౌత్రికా టెక్నాలజీస్ కూడా విజయవాడలోనే ఉందని గుర్తించారు. ఈ రెండు సంస్థలూ ఒక్కరివేనని విచారణలో తేలింది. రాష్ట్రవ్యాప్తంగా 25 చోట్ల సీఐడీ నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఈ ఏజెన్సీ పాత్ర గురించి విజిలెన్స్ అధికారులు విచారించారు. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు రీజినల్ విజిలెన్స్ అధికారులు పూర్తి ఆధారాలు సేకరించి డీజీ హరీశ్ కుమార్ గుప్తాకు నివేదించారు.

సమావేశాలు ముగిశాక ఎంవోయూ..

ఎస్సీ, ఎస్టీల్లో అవగాహన కోసం 2024 జనవరి 27, 28, 29న మూడు రోజుల పాటు సభలు, సమావేశాలు జరిగాయి. సీతంపేట, తాండ్రి, చింతూరు, కేఆర్ పురం, నెల్లూరు, శ్రీశైలం, భామిని, కూనవరం, మైలవరం, వినుకొండ, కురుపాం, చింతపల్లి, బుట్టాయగూడెం, జగ్గయ్యపేట, మాచర్ల, వెదుళ్లపల్లి, దోర్నాల, మార్కాపురం, ఆత్మకూరు, వెంకటగిరి, కోడూరు, చిట్వేల్, వజ్రకరూరు, బెళగుప్ప, పాణ్యం, బి.కండ్రిగ, ఏర్పేడుతోపాటు పలు జిల్లా కేంద్రాలలో సమావేశాల్లో పాల్గొన్నవారికి వసతి, భోజనాలు, టీ, స్నాక్స్ వంటివి సమకూర్చేలా ప్రైవేటు ఏజెన్సీ క్రిత్వాప్ టెక్నాలజీస్‌తో ఒప్పందం చేసుకున్నారు. కుర్చీలు, మైక్ సెట్, బ్యానర్లు, ఫొటోలు, వీడియో గ్రఫీ తదితర ఏర్పాట్లతో పాటు అతిథులకు జ్ఞాపికలు అందజేసే బాధ్యత కూడా ఈ సంస్థదే. అయితే అసలు ట్విస్ట్ ఏంటంటే.. అవగాహనా సదస్సులు పూర్తయిన తర్వాత జనవరి 30న ఒప్పందం జరిగింది. టెండర్ దక్కించుకున్న ఏ సంస్థ అయినా ఎంవోయూ కుదుర్చుకుని వర్క్ ఆర్డర్ తీసుకున్న తర్వాతే పని మొదలు పెడుతుంది. ఏపీ సీఐడీలో మాత్రం అలా జరగలేదని విజిలెన్స్ విచారణలో వెలుగులోకి వచ్చింది.

బిల్లులన్నీ ఉత్తుత్తే...

అవగాహన సదస్సుల్లో పాల్గొన్న వందలాది మంది కోసం భోజనాలు, హాల్ అద్దె, వీడియోగ్రఫీ చార్జీ, ఫర్నీచర్ బాడుగ, ఇతరత్రా ఇన్వాయిస్‌ల పేరిట పెట్టిన బిల్లులన్నీ ఉత్తుత్తే అని విజిలెన్స్ తేల్చింది. సభలు నిర్వహించిన 25 ప్రాంతాల్లో 24 చోట్ల ప్రభుత్వ భవనాలే. కాబట్టి ఒక్క రూపాయి కూడా అద్దె చెల్లించాల్సిన పని లేదు. ప్రభుత్వ హైస్కూళ్లు, బాలుర వసతి గృహాలు, ఎంపీడీవో కార్యాలయాలు, గిరిజన గురుకులాలు, వెలుగు కార్యాలయాలు, సామాజిక భవనాలతో పాటు ఆంజనేయ స్వామి ఆలయాల్లో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఒకచోట ప్రైవేటు హాలు తీసుకున్నప్పటికీ అద్దె లేకుండా పోలీసులకు ఇచ్చామని ఆ యజమాని విజిలెన్స్ విచారణలో చెప్పారు. అయితే సమావేశ మందిరాలకు రెండు నుంచి మూడు లక్షల చొప్పున అద్దెలు చెల్లించినట్లు బిల్లులు సృష్టించారు. ఇక వీడియో గ్రఫీ అంతా సీఐడీ అధికారులే చూసుకున్నారు. తమ సెల్ ఫోన్లతో తీశారు. అయితే వీడియో గ్రాఫర్లకు బిల్లులు అంటూ లక్షల్లో పెట్టారు. ఇలా ప్రైవేటు ఏజెన్సీకి 1.19 కోట్లు ఇచ్చేశారు.

అసలు ఖర్చు 3.10 లక్షలే..

విజిలెన్స్ విచారణలో బిల్లులు పరిశీలించగా, ఆశ్చర్యకరమైన అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. సమావేశ మందిరానికి మూడు లక్షలు చెల్లించామని చెప్పిన చోట ఎంపీడీవో కార్యాలయం ఉంది. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, కర్నూలు, గుంటూరు, తిరుపతి పరిధిలో ఎక్కడ విచారించినా టీ, బిస్కెట్లు, భోజనాల కోసం పది వేల నుంచి పాతిక వేల లోపు తీసుకున్నామని చెప్పారు. అంతా లెక్క చేస్తే 2.66 లక్షలు మాత్రమేనని తేలింది. ఇతర ఖర్చులన్నీ కలిపి మొత్తం 3.10 లక్షలు ఖర్చు చేసినట్టు గుర్తించారు. అత్యధికంగా విశాఖపట్నం పరిధిలో 85 వేలు, రాజమహేంద్రవరంలో 75 వేలు, కర్నూలులో 65 వేలు, నెల్లూరులో 45 వేలు, విజయవాడలో 20 వేలు, గుంటూరులో 20 వేల చొప్పున మొత్తం 3.10 లక్షలు ఖర్చు చేసినట్లు నిర్ధారణకు వచ్చారు. అయితే నాటి సీఐడీ బాస్ ప్రైవేటు ఏజెన్సీ పేరిట ఏకంగా 1.19 కోట్లు డ్రా చేసుకున్నారు.

1.16 కోట్లు రికవరీ చేయాలి

ఎస్సీ, ఎస్టీల పేరుతో 1,19,03,600 రూపాయల ప్రభుత్వ నిధులు డ్రా చేసుకుని కేవలం రూ.3,10,000 మాత్రమే ఖర్చు చేసిన వారి నుంచి రూ.1,15,93,600 రికవరీ చేయాలని విజిలెన్స్ సిఫారసు చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఈ మేరకు నివేదిక సమర్పించింది. ఈ కుంభకోణంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరిపై చర్య తీసుకోవాలని, సంబంధిత ఏజెన్సీ క్రిత్వాప్‌పైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది.

సీఐడీ చీఫ్‌గా అరాచకాలు

సీనియర్ ఐపీఎస్ సంజయ్ ఎక్కడ పని చేసినా అంత గొప్ప పేరు రాలేదు. అయితే రాష్ట్రంలో తనంత సిన్సియర్ అధికారి లేరని తనకు తానే సర్టిఫికెట్ ఇచ్చుకుంటారు. వైసీపీ ప్రభుత్వంలో తాడేపల్లి ప్యాలెస్‌కు నచ్చడంతో సీఐడీ చీఫ్‌గా నియమితులయ్యారు. చట్టాలు పక్కనపెట్టి జగన్ చెప్పినట్లల్లా చేశారనే విమర్శలు ఉన్నాయి. జగన్ పాలనలో అరాచకాలపై సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను తెలిసో, తెలియకో ఫార్వర్డ్ చేసిన వృద్ధుల్ని, మహిళల్ని కూడా వదలకుండా వేధింపులకు గురి చేశారు.

క్రిత్వాప్ ప్రతినిధులే రాలేదు

విజిలెన్స్ విచారణలో మరో ఆశ్చర్యకర విషయం వెలుగులోకి వచ్చింది. కోటి రూపాయలకు పైగా టెండర్ దక్కించుకున్న క్రిత్వాప్ సంస్థ నుంచి అవగాహన సదస్సులకు ప్రతినిధులే హాజరు కాలేదు. ఎంవోయూ ప్రకారం గతంలో ఇటువంటి సభలు, సమావేశాలు నిర్వహించిన అనుభవం ఉండాలి. అట్రాసిటీ చట్టాలపై అవగాహన ఉండాలి. సామాజిక స్పృహ కలిగి ఉండాలి. ఇవన్నీ టెండర్ నిబంధనల్లో ఉన్నాయి. 50 లక్షల విలువ దాటిన టెండర్ పిలవాలంటే రాష్ట్ర స్థాయిలో ప్రముఖ తెలుగు, ఆంగ్ల దినపత్రికల్లో ప్రకటన ఇవ్వాలి. ఇవేవీ జరగకుండానే డీజీ ర్యాంకు ఐపీఎస్ అధికారి అక్రమాలకు పాల్పడ్డారు.



తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

జాతీయ రహదారులపై 'దీపావళి' రద్దీ

- టోల్‌ప్లాజాల వద్ద భారీగా ట్రాఫిక్ జామ్

కేతేపల్లి, చౌటుప్పల్ టౌన్, చౌటుప్పల్ రూరల్, బీబీనగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ, వారాంతపు సెలవులు ముగియడంతో హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలతో జాతీయ రహదారులు రద్దీగా మారాయి. విజయవాడ-హైదరాబాద్, అద్దంకి-నార్కట్‌పల్లి రహదారులు సందడిగా మారాయి. ఎప్పుడూ వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే 65వ నెంబరు జాతీయ రహదారిపై ఆదివారం రద్దీ మరింత పెరిగింది. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ గ్రామశివారులోని టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్ లేన్ వాహనాలతో కిక్కిరిసింది. టోల్‌ప్లాజాకు దాదాపు అర కిలోమీటరు వరకు బారులు తీరిన వాహనాలు నెమ్మదిగా ముందుకు కదిలాయి. ఒక్కో వాహనం టోల్‌ప్లాజా నుంచి బయటకు వెళ్లేందుకు దాదాపు 5నిమిషాలు పట్టింది. సాధారణంగా రోజుకు 20వేల వాహనాలు వెళ్లే ఈ రహదారిపై ఆదివారం మరో 10వేల వాహనాలు అదనంగా వెళ్లినట్లు అంచనా. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్దా వాహనాల రద్దీ పెరిగింది. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి, స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి ఆలయాలకు వెళ్లిన భక్తులు, సాధారణ ప్రయాణికులతో టోల్‌ప్లాజా నుంచి సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద పెద్దసంఖ్యలో వాహనాలు బారులు తీరాయి. చౌటుప్పల్ పట్టణంలో కిలోమీటరు మేర ట్రాఫిక్ రద్దీ నెలకొంది. అన్ని టోల్‌ప్లాజాల వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో ఆయా ప్రాంతాల ప్రజలు రోడ్డు దాటడానికి ఇబ్బందులు పడ్డారు.

తిరుమలలో నేలకూలిన భారీ వృక్షం



తిరుమల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని రాంభగీచ బస్టాండు వద్దనున్న పార్కింగ్‌లో ఆదివారం రాత్రి ఓ భారీ వృక్షం కూలిపోయింది. ఆ చెట్టుపక్కనే ఉన్న రెండు కార్లు ధ్వంసమయ్యాయి. చెట్టు కూలిన సమయంలో భక్తులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు హుటాహుటిన వృక్షాన్ని తొలగించారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెట్టు కిందభాగం కుళ్లిపోయి కూలి ఉండొచ్చని ఫారెస్ట్ సిబ్బంది పేర్కొన్నారు.

అంతఃపుర మహిళలకు సేవ చేయడానికి తెలుగు వారు వచ్చారు

- ఇపుడు వారంతా తమది తమిళజాతి అంటున్నారు
- సినీ నటి కస్తూరి వివాదాస్పద వ్యాఖ్యలు

చెన్నై, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజుల కాలంలో అంతఃపుర మహిళలకు సేవ చేయడానికి వచ్చినవారే తెలుగు వారని, అలా వచ్చిన వారంతా ఇపుడు తమది తమిళ జాతి అంటూ పెద్ద మాటలు మాట్లాడుతున్నారని బీజేపీ నాయకురాలు, తమిళ సినీ నటి కస్తూరి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు బీజేపీ శాఖకు చెందిన సీనియర్ నేతలు అర్జున్ సంపత్, గురుమూర్తి నగరంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. '300 ఏళ్ల క్రితం ఒక రాజు వద్ద అంతఃపుర మహిళలకు సేవ చేయడానికి వచ్చిన తెలుగువారు.. ఇప్పుడు తమది తమిళ జాతి అంటుంటే... మరి ఎప్పుడో ఇక్కడకు వచ్చిన బ్రాహ్మణులను తమిళులు కాదని చెప్పడానికి మీరెవరు..?' అని పరోక్షంగా ద్రావిడ సిద్ధాంతవాదులను ప్రశ్నించారు. ప్రస్తుత తమిళనాడు మంత్రివర్గంలో ఐదుగురు మంత్రులు తెలుగు మాట్లాడేవారు ఉన్నారన్నారు. 'ప్రభుత్వంలో భాగం, అధికారంలో భాగం కావాలి' అంటూ డీపీఐ ప్రధాన కార్యదర్శి తోల్ తిరుమావళవన్ కొత్త నినాదం తీసుకొచ్చారని, కానీ.. తెలుగు మాట్లాడే వారికి ఎప్పుడో ప్రభుత్వంలో, అధికారంలో భాగస్వామ్యం కల్పించారని అన్నారు. హిందూ సనాతన ధర్మ పరిరక్షణ కోసం మనమంతా కలిసికట్టుగా ఉండాలని పిలుపునిచ్చారు. 'ఇతరుల ఆస్తులు లూటీ చేయొద్దు, ఇతరుల భార్యలపై మోజుపడొద్దు.. ఒకరి కంటే ఎక్కువ మంది భార్యలను చేసుకోవద్దు.. అని బ్రాహ్మణులు చెబుతున్నారు. అందుకే వారికి వ్యతిరేకంగా తమిళనాట ప్రచారం సాగుతోంది' అని కస్తూరి పేర్కొన్నారు.



నటి కస్తూరి

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.